తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

సచిత్రమాసపత్రిక

మార్చి 2020. వెల రూ.5/-



తిరుమల తిరుపతి దేవస్థానములు

# తిరుపతి
# శ్రీకోదండరామస్వామివారి బ్రహ్మోత్సవం

## 23-03-2020 నుండి 31-03-2020 వరకు





**23-03-2020 సోమవారం**
పగలు: ధ్వజారోహణం
రాత్రి: పెద్దశేషవాహనం

**24-03-2020 మంగళవారం**
పగలు: చిన్నశేషవాహనం
రాత్రి: హంసవాహనం

**25-03-2020 బుధవారం**
పగలు: సింహవాహనం
రాత్రి: ముత్యపుపందిరివాహనం

**26-03-2020 గురువారం**
పగలు: కల్పవృక్షవాహనం
రాత్రి: సర్వభూపాలవాహనం

**27-03-2020 శుక్రవారం**
పగలు:
పల్లకీలో మోహినీ అవతారోత్సవం
రాత్రి: గరుడవాహనం

**28-03-2020 శనివారం**
పగలు: హనుమద్వాహనం
సాయంత్రం: వసంతోత్సవం
రాత్రి: గజవాహనం

**29-03-2020 ఆదివారం**
పగలు: సూర్యప్రభవాహనం
రాత్రి: చంద్రప్రభవాహనం

**30-03-2020 సోమవారం**
పగలు: రథోత్సవం
రాత్రి: అశ్వవాహనం

**31-03-2020 మంగళవారం**
పగలు: చక్రస్నానం
రాత్రి: ధ్వజావరోహణం



# గీతాశ్లోకార్థసారం

**శ్లో : భవాన్ భీష్మశ్చ కర్ణశ్చ కృపశ్చ సమితింజయః ।**
**అశ్వత్థామా వికర్ణశ్చ సౌమదత్తిస్తథైవ చ ॥**

(శ్రీమద్భగవద్గీత 01వ అధ్యాయం-08వ శ్లోకం)

**ప్రతిపదార్థం:** భవాన్=మీరు; భీష్మః=పితామహుడైన భీష్ముడు; చ=కూడా; కర్ణః= కర్ణుడు; చ=మరియు; కృపః=కృపుడును; చ=మరియు; సమితింజయః= యుద్ధమునందెప్పుడును జయశీలురైన; అశ్వత్థామా= అశ్వత్థామయు; వికర్ణః= వికర్ణుడును; చ= కూడా; సౌమదత్తిః= సోమదత్తుని కుమారుడు; తథా= అలాగుననే; ఏవ= నిశ్చయముగా; చ= కూడా.

**భావం:** యుద్ధంలో ఎల్లప్పుడూ విజయాన్ని సాధించే మీరు, భీష్ముడు, కర్ణుడు, కృపుడు, అశ్వత్థామ, వికర్ణుడు మరియు సోమదత్తుని తనయుడైన భూరిశ్రవుడు వంటివారు మన సైన్యంలో ఉన్నారు.

## వేంకటవిభుఁడే కలఁడు


అప్పులవారే అందరును
కప్పఁగఁ దిప్పఁగఁ గర్తలు వేరీ

ఎక్కడ చూచిన నీప్రపంచమునఁ
జిక్కులు సిలుగులుఁ జింతలునే
దిక్కెవ్వరు యీతీదీపులలోఁ
దిక్కుముక్కులకు దేవుఁడె కాక


యేదిం దలంచిన నేకాలంబును
సూదులమూఁటలసుఖము లివి
కాదన నౌననఁ గడగనిపించఁగ
పోదికోఁడు తలఁపునఁ గలఁ డొకఁడే

యెన్నఁడు వీడీ నెప్పడు వాసీఁ
బన్నిన తమతమబంధములు
వున్నతి సేయఁగ వొప్పులు నెరపఁగ
వెన్నుఁడు వేంకటవిభుఁడే కలఁడు

(అధ్యాత్మ సంకీర్తనలు సంపుటం-01, సంకీర్తన-81)



ఈ లోకంలో అందరికీ బాధలు ఉంటాయి. బాధలు అన్నీ వారి వారి పూర్వకర్మఫలాలు. అందరూ ఇతరుల సహాయం అవసరమైనవారే! కావున అందరూ ఏదో ఒక విధంగా ఋణగ్రస్తులే! ఎక్కడ చూచినా చిక్కులు, చింతలు. ఈ వాతావరణంలో దేవుడు గాక వేరు దిక్కెవ్వరున్నారు? ఏ కాలంలోనైనా సుఖాలు సూదుల వలె బాధిస్తాయి. సుఖ దుఃఖాల్లో మనల్ని కాపాడే ఒకే ఒక్క దిక్కు అయిన స్వామి మదిలో గలడు. సంసారబంధాలు మనల్ని ఎప్పుడు విడుస్తాయో గదా! ప్రజలను మంచిదారిలో నడిపించి, ఉద్ధరించడానికి శ్రీమహావిష్ణువైన శ్రీవేంకటేశ్వరస్వామియే ఉన్నాడు.





పాఠకులకు, రచయిత(త్రు)లకు,
ఏజెంట్లకు అందరికీ....

# శ్రీ 'శార్వరి' నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు!

దేవదేవుడైన శ్రీవేంకటేశ్వరుని కరుణాకటాక్షవీక్షణాలు అందరిపై అనవరతం ప్రసరించాలనీ మరియు ఆయురారోగ్య ఐశ్వర్యాలు ప్రసాదించాలనీ స్వామివారిని ప్రార్థిస్తూ...

మీ... ప్రధానసంపాదకుడు

## STATEMENT ABOUT OWNERSHIP AND OTHER PARTICULARS ABOUT

## SAPTHAGIRI

(MONTHLY)
FORM IV
See Rule 8

| | | |
|---|---|---|
| 1. | Place of Publication | : TIRUPATI |
| 2. | Periodicity of its Publication | : Monthly |
| 3. | Honorary Editor | : Sri Anil Kumar Singhal, I.A.S., Executive Officer, T.T.D. |
| 4. | Printer's Name | : Sri R.V.Vijaya Kumar, B.A., B.Ed., |
| | Whether citizen of India | : Yes |
| | Address | : Dy.E.O.(Publications & Press), T.T.D., Tirupati. |
| 5. | Editor & Publisher's Name | : Dr.K.Radha Ramana, M.A.,M.Phil.,Ph.D., |
| | Whether citizen of India | : Yes |
| | Address | : Chief Editor, Sapthagiri, T.T.D. Journal, Tirupati |
| 6. | Name and address of individuals who own the Newspaper and partners or shareholders holding more than one percent of the Total Capital | Board of Trustees represented by the Executive Officer on behalf of T.T.D., Tirupati |

I, K.Radha Ramana, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

TIRUPATI
Date : 29-2-2020

(Sd.) Dr. K.RADHA RAMANA
Signature of the Publisher



తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి



# 'సప్తగిరి' చందాదారులకు విజ్ఞప్తి

సప్తగిరి మాసపత్రిక చందాదారులకు ప్రతినెల సకాలంలో చేరడానికి అనేకచర్యలు తీసుకుంటున్న సంగతి పాఠకలోకానికి విదితమే! ఈ క్రమంలో చందాదారుల చిరునామాల క్రమబద్ధీకరణకు అనేకచర్యలు తీసుకుంటున్నాం. చందాదారులు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ క్రిందివిధంగా ప్రధానసంపాదకకార్యాలయానికి తెలియజేయవచ్చు.



01) 'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు sapthagiri_helpdesk@tirumala.org ద్వారా తెలియజేయవచ్చు.

02) సప్తగిరి చందాదారుల చిరునామాల క్రమబద్ధీకరణకోసం 0877- 2264543 ఫోన్ నెంబరుకు చందాదారులు తమ పూర్తి చిరునామాను పిన్‌కోడ్, సెల్‌ఫోన్‌నెంబరుతో సహా కార్యాలయ పనివేళల్లో (ఉ.10.30 గం॥ల నుండి సా.5.00 గం॥ల లోపు) మరొకసారి తెలియజేయగలరు.

03) పై ఫోనునెంబరుద్వారాగానీ, sapthagiri_helpdesk@tirumala.org ద్వారా గానీ తెలుపగలరు.

04) ఆన్‌లైన్ చందాదారులు తమ పూర్తి చిరునామాలను క్రమబద్ధీకరణకోసం తి.తి.దే. వెబ్‌సైట్‌ద్వారా మరొకసారి తెలియజేయండి!

– ప్రధాన సంపాదకుడు




తిరుమల తిరుపతి దేవస్థానముల సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 50 మార్చి, 2020 సంచిక : 10


వేంకటాద్రి సమం స్థానం
బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో
న భూతో న భవిష్యతి ॥

## ఈ నెలలో....


| | | |
|---|---|---|
| ఉగాది | బ్రహ్మశ్రీ మైలవరపు శ్రీనివాసరావు | 07 |
| సందేహాలు - సమాధానాలు | శ్రీ వైద్యం వేంకటేశ్వరాచార్యులు | 12 |
| శ్రీకృష్ణభగవద్విజయం | డా॥ వుయ్యూరు లక్ష్మీనరసింహారావు | 13 |
| ఆసురీగుణాలతో పతనం తప్పదు! | డా॥ వైష్ణవాంఘ్రిసేవకదాస్ | 14 |
| జెండాపై కపిరాజు... | ఆచార్య పి.ఎల్.శ్రీనివాసరెడ్డి | 15 |
| శిరసు శ్రీవిభు వందనానికే! | డా॥ వెలువోలు నాగరాజ్యలక్ష్మి | 17 |
| తండ్రిని పిలిచిన కొడుకు | ఆచార్య కె. సర్వోత్తమరావు | 19 |
| కైంకర్యమే తనువు దాల్చితే... | డా॥ కంపల్లె రవిచంద్రన్ | 22 |
| శ్రీరామరాజ్యం | డా॥ వి.కృష్ణవేణి | 23 |
| శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయం, తరిగొండ | శ్రీ ఐ.ఎల్.ఎన్. చంద్రశేఖరరావు | 25 |
| దివ్యక్షేత్రం... తిరుమల | శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం | 31 |
| కాలమే దైవమైన ఉగాది | డా॥ కప్పగంతు రామకృష్ణ | 33 |
| వృత్రాసురుడు | డా॥ వైష్ణవాంఘ్రిసేవకదాస్ | 35 |
| అతిగా ఆశపడద్దు... | మాస్టర్ జి.సోహన్‌సాయి | 37 |
| వేదాలు తెచ్చిన నారాయణ | ఆచార్య గార్లపాటి దామోదరనాయుడు | 38 |
| అన్నమయ్య స్తుతించిన స్త్రీ దేవతామూర్తులు | డా॥ పి.సి.వేంకటేశ్వర్లు | 40 |
| లోకాలన్నీ గౌరవించే ఇల్లాలు | డా॥ అద్దంకి శ్రీనివాస్ | 42 |
| ఆయన అనుకుంటేనే... | శ్రీమతి కె.విజయలక్ష్మి | 44 |
| పరమయోగీశ్వరుల పద్ధతి | శ్రీమతి శ్రీదేవీమురళీధర్ | 45 |
| మామిడితో ఎన్నో లాభాలు! | డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ | 46 |
| సంస్కృతం నేర్చుకుందాం..!! | మహామహోపాధ్యాయ సముద్రాల లక్ష్మణయ్య & కిరణ్ భట్ | 47 |
| యజ్ఞోపవీత ధారణ ప్రాశస్త్యమ్ | డా॥ పణతుల సుబ్బరాఘవయ్య | 48 |
| ఊర్మిళ | డా॥ గాలి రాజేశ్వరి | 51 |
| రాశిఫలాలు | బ్రహ్మశ్రీ టి.వి.కె.పూర్ణప్రసాద సిద్ధాంతి | 53 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు | 54 |


ముఖచిత్రం : శ్రీవారి తెప్పోత్సవం, తిరుమల
వెనుక చిత్రం : శ్రీసీతాలక్ష్మణ సమేత శ్రీకోదండరామస్వామివారు, తిరుపతి


**గౌరవ సంపాదకుడు**
శ్రీ అనిల్‌కుమార్ సింఘాల్, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు.

**ప్రచురణకర్త-ప్రధాన సంపాదకుడు**
డా॥ కె.రాధారమణ, ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,

**సంపాదకుడు**
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

**ఉపసంపాదకుడు**
డా॥ కంపల్లె రవిచంద్రన్, ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,

**ముద్రాపకుడు**
శ్రీ ఆర్.వి.విజయకుమార్, బి.ఏ., బి.ఇడి.,
ఉపకార్యనిర్వహణాధికారి (ప్రచురణలు & ముద్రణాలయం), తి.తి.దే., తిరుపతి.

**ఫోటోలు**
శ్రీ పి.ఎన్.శేఖర్, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, సహాయఫోటోగ్రాఫర్, తి.తి.దే.,

సప్తగిరి మాస పత్రిక
ఇతర వివరాలకు ఫోన్ నెంబర్లు
0877-2264543
0877-2264359
0877-2264360

విడి ప్రతి : రూ. 5/-
సం॥ చందా : రూ. 60/-
జీవిత చందా : రూ. 500/-
విదేశాలకు సం॥చందా : రూ. 850/-



ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.



24 గంటలూ పనిచేసే తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్ నెం.
0877 2277777 / 2233333

వెబ్‌సైట్- www.tirumala.org, www.tirupati.org; ఆన్‌లైన్ సేవలు/వసతిసౌకర్యం కొరకు- www.ttdsevaonline.com
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు- sapthagiri_helpdesk@tirumala.org; ద్వారా తెలియజేయవచ్చు.

# సౌమనస్యమే శుభాకాంక్ష!

భారతీయులు సర్వత్రాభగవద్భావన గలిగి, భగవంతుణ్ణే దర్శించగల విజ్ఞానధనులు, ఘనులు. ప్రకృతి అంతా స్త్రీమయం. పురుషుడు–పురుషోత్తముడైన భగవంతుడొక్కడే! రూపం లేనిదే– అయినా ప్రచోదనశక్తితో ప్రకృతిని చైతన్యపరచి, మానవజీవితాన్ని లక్ష్యసాధనలో విజయుణ్ణి చేసేది కాలమే! అందుకే భగవద్గీతలో గీతాచార్యుడు 'సర్వాన్నీ నడిపించే కాలాన్ని నేనే' అన్నాడు. ప్రపంచమంతటా అన్ని దేశాలలో వారి వారి కాలగణనాన్ని బట్టి – ఏదో ఒకపేరుతో సంవత్సరాదిని మొదటిపండుగగా జరుపుకోవడం చూస్తున్నాం. మనం సంవత్సరాదిని 'ఉగాది' పేరుతో జరుపుకుంటున్నాం.

మనం చాంద్రమానం రీత్యా వసంతఋతువు చైత్రశుద్ధపాడ్యమినాడు ఉగాదిని జరుపుకుని–ఆ సంవత్సరమంతా ఉత్సాహంగా, ఉల్లాసంగా, ఉన్నతంగా, సత్ఫలదాయకంగా ప్రశాంతజీవనాన్ని గడపాలని కాలాత్మకుడైన భగవంతుణ్ణి ప్రార్థిస్తాం. ఇది సంవత్సరాత్మక కాలప్రమాణంలో, ప్రయాణంలో తొలిఅడుగు వేసే శుభోదయ పర్వదినం.

ఈ నెలలోనే 'అంతర్జాతీయ మహిళాదినోత్సవం' వస్తుంది. విశ్వమంతా శక్తిమయం. ఆ శక్తినే స్త్రీమూర్తిగా–విశేషించి మాతృమూర్తిగా భావించడం, పూజించడం మన విశిష్టత. **"యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః"**– 'ఎక్కడ స్త్రీలు గౌరవించబడుతారో అక్కడ దేవతలు ఆనందంతో మనల్ని దీవిస్తుంటారు. విశ్వమంతా స్త్రీమూర్తి నుండే అనేకవిధాలుగా రూపొందుతుంది. స్త్రీ మొదట మాతృమూర్తి. ఆ పైన సంబంధబాంధవ్యాల్ని బట్టి ఎన్నో పేర్లతో వ్యవహరించబడుతోంది. కానీ, పూసల్లోదారం వలే అన్ని పేర్లలో అంతర్గతమైన శక్తి మాతృరూపమే! అందుకే వేదం 'మాతృదేవోభవ"–'తల్లిని దేవతగా కలవాడివి కమ్ము'– అంటే 'తల్లిని దేవతగా పూజించు' అని పేర్కొంది. ఈ వేదవాక్యం ప్రపంచదేశాలన్నిటికీ వర్తించే సర్వకాలీన మహామంత్రం. నవశిశువుకు మొదటిగురువు తల్లియే. తల్లి శిశువును కని లోకాన్ని చూపిస్తుంది. తండ్రి ఆ శిశువుకు లోకాన్ని గూర్చి తెల్పుతాడు. ఇలా తల్లిదండ్రులిద్దరూ శిశుపోషణ విషయంలో సమత, మమత, బాధ్యత కలవారే! ప్రాచీనకాలంలో మాతృవ్యవస్థ ఉండేది. కుటుంబ బాధ్యతానిర్వహణలో తల్లే మహారాణి. భౌతిక, ఆధ్యాత్మిక గురువు తల్లే! ఆ తల్లిని తల్లడపెడితే అతని మనుగడ అస్తవ్యస్తమౌతుంది. ప్రతివాడికి తల్లిపెట్టే రక్షే శ్రీరామరక్ష! ఈ విషయాన్ని నేటి యువత ముఖ్యంగా గుర్తించుకోవాల్సిన అవసర ముంది. స్త్రీ గౌరవం– దేవతా గౌరవమే!

ఈ **'శార్వరి'** తన హింసాప్రవృత్తి అర్థాన్ని వదిలి మనల్ని చెడువైపు నుంచి మరలించి మనందరికీ శ్రీవేంకటేశ్వరస్వామి ద్వారా శుభఫలాలిచ్చి, ఆనందపరుస్తుందని– **'సప్తగిరి'** శుభాకాంక్షలు!

# ఉగాది

– బ్రహ్మశ్రీ మైలవరపు శ్రీనివాసరావు



ఏదైనా ఓపనిని కొత్తగా ప్రారంభించేందుకు మంచి రోజేనా? కాదా? అని ఆలోచించే ఓ విధానాన్ని మనకు ముందుగా నేర్పింది బ్రహ్మదేవుడే. ఎందు కంటే ఆయనే 'సృష్టిని ప్రారంభించడానికి ఏది మంచిరోజు'? అని ఆలోచించి, ఒక మంచి రోజున సృష్టిని ప్రారంభించాడు. అదే యుగ ఆది రోజు ఉగాది రోజు. ఈ యుగాది రోజు అన్ని విధాలా మొదటిదై ఎలా మంచిరోజయిందో సంగ్రహంగా చూద్దాం!.

'సృష్టి చేద్దా'మనుకోగానే నాలుగు తలలున్న చతుర్ముఖ బ్రహ్మగారి ముందుకు 60 సంవత్సరాలొచ్చిపడ్డాయి. వీటిలో మొదటిదేదో దాన్లోనే సృష్టి చెయ్యాలనుకున్నాడు– బ్రహ్మ.

సంవత్సరమనగానే ఉత్తరాయణం (జనవరి 14 నుంచి జూలై 15 వరకు), దక్షిణాయణం (జూలై 16 నుంచి జనవరి 16 వరకు) అని రెండొచ్చిపడ్డాయి. వీటిలోనూ మొదటిదేదో దాన్లోనే సృష్టి చెయ్యాలనుకున్నాడు.

ఉత్తరాయణమనగానే వసంత– గ్రీష్మ– వర్షఋతువుల పేరిట మూడొచ్చిపడ్డాయి. వీటిలోనూ మొదటిదేదో దాన్లోనే సృష్టి చెయ్యాలనుకున్నాడు.

ఋతువనగానే రెండునెలలు (చైత్రం, వైశాఖం) వచ్చాయి. వీటిలోనూ మొదటిదేదో దాన్లోనే సృష్టి చెయ్యాలనుకున్నాడు.

నెల అనగానే శుద్ధపక్షం– లేదా– శుక్లపక్షం (పూర్ణిమ వచ్చేది దీనిలోనే) కృష్ణపక్షం–లేదా–బహుళపక్షం (అమావాస్య వచ్చేది దీనిలోనే) అని రెండొచ్చిపడ్డాయి. వీటిలోనూ మొదటి దేదో దాన్లోనే సృష్టి చెయ్యాలనుకున్నాడు.

శుద్ధపక్షమనగానే పాడ్యమినుంచి పూర్ణిమ వరకూ ఉన్న పదిహేను తిథులొచ్చిపడ్డాయి. వీటిలోనూ మొదటిదేదో దాన్లోనే సృష్టి చెయ్యాలనుకున్నాడు.

పాడ్యమి అనగానే పగలు, రాత్రి అనే రెండొచ్చి పడ్డాయి. వీటిలోనూ మొదటిదేదో దాన్లోనే సృష్టి చెయ్యాలను కున్నాడు.

**2020, మార్చి 25వ తేది ఉగాది సందర్భంగా...**

పగలనగానే పదిహేను ముహూర్తాలొచ్చిపడ్డాయి. వీటిలోనూ మొదటిదేదో దాన్లోనే సృష్టి చెయ్యాలనుకున్నాడు. ఇలా అన్నిటా మొదటిది– మొదటిది– మొదటిది అనుకొంటూ సృష్టిని ప్రారంభించాడు.

అలా, కాలంలోని అరవైసంవత్సరాలలోనూ **మొదటిదైన ప్రభవ సంవత్సరంలో**– ప్రతి సంవత్సరానికీ ఉండే ఉత్తర–దక్షిణ అయనాలనే రెంటిలోనూ **మొదటిదైన ఉత్తరాయణంలో**– ప్రతి ఉత్తరాయణంలోనూ ఉండే వసంత–గ్రీష్మ–వర్ష–అనే ఋతువులు మూటిలోనూ **మొదటిదైన వసంత ఋతువులో**– ప్రతి వసంతఋతువులోనూ ఉండే చైత్రం– వైశాఖంఅనే మాసాలు రెంటిలోనూ **మొదటిదైన చైత్రమాసంలో**– ప్రతి మాసంలోనూ

ఉండే శుద్ధ- కృష్ణమనే పక్షాలు రెంటిలోనూ **మొదటిదైన శుద్ధ(శుక్ల)పక్షంలో**- ప్రతి పక్షంలోనూ ఉండే పాడ్యమినుంచి వచ్చే పదిహేను తిథుల్లోనూ **మొదటిదైన పాడ్యమిలో**- ప్రతి పాడ్యమిలోనూ ఉండే పగలు రాత్రి అనే రెంటిలో **మొదటి దైన పగటిలో**-ప్రతి పగటిలోనూ ఉండే పదిహేను ముహూర్తాల్లో **మొదటిదైన బ్రహ్మీముహూర్తంలో**- శ్రీమహావిష్ణువుకున్న అవతారాలు పదింటిలోనూ తన **మొదటిదైన** మత్స్యావతారాన్ని శ్రీహరి ఎత్తుతూన్నవేళ- సృష్టి- స్థితి- లయాలనే మూటిలోనూ **మొదటిదైన సృష్టికార్యాన్ని**- బ్రహ్మ- విష్ణు- మహేశ్వరులనే ముగ్గురిలోనూ **మొదటివాడైన చతుర్ముఖ బ్రహ్మ**- తన సృష్టిని ప్రారంభించాడన్నమాట.



చైత్రశుద్ధపాడ్యమి అయిన ఈ రోజు ఈ విధంగా యుగ ఆది రోజు- ఉగాదిరోజు- సర్వప్రథమమైన రోజు ఔతోందన్నమాట-చాంద్రమానంరీత్యా.

ఈ రహస్యాన్ని మరచిపోకుండా చేసేందుకే-

**మొట్టమొదటగా** కోసిన మామిడిముక్కల్ని **మొట్ట మొదటిసారి** తీసిన వేపపూతతోనూ **మొట్టమొదటగా** వండిన బెల్లంతోనూ **మొట్టమొదటగా** పిసికిన చింతపండుతోనూ **మొట్టమొదటగా** తెచ్చిన ఒకటి రెండు మిరియపు గింజల పొడితోనూ కలిపి, భక్ష్య- భోజ్య- చోష్య- లేహ్య- పానీయాలనే ఐదింటిలోనూ **మొట్టమొదటిదైన** భక్ష్యం(తినే పచ్చడి)గా చేసి, అందరలోకీ పెద్దవాడూ- లేదా- పెద్ద ఆమే అయిన **మొట్టమొదటి** వ్యక్తి ద్వారా అందరికీ **మొట్టమొదటి** వాడైన ఆ భగవంతునికి ఆ పచ్చడిని నైవేద్యం పెట్టింది, ఆ రోజుకి తినబోయే వాటిలో **మొట్టమొదటి ఆహారంగా ఈ పచ్చడినే తినాలనీ- తినిపించాలనీ ప్రాచీనులు నిశ్చయించారు.**

సంప్రదాయంలోని భావం తెలిసి పండుగని జరుపుకుంటే ఎంత ఆనందంగా ఉంటుందో కదా! అందుకే అన్నారు- 'జ్ఞాత్వా కర్మాణి కుర్వీత'- అని. 'అర్థం తెలిసి ఆచరించుకోవలసింది సుమా!' అని దాని అర్థం.

ఈ యుగాదిని సృష్టించినవాడు బ్రహ్మ కాబట్టి, పంచభూతాలైన పృథివి- అప్- తేజస్- వాయు- ఆకాశాల్లో మార్పుని కూడ సృష్టించాడాయన.

అందుకే **పృథివి** (భూమి)లోని ప్రతి వృక్షమూ కొత్త కొత్త చిగురుటాకులని వేస్తూ కొత్త చీరల్ని కట్టుకున్న ముత్తైదువల్లా గోచరిస్తాయి.

కృతయుగం వైశాఖశుద్ధ తదియ నాడూ, త్రేతాయుగం కార్తిక శుద్ధ నవమినాడూ, ద్వాపర యుగం శ్రావణ శుద్ధ త్రయోదశినాడూ ప్రారంభంకాగా, కలియుగం మాత్రం చైత్ర శుద్ధ పాడ్యమినాడు ప్రారంభమైంది.

చెట్లకి కొత్త రంగు రంగు ఆకుల్ని పరమేశ్వరుడీయబోతున్నాడని సంకేత రూపంగా చెప్పడానికే దీనికి వెనకదీ-

పండుగలన్నింటిలోనూ చివరిదీ అయిన హోలికాపూర్ణిమ నాడు (హోలీ) రంగురంగుల నీళ్లని లోకంలోని జనులంతా తమ మీద తామూ, తమలో తామూ కూడ వేడుకగా చల్లుకుంటారు.

## ఇతిహాస పరంగా

ఉగాది పండుగ వచ్చే వసంతకాలానికీ ఓ ప్రత్యేకత ఉంది. తెలుగు నెలల్లో మొదటి రెండూ అయిన చైత్రం, వైశాఖం కలిపి వసంత ఋతువూ లేదా- వసంతకాలం అవుతోంది. అలాంటి ఈ వసంతకాలం ఎంత గొప్పదో ఇతిహాసమైన శ్రీమద్రామాయణం ప్రకారం చూద్దాం!

రాముని పట్టాభిషేకానికి ఈ వసంతకాలమే మంచిదని వశిష్ఠాది మహర్షులు నిర్ణయించారు. మరి 'పట్టాభిషేకం తప్పిపోయింది గదా!' అనుకోకూడదు. పట్టాభిషేకం చెడితే తప్ప రాముడరణ్యాలకి పోడు. అలాకాని పక్షంలో సీతాప హరణం లేదు. అది లేనినాడు రావణవధ సాధ్యం కాదు. అలా కాని రోజున రామునిగా ఆయన అవతారమే వ్యర్థమౌ తుంది. ఇంతటి కష్టమైన పనికి దేవతలంతా ఏ కాలం మంచిది? అని ఆలోచించి అందరూ ఐకమత్యంతో నిర్ణయిం చిన కాలం వసంతం - అందునా చైత్రమాసం.

సీతాపహరణం జరిగింది వసంతకాలంలోనే.

రాముడు తనని చంపడానికి రాగలడనే విషయం రావణునికి తెలిసిందికూడా వసంతంలోనే.

ఆంజనేయుడు మొదటిసారిగా రామచంద్రుణ్ణి చూసిందీ అహంకారం పోయి తనకంటె రాముడెంతటి గొప్ప వాడో ఆ విషయం సుగ్రీవునికి అర్థమైందీ- రామునిచేతిలో వాలికి మోక్షం లభించిందీ- సీతమ్మకి రాముని వార్తలు మొదటిసారిగా అందిందీ- రావణవధ సాగాక అయోధ్యలో రామచంద్రుడు పట్టాభిషిక్తుడయిందీ-అన్నీ కూడా వసంత కాలంలోనే.

అమ్మవారిక్కూడా ఇష్టమైనది ఈ కాలమే కాబట్టి, ఈ వసంత కాలంలోనే వసంతనవరాత్రుల పేరిట నవరాత్రాలని దసరా ఉత్సవాల్లాగా చేస్తారు.

బుద్ధిశక్తి బాగా పెరగడానికి 'చదువుల తల్లి సరస్వతిని బాగా పూజించవలసింది ఈ కాలంలోనే' అంటూ 'వత్సరా రంభ సంపూజితా' అనే సరస్వతీ సహస్రనామాల్లోని ఒక నామం కూడా చెప్తుంది.

వసంతకాలంలోని పక్షి కోకిల. ఒక్క రామునికీ సీతమ్మకీ మాత్రమే కాదు వాల్మీకిక్కూడా మహా ఇష్టం వసంతకాలమే. అందుక్కారణం, సీతారాములకి ఏది ఇష్ట మైతే తనకీ అదే ఇష్టం కాబట్టి. అందుకే వాల్మీకిని కోకిలతో పోల్చిన అద్భుతశ్లోకం ఒకటి లోకంలో కన్పిస్తోంది.

**కూజంతం రామ రామేతి మధురం మధురాక్షరమ్ ।**
**ఆరూహ్య కవితాశాఖాం వందే వాల్మీకి కోకిలమ్! ॥**

'కవిత్వం' అనే చెట్టు కొమ్మని ఎక్కి రామా! రామా!! అనే అక్షరాలని మధుర మధురంగా పలుకుతూండే 'వాల్మీకి' అనే కోకిలకి నమస్కారమని శ్లోక భావం. వాల్మీకిని కోకిల తోనే ఎందుకని పోల్చాలో (రో) కొద్దిగా గమనించాలి.

చిగిర్చిన చెట్లూ, మొగ్గతొడిగిన కొమ్మలూ, కాయలూ, పండ్లతో రమణీయంగా ఉండే వసంత కాలంలో- పచ్చని ఆకుల మధ్యగా- అంటే తన సొంత ఇంటిలో తానుండి- సంతోషంతో కూస్తుంది కోయిల. అలాగే వాల్మీకి కూడా తన గుండెనిండుగా రాముణ్ణి నిల్పుకుని రామమయమైన శరీరంతో రామాయణ గానం చేస్తాడు. ఇదొక కారణం.

ఇక కోకిల 'కూ-కూ' అనే ఏకాక్షరాన్ని (ఒకే అక్షరాన్ని) మృదు మధురంగా గానం చేస్తే 'రామా!' అంటూ అనేకాక్ష రాలని గానం చేస్తాడు వాల్మీకి. ఇది రెండో కారణం.

వేసవిలో తాపానికి మగ్గిపోయేవారికి కోయిల ధ్వని ఆనందాన్నిచ్చినట్లు, సాంసారిక బాధల్లో మగ్గిపోయే వారికి రామనామ ధ్యానం ఆనందాన్నిస్తుంది. ఇది మూడోది.

'కూ-కూ' అంటూ ఒకే ధ్వనిని కోకిల నిరంత రాయంగా కూస్తున్నా దానికీ, వినేవారికీ కూడా విసుగు రానట్లు, రామనామం కూడా ఎంత సేపు జపించినా-అంటే- రామాయణాన్ని ఎన్నిమార్లు విన్నా, చూచినా, చదివినా-

అలసటా–విసుగూ అనేవి ఉండనే ఉండవు. వాల్మీకిని కోకిలతో పోల్చడానికి ఇలాంటివి– ఎన్నో కారణాలున్నాయి.

ఇక ఇతిహాసపరంగా వసంతానికింత ప్రాముఖ్య ముంటే–వైద్యపరంగా ఎంత ప్రాముఖ్యముందో గమనిద్దాం!.

## ఉగాది రోజుని ఎలా గడపాలి?

మనం తెల్లవారుజామునే లేచి కాలకృత్యాలు ముగించాక, ఇంట్లో ఉన్న పెద్ద ముత్తైదువ 'ఆయురారోగ్యైశ్వర్యాలతో ఉండవలసిం'దని దీవిస్తూ మన మీద అక్షతలని వేసి తలకి (మాడు మీద) నువ్వుల నూనెని పెట్టాలి.

ఆ మీదట మనం ఒంటరిగా నువ్వుల నూనెని రాసుకుని ఒక గంటసేపు నూనెతో నానాక సున్నిపిండి రాసుకుని తలంటు పోసుకోవాలి. నూనెతో నానే సమయంలో వ్యాయామంగానీ దైవస్తోత్రాలుగాని రెండూగానీ చేసుకోవచ్చు.

అభ్యంగనస్నాన మయ్యాక నిత్యం మనం చేసుకునే పూజ ముగించుకుని దైవమందిరంలో ఉన్న అక్షతలని ఇంట్లో ఉన్న పెద్దవారికిచ్చి వాళ్లకి పాదాభివందనం చెయ్యాలి. పసుపుబొట్టు పెట్టిన కొత్తబట్టల్ని మనకిస్తూ ఆశీర్వదించాలి వాళ్లు.

మనం కొత్త బట్టలు కట్టుకుని దేవుడికి అంతకుముందే నైవేద్యం పెట్టిన పచ్చడిని ఆరగించాలి.

## పంచ+అంగ శ్రవణం


సరిగా ఈ సమయానికి గుళ్లోనో లేక మరో ప్రదేశంలోనో పంచాంగపఠనం ప్రారంభమవుతుంది. ఈ సంవత్సరంలో 'మన జీవితం, మనని పరిపాలించే పాలకుల రాజ్యం, మననందరినీ పరిపాలించే ఆ భగవానుని అభిప్రాయం' ఎలా ఉందో ఆ విషయమంతా దీనిద్వారా తెలుసుకోగలుగుతాం.

మనం చేసిన పాపపుణ్యాల కనుగుణంగా మనకి రావాల్సిన లాభనష్టాలని గమనించిన భగవంతుడు, లాభాల్ని కల్గించేందుకు శుభగ్రహాలనీ, నష్టపెట్టేందుకు అశుభగ్రహాలనీ నాయకులుగా నియమిస్తూ కొత్త సంవత్సరాన్ని నిర్మిస్తాడు.

ఉదాహరణకి మన నక్షత్రాన్ని బట్టీ, మన రాశి ఫలాన్ని బట్టీ మనకి ఈ సంవత్సరం చికాకుగా ఉంటుందని తెలిస్తే 'ఈ కష్టాలని ఎలా గట్టెక్కా?లని ఆలోచించుకోవాలి. అసలు ఆ కష్టాలు రాబోతున్నాయని తెలిసి, ఆ కష్టాలు రాకుండా ఉండేందుకు తగిన జాగ్రత్తలని' ముందునుంచే తీసుకోవడం ప్రారంభించుకోవాలి.

'అలాగే ఈ సంవత్సరమంతా విజయపరంపరసాగుతుం' దని తెలియగానే అహంకారాన్నీ, విచ్చలవిడి తనాన్నీ పెంచుకోకూడదు. ఒక రకంగా పంచాంగ శ్రవణమనేది వ్యక్తికి మార్గదర్శకంగా పని చేస్తుంది. మరో ముఖ్యమైన మాటేమిటంటే జ్యోతిష్యమనేది మన విజ్ఞాన రసాయన శాస్త్రాల్లాంటిది కాదు.

ఆ కారణంగా 'జ్యోతిష్యాన్ని చెప్పే పండితుడు నిత్యమూ చేసే పూజా పురస్కారాలమీదా– అనుష్ఠానం



మీదా–అతడు చెప్పే ఫలితాలు ఆధారపడి ఉంటాయి. అలా చక్కని సరైన అనుష్ఠానాన్ని చేసే వ్యక్తి వాక్కు లోనే అమ్మ ప్రవేశించి ఆ ఫలితాన్ని నిజం చేస్తుంది.

'ఈ పంచాంగాలూ పఠనాలూ అంత అబద్ధమే' అని ఒక్కమాటలో కొట్టెయ్యకూడదు. సూర్యచంద్రగ్రహణాలు కచ్చితంగా ఏ రోజున ఎన్నిగంటల ఎన్ని నిముషాలకి రాబో తున్నాయో ఆ విషయాన్ని ప్రపంచానికి ముందుగా అందిం చేవీ, ఆ విషయాలు నిజమని ఖగోళం ద్వారా ప్రపంచాని కంతకీ సాక్ష్యాన్ని చెప్పేవీ పంచాంగాలే. శాస్త్ర'జ్ఞ'డు తప్పు కావచ్చేమోగాని ఎక్కడా "శాస్త్రం" మాత్రం తప్పుకా'దని గమనించగలగాలి.

## శుభాకాంక్షలు

ఇంతకీ ఇలా అన్నిటికీ ప్రథమమైన ఉగాదినాడు ఏమని శుభాకాంక్షల నీయాలని మనపెద్దలు మనకి చెప్పారో చూద్దాం!

"ప్రజలందరికీ సుఖం కలుగుగాక! పరిపాలకులు న్యాయమార్గంలో పాలింతురు గాక! హోమాలు చేయడానికై పాలనిచ్చే గోవుల వల్లా–భూమిని దున్ని పంటనిచ్చే ఎద్దుల వల్లా– ఆవులవల్ల వచ్చే పాలనీ, ఎద్దులవల్ల వచ్చిన ధాన్యాన్నీ యజ్ఞంలో వినియోగించే వేదవేత్త అయిన బ్రాహ్మ ణుని వల్లా దేవతలు తృప్తిపడి సమస్తలోకాలనీ చల్లగా చూతురుగాక! సకాలంలో వర్షాలు పడునుగాక! భూమి నిండా అందరికీ సంతానమూ ఉండుగాక! సంపద లేని వారికి సంపదలు కలిగి, దేశమంతా శాంతిమంతమై యుండుగాక! ఏ ఒక్కరూ దుఃఖాన్ని పొందకుండుదురు గాక! రాజులు నిర్భయంగా తమ పరిపాలనని చేయుదురు గాక!"– అనేవి మహర్షులిచ్చిన శుభాకాంక్షలు. విష్ యూ... (నీకు మాత్రమే శుభం కలగాలి)...అనే ఆచారం ప్రాచీనుల బుద్ధిలోనే లేదు.

పైగా శుభాకాంక్షలనగానే ఈ ఉగాది రోజున ఉద యాన్నే లేచి తల్లి దీవెనని పొందుతూ మాడు (బ్రహ్మరంధ్రం) పైన నూనెని పెట్టించుకుని తల్లికి తండ్రికి నమస్కరించి తలంటుపోసుకుని కొత్తబట్టలు ధరించి దైవదర్శనం చేస్తే, తమ సంతానం మీద ఆ తల్లిదండ్రుల ఆశీస్సులు ఫలి స్తాయి– పిల్లల బుద్ధి వికసిస్తుంది కూడ!– ఇది ఋషులు చెప్పిన నిజం – అనుభవంలో ఉన్న సత్యం.

---

**విశ్వదాభిరామం** | **వేమన పద్యసూక్తి**

## చిత్తశుద్ధి - శివపూజ

**ఆత్మశుద్ధి లేని ఆచార మది యేల?**
**భాండశుద్ధి లేని పాక మేల?**
**చిత్తశుద్ధి లేని శివపూజ లేలరా?**
**విశ్వదాభిరామ! వినుర వేమ!**

**అర్థము:** ఆత్మ= మనస్సు, స్వభావము; శుద్ధి= మలినము లేకుండుట; పాకము= వంట; చిత్తశుద్ధి= మనస్సు శుద్ధముగా ఉండుట.

**భావం:** ఆత్మశుద్ధిలేని ఆచారం పనికిరానిది. పాత్రల్ని శుభ్రం చేయకుండా వండినపదార్థం తినడానికి పనికి రాదు. మనస్సు శుద్ధంగా లేకుండా చేసేశివపూజలూ ఫలితాన్ని ఇవ్వవు.

**వివరణ:** ఆచారం పైకి కనిపించేప్రవర్తనం. అది గొప్పగా ఉన్నా, ఫలితం లేదు. అంతరంగం శుద్ధంగా ఉండాలి. మనస్ఫూర్తిగా నమ్మి చేసేకర్మమే మంచిఫలితం ఇస్తుంది. భాండశుద్ధి పైకి కనిపించేది. కుండలో కూడు శుచిగా ఉంటే చాలు, దానిపైన ఉండే కుండ మలిన మయినా బాధ లేదు అనుకోరు. అంతశ్శుద్ధితోపాటు బాహ్య మైనశుద్ధి కూడ ముఖ్యమే. అలాగే భగవంతుడి పూజ కూడ చిత్తశుద్ధితో చేస్తేనే ఫలిత మిస్తుంది. ఆడంబరంగా పూజలు చేయడం వలన ప్రయోజనం ఉండదని తాత్పర్యం.

– విద్వాన్ కట్టా నరసింహులు,
9441337542



# సందేహాలు - సమాధానాలు

- శ్రీ వైద్యం వేంకటేశ్వరాచార్యులు, 9989679681

**1) మార్గశిరమాసమంతా గోదాదేవి పాశురాల పారాయణలతో భక్తివాతావరణంలో గడిచింది. గోదా అంటే అర్థమేమిటి!? - శ్రీనవ్య, కర్నూలు.**

"గోదా" పేరుకు పదిరకాల అర్థాలు ఉన్నాయి. అవి సంక్షిప్తంగా-

01) గో స్వర్గం ద ఇచ్చునది - గోదా
02) గో పాపం ద పోగొట్టేది - గోదా
03) గో మోక్షం ద ఇచ్చునది - గోదా
04) గో పశుప్రాయ జన్మం ద ఖండించేది - గోదా
05) గో కవన వాక్శక్తిని ద కలిగించేది - గోదా
06) గో అర్చిరాది మార్గం ద కటాక్షించేది - గోదా
07) గో భూమిని ద భేదించుకొని వచ్చినది - గోదా
08) గో తిరుప్పావై శ్రీసూక్తిని ద కల్పించినది - గోదా
09) గో రంగనాథునికి నేత్రం ఇచ్చునది, అంటే వారి చూపు వీరి జన్మస్థలమందే ఉంచడం - గోదా
10) గో భూమండలం ద కృపసేయునది - గోదా

ఈ క్రింది పద్యంలో పై పది అర్థాలు చెప్పబడినవి. గమనించగలరు.

ఉ. ఆదట స్వర్గమిచ్చుట 1, అఘౌఘమడంచుట 2,
మోక్షమిచ్చుటన్ 3,
పాదుగ జన్మబంధముల బాపుట 4,
దివ్యవచః ప్రకాశక
శ్రీదయ, సేయుటల్ 5, ప్రకృతిజెందుట 6,
భూమిజనించుటల్ 7, సువా
జ్మోదమొసంగుటల్ 8, నయనముంగలిగించుట
రంగశాయికిన్ 9,
గాదనకన్ ధరిత్రినిడగా దగుటన్ 10,
నిను దేశికోత్తముల్
గోద యటంద్రు సర్వబుధకోటి నుతింపగ
రంగనాయకీ!

**2) విష్ణుసహస్రనామాల్ని భీష్ముడు చెప్పుంటే ధర్మరాజాదులు ఎవరూ రాసుకోలేదు. వారు కేవలం శ్రద్ధగా విన్నారు, అంతే. అలాంటప్పుడు విష్ణుసహస్రనామస్తోత్రం ఎలా ప్రచారం పొంది మనవరకూ అందింది? - వి.రాజగోపాలాచార్యులు, మల్యాల.**

1940 ప్రాంతంలో కంచిపరమాచార్యస్వామి వారిని ఒక వ్యక్తి ఇంటర్వ్యూ చేస్తూ ఈ ప్రశ్నే అడిగాడు. అప్పుడు స్వామివారు సమాధానం ఇలా చెప్పారు-

భీష్ముడు సహస్రనామాలతో కృష్ణుణ్ణి స్తుతిస్తున్నపుడు పాండవులూ, వ్యాసుడూ మొదలైనవారు శ్రద్ధగా విన్నారు కానీ, ఎవరూ రాసుకోలేదు. అప్పుడు యుధిష్ఠిరుడు కృష్ణునితో "ఈ వేయినామాలు మనమంతా విన్నాం. కానీ రాసుకోలేదు. మళ్లీ ఈ నామాలను మనం పారాయణం చేయాలంటే ఎలా! ఆ సహస్రనామాలు మనందరికీ కావాలి, కనుక ఏం చేయాలి?" అన్నాడు. అప్పుడు శ్రీకృష్ణుడు- 'ఆ సహస్రనామాలు మళ్లీ మనకు కావాలంటే వాటిని- వ్యాసుడు, సహదేవుడే చెప్పాలి' అన్నాడు.

అప్పుడు అక్కడివారందరూ 'అదెలా!?' అన్నారు. అపుడు కృష్ణుడు ఇలా చెప్పాడు - 'మనందరిలో సహదేవుడు ఒక్కడే సూతస్ఫటికం వేసుకున్నాడు. ఆ స్ఫటికం మహేశ్వర స్వరూపం. దాని ప్రత్యేకత ఏమిటంటే వాతావరణంలోని శబ్దతరంగాలను గ్రహించి తనలో దాచుకుంటుంది' అన్నాడు. కృష్ణుడు సహదేవుని విష్ణుసహస్రనామాలను అందించమని అడిగాడు. శ్రీకృష్ణుని ఆజ్ఞమేరకు, సహస్ర నామ శబ్దతరంగాలు వచ్చిన చోట- అనగా- భీష్మునికి అతి సమీపంలో సహదేవుడు, వ్యాసుడు కూర్చొని, ఆ సహస్ర నామశబ్దతరంగాలు పునఃప్రసారం (రీప్లే) అవుతుంటే వ్యాస మహర్షి గ్రంథస్థం చేశాడు. సహదేవుని ద్వారా విష్ణుసహస్ర నామాలు పరంపరగా మనవరకూ అందాయి.

గత
సంచిక
తరువాయి
భాగం..

ధారావాహిక-11

# శ్రీకృష్ణభగవద్విజయం

- డా॥ వుయ్యూరు లక్ష్మీనరసింహారావు, 89198 32285

కృష్ణం వందే జగద్గురుమ్- అనే మంత్రాన్ని కూనరాగంతో మననం చేసుకుంటూ అళిందం (వరండా)లో నడుచుకుంటూ వస్తున్నాడు వాసుదేవుని మిత్రుడు వసంతకుడు. ఇటువైపునుండి వాసంతిక, తాంబూలకరండవాహిని అతనికి ఎదురుపడ్డారు. వారిని చూచిన వసంతకుడు మనస్సులో “ఆహా! సత్యభామాదేవిగారి రాజసమే రాజసం సుమా! ఆయిల్లాలికి పూలసేవ కొకదాసి, తాంబూలసేవ కొకదాసి, శిరోలంకారాని కొకదాసి.... ఓహ్! ఆ గృహిణీమణి కెందరు దాసీమణులో! అవునులే! శ్యమంతకమణి ప్రతిదినం బారువులు బారువులు బంగారం ప్రసాదిస్తున్నప్పుడు సేవ కొక దాసినేం కర్మ ఇద్దరుముగ్గురునైనా పెట్టుకోవచ్చు. రాణులసొమ్ములు జాణలపాలు” అనుకుటుండగానే ఆ జంట చెలికత్తెలు చేరువయ్యారు. తాంబూల కరండవాహిని దీపావళినాటి రాత్రి దృశ్యాన్ని తలచుకుని తనలో తానే చిన్నగా నవ్వుకోసాగింది. ఆమెను, ఆమె నవ్వును చూచేసరికి వసంతకునికి చిఱుచిరాకు కలిగింది.

ఏమే తాంబూలకరండవాహినీ! నీలో నీవే నవ్వుకుంటున్నావు. ఊహాలోకాల్లో ఊరేగుతున్నావా? జాగ్రత్త! జారిపడతావు – అంటూ హెచ్చరించాడు. పడితే నీమీదేగా పడేది వసంతయ్యా! – అని కవ్వించింది వాసంతిక. గతుక్కుమన్నాడు వసంతకుడు. ఓసి నీదుంప తెంపి గంపకెత్త! – అంటూ పరుగెత్తాడు. కిలకిలా నవుకున్నారు చెలికత్తెలు.

పరుగెత్తిన వసంతకుడు సత్యభామామందిరం ముందుకు వచ్చాడు. లోపల ఆసనంమీద కూర్చున్న సత్యభామా శ్రీకృష్ణులు వసంతకుణ్ణి చూశారు. అప్పుడే వేణువూదబోతున్న స్వామి వేణువును పెదవులనుండి దించాడు.

**శ్రీకృష్ణుడు :** వయస్యా వసంతకా! ఇటు.

**సత్యభామ :** వసంతయ్యా! ఇటు.

ఆ ప్రణయ దంపతుల్ని చూచిన వసంతకుడు ధైర్యంగా వారి వద్దకు వచ్చాడు. సర్వజ్ఞుడయిన స్వామి చమత్కారం చేయాలని సంకల్పించాడు.

**శ్రీకృష్ణుడు :** ఏమిటి చెలికాడా! ఏదో కంగారు పడుతున్నట్లున్నావు?

**సత్యభామ :** మా తాంబూలకరండవాహిని తగిలెనా ఏమీ?

**వసంతకుడు :** తగిలితే నేను మిగిలేవాడినా తల్లీ! కేవలం కనిపించింది అంతే.

**సత్యభామ :** కనిపిస్తేనే ఇంత కంగారా?

**వసంతకుడు :** కంగారా? నా కెందుకు? నేను స్వామివారి చెలికాడిని.

**సత్యభామ :** అదే ఆలోచిస్తున్నాను వసంతయ్యా! ఈ నైష్ఠిక బ్రహ్మచారికి ఈ గృహస్థశృంగారికి చెలిమి యేమిటా అని.

**వసంతకుడు :** నా కర్థం కాలేదమ్మా!

**శ్రీకృష్ణుడు :** నాకూ కాలేదు సుమా!

**సత్యభామ :** నీ మాటలు నమ్మి నా స్వామి సన్న్యాసిగా మారితే....

**వసంతకుడు :** ఈ స్వామా, నా మాటలు వినటమా! ఎంత అమాయికురాలివి తల్లీ! ఈ స్వామి సన్న్యాసిగా మారటం కాదు, నన్ను సంసారిని చెయ్యకుంటే అనుగ్రహించినట్టే లెక్క. నా మాట వినే స్వామయితే మీ వివాహకాండతోనే తనవివాహచక్రాన్ని ఆపి ఉండేవాడు.

*(ఇంకా ఉంది)*

భగవద్గీత-యువత

# ఆసురీగుణాలతో పతనం తప్పదు!

- డా॥ వైష్ణవాంఘ్రిసేవకదాసు
9821914642

దైవీగుణాలు, ఆసురీగుణాలు అనేవి రెండు ఉన్నాయి. భగవంతుని నియమనిబంధనలను, ఆదేశాలను పాటించేవారు దేవతలు లేదా దైవీగుణసంపన్నులు. భగవంతుని నియమావళికి విరుద్ధంగా నడుచుకునేవారు లేదా వాటిని పూర్తిగా ఉల్లంఘించేవారు అసురులు. భగవద్గీత (16.5) ఈ విషయాన్నే స్పష్టంగా చెబుతూ "దైవీగుణాలు మోక్షానికి అనుకూలంగా ఉంటాయి. కాగా ఆసురీ గుణాలు బంధకారకాలౌతాయి." అని పలికింది.

దైవీగుణాలలో మొట్టమొదటిది 'అభయం', మనిషికి అపజయం కలిగించేది భయం. ఎప్పుడైతే భయం హృదయంలో ప్రవేశించిందో అప్పుడే పరాజయం మొదలౌతుంది. మనిషికి ఉండే శారీరక బలం అల్పమే అయినా కొండంత ఆత్మబలం ఉంటే ఎంతటి ఘనకార్యాన్నైనా సాధించగల్గుతాడు.



ఆసురీగుణాల్లో మొట్టమొదటిది దంభం, అంటే గర్వం. గర్వమనేది అనేక కారణాల వల్ల వస్తుంది. అందం చూసుకుని, డబ్బును చూసుకుని, బలాన్ని చూసుకుని, పరపతిని చూసుకుని ఆసురీజనులు గర్వపడతారు. కాని, ఈ గర్వకారణమైన విషయాలన్నీ క్షణంలో నశించిపోతాయి. తపశ్శక్తితో రాక్షసులు దేవతలపై మాటి మాటికి దాడి చేయడం మనకు శాస్త్రాల్లో కన్పిస్తూనే ఉంటుంది. చరిత్రలో ఎందరో వచ్చి వెళ్లిపోయారు. వారి కాలాల్లో జనులు వారి మాట విన్నప్పటికీ ఆ ఆసురీ నాయకుల పేర్లు శాశ్వతంగా నిలవ లేదు. ఆసురీగుణాల్లో రెండవది పొగరు, మూడవది అహంకారం, నాలుగవది కోపం, ఐదవది కటుస్వభావం. ఈ ఐదు ఆసురీగుణాలు అజ్ఞానం వల్ల పుడతాయి.

అజ్ఞానం అంటే యథార్థజ్ఞానం లేకపోవడం. కాంతి లేకపోవడమే చీకటికి కారణమైనట్లు జ్ఞానం లేకపోవడమే అజ్ఞానానికి కారణం. ఈ ఆసురీగుణాల వల్ల బంధం కలుగుతుంది. ఏ విధంగా కారాగారంలో ఉన్న ఖైదీ స్వేచ్ఛను అనుభవించడో అదే విధంగా బంధాన్ని కలిగించే ఆసురీగుణాలు ఏనాటికీ సుఖాన్ని కలిగించలేవు.

కాబట్టి ఎవరికైతే దైవీగుణాలు ఉన్నాయో వారికి ఏవైనా అవరోధాలు కలిగినా శోకించాల్సిన అవసరమే లేదు. ఏనాటికైనా వారికి దుఃఖరాహిత్యం కలిగే తీరుతుంది. పాండవులు దైవీగుణ సంపన్నులు. వారికి ఎన్నికష్టాలు ఎదురైనా చివరికి వారంతా దుఃఖ రాహిత్యాన్ని పొందారు. ఎవరికైతే దైవీగుణాలు ఉంటాయో వారు శోకదూరులే అవుతారు. కాబట్టి యువత ఎల్లప్పుడు దైవీగుణ ప్రాప్తిలోనే ఉండాలి. అలాగే గర్వం, పొగరు, అహంకారం, కోపం, కటుస్వభావం నుండి పూర్తిగా బయటపడాలి. ఇటువంటి ఆసురీ స్వభావుల్ని గుర్తించాలంటే కొన్ని విషయాలు గమనించాలి.

విద్య, ధనం, అందం చూసుకుని వారు పొగరుగా ఉంటారు, గర్వం వారి ముఖంలోనే కనిపిస్తుంది. అందరూ తమను పూజించాలని వారు భావిస్తారు. చిన్నవిషయాల మీదకూడ వారు కోపం చెంది కటువుగా మాట్లాడుతుంటారు. మృదువుగా మాట్లాడ్డం వారికి తెలీనే తెలీదు. ఏది చేయాలో, ఏది చేయకూడదో వారు పట్టించుకోరు. ప్రామాణికమైనదేదీ వారు స్వీకరించక తమ మనస్సుకు తోచింది చేస్తారు. ఇటువంటి ఆసురీగుణ స్వభావులు నిజంగానే శోకించాల్సి ఉంటుంది, కాగా దైవీగుణస్వభావులు ఏనాడూ శోకించనవసరం లేదు. నేటి యువత దైవీగుణాలను అలవరచుకుని సమస్తశుభాలు పొందాలి.



# జెండాపై కపిరాజు...

– ఆచార్య పి.ఎల్.శ్రీనివాసరెడ్డి, 94414 93777

శ్లోకచతుష్టయం అన్నమాట కాళిదాసు శాకుంతల నాటకంలోని నాలుగుశ్లోకాలకు ఉన్న ప్రసిద్ధిని చెప్పడానికి చెబుతూఉంటారు. అలాగే తెలుగు పౌరాణికనాటకాలలో ప్రసిద్ధి పొందిన తిరుపతి వేంకట కవుల పాండవోద్యోగం తృతీయాంకంలోని రాయబారఘట్టంలోని నాల్గుపద్యాలను వరుసపద్యాలుగా పేర్కొంటారు.

ఆ వరుసపద్యాల్లోని కవితాత్మను బాలలకు తెలియ జేయాల్సిన అవసరమెంతైనా ఉంది.

చెల్లియొ చెల్లకో తమకుచేసిన యెగ్గులుసైచిరందరున్
తొల్లిగతించె నేడు ననుదూతగబంపిరి సంధిసేయ నీ
పిల్లలు పాపలున్ ప్రజలు పెంపువహింపగ పొందుసేసెదో
యెల్లి రణంబె గూర్చెదవొ యేర్పడజెప్పుము కౌరవేశ్వరా!

పాండవుల పక్షం నుంచి ద్రుపద పురోహితుడు, కౌరవపక్షం నుంచి సంజయుడు రాయబారాలు జరిపిన తర్వాత శ్రీకృష్ణుడు చేసిన రాయబారంలోని సారాంశాన్ని చెప్పే పద్యాల్లో ఇది మొదటిది. దాన్ని మెల్లగా ఇలా మొదలు పెట్టాడు. పాండవులకు మీరు చేసిన యెగ్గులను వాళ్లు సహించారు. చేతనయి సహించారో చేతకాకనే సహించారో! జరిగిందేదో జరిగి పోయింది. ప్రస్తుతం నన్ను దూతగా పంపారు–సంధి చేయడానికి. "పోరునష్టం పొందులాభం" అనేమాట పాటించి ప్రజలందరూ నీపిల్లలే కాబట్టి–నీపిల్లా పాపా అందరూ పెంపొందేట్టు సంధి చేస్తావో లేక అందరికీ రణం కూర్చడం–అంటే చితిపేర్చడమే చేస్తావో నీళ్లునమల కుండా చెప్పమన్నాడు. రెండుమార్గాల్లో ఏది అనుసరణీయమో తేల్చివేయమన్నాడు. చాలా సులభంగా అరటిపండొలిచి పెట్టినట్టు చెప్పాడు. కానీ ఫలితం శూన్యం కావడం వల్ల–

చం. అలుగుటయే యెఱుంగని మహామహితాత్మ డజాతశత్రువే
అలిగిననాడు సాగరము లన్నియు నేకముగాకపోవు క
ర్ణులు పదివేవురైన నని నొత్తురు చత్తురు రాజరాజ నా
పలుకులు విశ్వసింపుము విపన్నుల లోకుల గావు మెల్లరన్

అన్నాడు.

తన కోపమె తన శత్రువు. కోపమే లేక పోవడం వల్ల, రాకపోవడంవల్ల ధర్మరాజు అజాతశత్రువైనాడు. అలాంటి మహామహితాత్ముడే కోపగిస్తే చెలియలికట్టలు దాటని సింధువులన్నీ చేతులు కలుపుతాయి. ఒకటి కొకటి గాఢాలింగనం చేసుకొనకుండా ఉండవు. అప్పుడు కర్ణుడు–ఒక్కడుకాదు, అలాంటి వాళ్ళు పదివేలమంది అయినా యుద్ధంలో ఇబ్బందిపడతారు, కాదు చస్తారు. నా మాటలు నమ్ము అన్నాడు. విపత్తులో ఉన్న లోకుల్ని రక్షించమనీ, రాజుగా అది నీ ధర్మమనీ నొక్కిచెప్పాడు. దుర్యోధనుని పాలిటికి ములుకులు ఈ పలుకులు. కానీ ఏం లాభం: అందుకే

శా. జెండాపై కపిరాజు ముందు సితవాజిశ్రేణియున్ గూర్చి నే
దండంబున్గొని తోలు స్యందనము మీదన్ నారి సారించుచున్
గాండీవమ్ము ధరించి ఫల్గునుడు మూకన్ జెండుచున్నప్పుడొ
క్కండున్ నీమొర నాలకింపడు కురుక్ష్మానాథ! సంధింపగన్.

అని నిష్కర్షగా చెప్పాడు.

ధ్వజంమీద ఆంజనేయుణ్ణి ఉంచి, తెల్లని గుర్రాల్ని కట్టి, కొరడాతో నేను తోలే రథంమీద భూనభోంతరాళాలు దద్దరిల్లే విధంగా వింటినారిని సారిస్తూ గాండీవాన్ని ధరిం చిన ఫల్గునుడు సైన్యాన్ని చీల్చిచెండాడుతున్నప్పుడు నీవు సంధి కావాలని మొరపెట్టుకున్నా పట్టించుకునే నాథుడుం డడు అని గద్దించాడు. చెవిటికి శంకూదినట్లుంది పరిస్థితి. అందువల్ల

శా. సంతోషంబున సంధిసేయుదురె?వస్త్రంబూడ్చుచో ద్రౌపదీ
కాంతన్ జూచిన నాడు చేసిన ప్రతిజ్ఞల్ దీర్ప భీముండు నీ

**పొంతన్ నీ సహజన్ము రొమ్ము రుధిరమ్మున్ ద్రావు నాడేని ని**
**శ్చింతన్ తద్గదయున్ త్వదూరుయుగమున్ ఛేదించు నాడేనియున్**

అని ఖచ్చితంగా చెప్పి ముగించాడు.

భీషణమైన తన ప్రతిజ్ఞ నెరవేర్చుకోవడంకోసం భీముడు నీ ఎదురుగానే నీ తోబుట్టువు గుండెనెత్తురు త్రాగే రోజునగానీ, చీకూ చింతా ఏమాత్రం లేకుండా తనగదతో నీ తొడల్ని ఒక్కసారిగా తుంచేసేటప్పుడు గానీ సంతోషంతో సంధిచేస్తారా? అప్పుడుచేసి ఏం లాభం.

ఈ నాల్గింటినీ తెలుగుజాతి వరుసపద్యాలని పిలుస్తోంది. పాండవోద్యోగంలోనే నాల్గుపద్యాలు వరుసగా ఉన్న సందర్భాలింకా ఉన్నాయి.

కానీ, వీటికి మాత్రమే ఆ పేరు వచ్చింది. వచనం లేకుండా పద్యాలు నాల్గూ వరసగా ఉన్నంతమాత్రంచేత ఈ పేరు వచ్చి ఉండదు.

చెప్పదలచుకున్న విషయం ఒక క్రమపద్ధతిలో మెల్లగా మొదలయి రాను రాను తీవ్రతీవ్రమవుతూ-సాగడం ఇందుకు కారణం కావచ్చు. జరిగిందేదో జరిగిపోయిందని కృష్ణుడు దుర్యోధనుణ్ణి లాలించాడు. ఎవర్నో నమ్ముకొని ఇబ్బందులు కొనితెచ్చుకోవద్దని హెచ్చరించాడు. తన మాటలు వినమనీ, విశ్వసించమనీ బెదిరించాడు. భీముడు నీ తమ్ముణ్ణి చంపి, వెచ్చనెత్తురు తాగేటప్పుడైనా సంధి చేస్తావా? చేయవు. ఎందుకంటే వాడు నీవుకాదు కాబట్టి. మరి నీ తొడలు విరగ్గొట్టే టప్పుడైనా సంతోషంగా సంధి చేస్తావా? అని పరిహసించాడు.

మొదటిపద్యంలో ద్విత్వలకార ప్రాసం (చెల్లియొ-తొల్లి-పిల్లలు-ఎల్లి) విషయాన్ని మెల్లగా మొదలుపెట్టడాన్ని సూచిస్తున్నది.

రెండవపద్యం తొలిపాదంలో 'మహామహితాత్ముడు' అన్నప్పుడు హా' అనే అక్షరం యతిస్థానలో నిలిచి, దీర్ఘమైన ఉచ్చారణకు వీలుకల్పిస్తూ ఆయన గొప్పతనాన్ని త్రిగుణీకృతం చేస్తున్నది. 'కర్ణ' శబ్దాన్ని నడిమికి విరిచి రెండవపాదంలో నుంచి మూడో పాదంలోకి వేయడం మహాభారత సంగ్రామ మనే సముద్రాన్ని దాటించడానికి కర్ణధారుడు కర్ణుడేనని ఎంతగానో నమ్ముకున్న దుర్యోధనుణ్ణి మానసికంగా దెబ్బ గొట్టడమే!

మూడవపద్యం మొదటి పాదంలో యతి వాజిశ్రేణి లోని 'జి'. దైవదత్తమైన గుర్రాల సమూహం వెనక కాళ్ళమీద నిలబడి కదనుత్రొక్కడాన్ని 'జిశ్రేణి' (జిశ్రే) అన్న సందర్భం (శకార రకారాల సంయోగ ప్రభావం 'జి' అనే అక్షరం మీద పడుతూ) సువ్యక్తం చేస్తున్నది. మూడవపాదంలోని 'మూక' శబ్దాన్ని విరిచి 'క'తో యతి వేయడంతో సైన్యం ఖండింపబడటం సూచితం. ఒక్కండు-కూడా ఇలాంటిదే. ఒక పాదంలోంచి ఇంకోపాదంలోకి విరిచివేయబడడంవల్ల అరమానిసి కూడా నీ సంధిమొరను ఆలకించడని ధ్వని తమవుతున్నది. నారి సారించడం వినిపిస్తుంది ఆ పదాల పొందికలో.

నాల్గవపద్యం తొలిపాదంలో 'వస్త్ర' శబ్దంలోని 'స్త్ర' యతి. సకార తకార రకారాల సంయోగం వస్త్రం లాగడం లోని ఇబ్బందిని, రాపిడినీ చెప్పక చెబుతున్నది. ద్వితీయ పాదంలో యతి కా-జ్ఞ లకు. ప్రతివర్గంలోని మొదటి నాలుగు అక్షరాలకు మాత్రమే పరస్పరం యతి చెల్లుతుంది. క-జ్ఞ లకు యతి చెల్లడం విశేషం. అందుకే దానికి 'విశేషవళి' అని పేరు. విషయం యొక్క విశేషతను గుర్తుచేస్తున్నది ఆ విశేషవళి.

మొదటి మూడుపద్యాల్లోని వరసగా కౌరవేశ్వరా రాజరాజ! కురుక్ష్మానాథ! అన్న సంబోధనలున్నాయి ఇంత అంత మర్యాద అనవసరమనుకున్నాడేమో! కనీసం బహు వచనంకూడా లేకుండా ఏకవచనంలోనే చివరి పద్యంలో నీ పొంతన్, నీ సహజన్ము అని పేర్కొన్నాడు.

ఇలాంటి లోతుపాతులెన్నిటినో కలిగి ఉండడం వల్ల ఈ నాల్గుపద్యాలూ వరుసపద్యాలుగా తెలుగుజాతిలో చిర స్థాయిగా నిలిచాయి.

# శిరసు శ్రీవిభు వందనానికే!

– 'సారస్వత కళానిధి' డా॥ వెలువోలు నాగరాజ్యలక్ష్మి, 93941 13848

పవిత్రకావేరీతీరంలో వైభవోపేతంగా కొలువుతీరి ఉన్న శ్రీరంగేశ్వరుని తనివితీరా దర్శించే మహద్భాగ్యం ఎన్నడు లభిస్తుందో, ఆ రంగనాథుని దివ్యగాథలను మైమరచి గానం చేసే ఆనంద సందర్భం ఎప్పుడు వస్తుందో, రంగా! రంగా! అని జపిస్తూ భక్తులలో భక్తుడనై రంగని కైంకర్యంలో జన్మను చరితార్థం చేసుకోగల సుముహూర్తం ఎప్పుడు వస్తుందో అని భగవంతుని సన్నిధికై అహరహమూ పరితపించిన మహాభక్తుడు శ్రీకులశేఖరాళ్వారులు.

కులశేఖరాళ్వారులు కేరళరాష్ట్రంలోని 'తిరువంజిక్కళం' క్షేత్రంలో జన్మించారు. పరమాత్మ వరప్రభావం చేత కలియుగంలో పరాభవవత్సరంలో కుంభలగ్నం, పునర్వసు నక్షత్రయుక్త దశమి గురు వారంనాడు కౌస్తుభాంశతో దశరథునకు శ్రీరామచంద్రుడు ఉద యించినట్లుగా దృఢవ్రతునకు కులశేఖరులు జన్మించారు.

భక్తిప్రపంచంలో వీరి రచనలు మణిదీపికలు. శ్రీకృష్ణ దివ్యదర్శనభాగ్యం పొందినవారై శ్రీరంగపురం చేరుకుని రంగనాథుడి సేవలలోనే జీవనం సాగించారు. స్తోత్రసాహిత్యంలో వీరు రచించిన 'ముకుందమాల' సుప్రసిద్ధం. ఇది ఒక భక్తిరస సుధాకలశం. భక్తి పారవశ్యంతో తొణికిసలాడే కవిత్వం ఎంత సుప్రసన్నంగా, మృదు మధురంగా ఉంటుందో రుచి చూపించిన రత్నమాల 'ముకుందమాల'. ఇది మోక్షప్రదుడైన ముకుందునికి హృదయపూర్వకంగా భక్తుడు సమర్పించిన భక్తిభావ సుమమాల, 40 విశిష్టశ్లోకాలతో అల్లబడ్డ పరిమళభరితమైన రమ్యాక్షరమాల.

కులశేఖరుల ప్రపత్తి భావానుభూతులే కవిత్వరూపాన్ని సంత రించుకుని ఆధ్యాత్మిక ప్రపంచపు లోగిలికి తోరణాలై భక్తిమందిరం లోనికి భక్తుల్ని ఆహ్వానిస్తాయి. తిరుమల శ్రీవేంకటేశ్వరుని దివ్య ధామంలో కులశేఖరపడిగా ప్రసిద్ధమైన ద్వారం వారి అనన్యశరణా గతికి అద్వితీయమైన దృష్టాంతం.

శ్రీపతి పాదమనే నౌకను చేరిన సజ్జనులు భవసాగరాన్ని అవలీలగా దాటి అమృతస్థితిని పొందగలరు. అనంతమైన, సత్యమైన

**మార్చి, 5వ తేదీన**
**శ్రీకులశేఖరఆళ్వార్ వర్షతిరునక్షత్ర సందర్భంగా...**



ఈ జ్ఞానాన్ని అనుభూతి చెందిన కులశేఖరులు– సంసార సాగరంలో నిరంతరం మునకలు వేసే మానవులు సుఖ దుఃఖాలు, శీతోష్ణాలు అనే పెనుగాలుల్లో కొట్టుకొనిపోతూ ఉంటారు. అటువంటి విపత్కాలంలో విష్ణువనే తెప్ప ఒక్కటే మానవుడికి శరణ్యం అని ఎలుగెత్తి చాటి చెప్పారు. కుల శేఖరులు తమ బాహ్యేంద్రియాలను, అంతరింద్రియమైన మనస్సును సంబోధించి, అనునయించి ఆ జగదేకవిభుని దివ్యపాదారవిందాలపై మగ్నమై మసలుకోవలసిందని బతి మాలుకున్నారు.

కులశేఖరాళ్వారులు తమ అంతరంగంలోని శరణా గతి తత్త్వాన్ని పలురీతులలో ముకుందమాలలో వర్ణించారు. తాను దాసులకు దాసుడనని, దాసానుదాసుడనని ప్రకటించు కున్నారు. ఆ స్థితియే తమ జన్మకు సాఫల్యస్థితి అని నివేదించుకున్నారు.


**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి**

## గోదాతలకు విజ్ఞప్తి

1) **దేశవాళీ గోవులను తిరుపతిలోని తి.తి.దేవస్థానమునకు సంబంధించిన శ్రీవేంకటేశ్వర గోసంరక్షణశాల నందు మాత్రమే ముందస్తు అనుమతితో స్వీకరించబడతాయి.**

2) **ఆరోగ్యవంతమైన దేశవాళీ గోజాతి ఆవులు మాత్రమే స్వీకరించబడుతాయి.**

**గోసంరక్షణాధికారి,**
**తి.తి.దే., తిరుపతి**




మజ్జన్మనః ఫలమిదం మధుకైటభారే!
మత్ప్రార్థనీయ మదనుగ్రహ ఏషఏవ
త్వద్భృత్య భృత్యపరిచారక భృత్యభృత్య
భృత్యస్య భృత్య ఇతిమాం స్మరలోకనాథ (27 శ్లో)

అని ఆ లోకనాథుణ్ణి వేడుకున్నారు. పరమభక్తాగ్ర గణ్యులైన భగవంతునిదాసులకు దాసుడిగా వర్తించటమే భగవదనుగ్రహప్రాప్తికి రాచమార్గం. భాగవతులు భగవత్సం బంధులు. విష్ణుభక్తుల పాద పరాగాలను శిరస్సుపై ధరించిన పుణ్యాత్ములు పరమాత్మను కనులారా దర్శించి తరించగలరు.

భగవంతుని సేవించే భక్తులకు సిద్ధి తత్క్షణమే కలుగుతుందో లేదో కాని భగవద్భక్తులను సేవించిన వారికి మాత్రం తప్పక సిద్ధి కలుగుతుందని చెప్పటంలో సంశయం లేదు. భగవత్ప్రాప్తికి భాగవతదాస్యం తొలిమెట్టు. అటు వంటి పుణ్యాత్ములైన భాగవతులందరికి దాసానుదాసులుగా తమను అంగీకరించి, స్మరించమని కులశేఖరులు తమ ముకుందమాలలో వేడుకున్నారు. సర్వసమర్పణ భావం దాస్యం. అదే శరణాగతి.

ఈ శ్లోకంలో 'భృత్య' పదం ఏడుమార్లు ప్రయో గింపబడింది. ఇది కేవలం శబ్దాలంకార సౌందర్యాపాదకం మాత్రమేకాదు. ప్రతి భక్తుడు తనకు పూర్వులైన భగవం తుడి దాసులను సేవించే పరంపర విధానాన్ని సూచిస్తుంది.

ఉత్ఫుల్లపద్మపత్రాక్షం నీలజీమూతసన్నిభమ్
యాదవానాం శిరోరత్నం కృష్ణం వందే జగద్గురుమ్।

మకరందం జాలువారే స్వామి ముకుందుని పాదాలపై భక్తుల అంతరంగాలు అనంతంగా తుమ్మెదలై సంచరించాలి. స్వామి సౌందర్యానికి, ఆర్తరక్షణ పరా యణతకు ఆకర్షితులైన జీవులు ఎల్లప్పుడు తత్పాద మకరందాస్వాదన కావించే భ్రమరాలై సంచరించాలి. పరమభక్తాగ్రగణ్యులైన కులశేఖరాళ్వారుల 'ముకుందమాల' నుండి వెలువడే మకరందాన్ని సహృదయులు ఆస్వాదించి తరింతురు గాక!

# తండ్రిని పిలిచిన కొడుకు

- ఆచార్య కె.సర్వోత్తమరావు, 97041 04000

దినము ద్వాదశి నేఁడు తీర్థదివసము నీకు
జనకుఁడ అన్నమాచార్యుఁడ విచ్చేయవే

అనంతగరుడ ముఖ్యులైన సూరిజనులతో
ఘన నారదాది భాగవతులతో
దనుజమర్దనుఁడైన దైవశిఖామణితోడ
వెనుకొని యారగించ విచ్చేయవే

వైకుంఠాన నుండి యాళువారలలోపల నుండి
లోకపు నిత్యముక్తులలోన నుండి
శ్రీకాంతతోడ నున్న శ్రీవేంకటేశుగూడి
యీకడ నారగించ నింటికి విచ్చేయవే

సంకీర్తనముతోడ సనకాదులెల్లఁ బాడ
పొంకపు శ్రీవేంకటాద్రిభూమి నుండి
లంకె శ్రీవేంకటగిరిలక్ష్మీవిభు డు నీవు
నంకెల మా యింటి విందు లారగించవే (2.151)

ఈ కీర్తన తి.తి.దేవస్థానములు ముద్రించిన తాళ్ల పాక పదసాహిత్యం రెండవ సంపుటంలో 151వ కీర్తన. ఈ కీర్తన గల రాగిరేకు సంఖ్య 136. ఈ పాట అన్నమయ్య అధ్యాత్మసంకీర్తనలలో భాగంగా ముద్రితం కావడం చిత్రం. ఈ కీర్తన తాళ్లపాక పెదతిరుమలాచార్యులది. తన తండ్రిని ఆహ్వానిస్తూ సాంవత్సరిక పైతృకదినం నాడు పాడినపాట. అశ్రద్ధ వల్లనో, పొరబాటు వల్లనో అన్నమయ్య అధ్యాత్మ సంకీర్తనల జాబితాలో చేరిపోయింది. అన్నమయ్య సంపుటాలను ముద్రించిన శ్రీగౌరిపెద్ది రామసుబ్బశర్మ ఫుట్‌నోట్స్‌లో 'ఈ పాట అన్నమయ్య శ్రాద్ధ దినమును గూర్చి వ్రాసినది. గాన, అన్నమయ్య రచనకాదు' అని స్పష్టం చేశారు.

ఇక ఈ కీర్తనలోని విశేషాంశాలు-

బ్రహ్మచర్య, గార్హస్థ్య, వానప్రస్థ, సన్న్యాసాశ్రమాలలో గార్హస్థ్యం, సర్వశ్రేష్ఠం. ఈ గార్హస్థ్య ఆశ్రమంలో కుటుంబజీవితం ప్రధానమైంది. ప్రత్యేకించి మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ, అతిథిదేవోభవ భావనలు చాలాముఖ్యం. అంతేగాక ప్రతివ్యక్తి కూడా 'ఋణ త్రయం' తీర్చడం అవసరం. అవే దేవర్ణం, (దేవఋణం) ఋష్యృణం (ఋషిఋణం) పిత్రూణం (పితృఋణం) తన జన్మకు, అభ్యున్నతికి కారకులైన వారిపట్ల సంతానం చూపే శ్రద్ధ అనేక రకాలు. వాటిలో తల్లిదండ్రులు పరలోకగతులయ్యాక కుమారుడు ప్రతిసంవత్సరం 'శ్రాద్ధం' నిర్వహించడం. ఏ తత్కారణంగా పితృదేవతలు తమ సంతానాన్ని ఆశీర్వదిస్తారనడం ఒక విశ్వాసం. కాకపోతే కుమారుని విధ్యుక్తధర్మం కూడా. ఇంతేకాదు. అన్నమయ్య ఆదేశం కూడా. శ్రీనివాసుని సేవలో తరించమనడం, నారాయణసేవ పరమార్థమనడం, సంకీర్తనలతో స్వామిని కీర్తించమనడం లాంటివి అన్నమయ్య తన సంతానానికి బోధించిన అంశాలు. ఈ మార్గంలోనే తాళ్లపాక పదకవులు సుమారు 150 సంవత్సరాలు పయనించారు. నందవరీక వంశజుడైన వాడు, వైష్ణవాన్ని వలచినవాడు, రోజుకొక్క కీర్తన వంతున రచించిన అన్నమయ్యను స్మరించడం, ఆలాగే శ్రద్ధతో చేసే పితృకార్యానికి ఆహ్వానించడం ఈ కీర్తన నేపథ్యం.

'దినము ద్వాదశి నేడు' దినశబ్దం సంస్కృతం. చీకటిని తొలగించేది అని వ్యుత్పత్తి, పగలు అని సామాన్య అర్థం. పగలంటే భారతీయులకు సూర్యోదయం మొదలు సూర్యాస్తమయం దాకా వెలిగే కాలం. పాశ్చాత్యుల దిన గణన రాత్రి 12.00 నుండి మొదలు. భారతీయుల దిన గణన సూర్యోదయంతో మొదలవుతుంది. అందుకే పంచాంగంలో దివాహోరచక్రం, రాత్రి హోరచక్రం విభజన చెప్పారు. అంతేకాదు పంచాంగం తిథి-వార-నక్షత్ర-యోగ-కరణం అనే ఐదింటిని స్పష్టం చేస్తుంది. వాటిలో 'తిథి' మొదటిది. ప్రతిపత్తు (పాడ్యమి) మొదలు పూర్ణిమ దాకా శుక్లపక్షం. చంద్రుని కళలు వృద్ధి ఈ పక్షంలోనే.

**21-03-2020న**
**అన్నమాచార్య వర్ధంతి సందర్భంగా...**

పాడ్యమి నుండి అమావాస్య దాకా కృష్ణపక్షం. దీనినే 'బహుళ పక్షం' అని కూడా అంటారు. అందువల్ల తిథులు చెప్పేవేళ శుక్లద్వాదశి, బహుళద్వాదశి అని వ్యవహారం. అన్నమయ్య పరమపదం చేరుకొన్న తిథి 'బహుళ ద్వాదశి, అందుకే పెదతిరుమలయ్య 'తిథిని' ముందు గర్తుచేశాడు.

'తీర్థదివసము నీకు' దినమన్నా దివసమన్నా ఒకటే. దివసమంటే ప్రకాశించేదని వ్యుత్పత్తి. పగలుకు మరొక పర్యాయ పదం దివసం కూడా. ఈ ద్వాదశి 'తీర్థదివసం' అని పెదతిరుమలయ్య అన్నమయ్యకు తండ్రికి విన్నవించడం విశేషం. తీర్థశబ్దానికి పుణ్యక్షేత్రమని ఒక అర్థం. 'దివసం' సంస్కృతశబ్దమైనా ద్రావిడ భాషలో 'తద్దినం' అనే అర్థంలో వాడకం. ఆ కారణం వల్ల తీర్థదివసమంటే పుణ్యక్షేత్రంలో నిర్వహించే శ్రాద్ధకర్మ అనికూడా చెప్పవచ్చు. దీనినే 'క్షేత్ర శ్రాద్ధ' మంటారు. మహాపురుషులను 'తీర్థులుగా' స్మరించడం సంప్రదాయం కూడా. వారందరు లోకపావనులు.

'జనకుఁడ అన్నమాచార్యుఁడ విచ్చేయవే' జన్మకు కారణమయినవాడు జనకుడు. ఆ జనకుడే అన్నమయ్య. కేవలం అన్నమయ్యకాదు అన్నమాచార్యుడు. ఆచార్యుడన డానికి విశేషార్థాలున్నాయి. ఆచరించి ఇతరులకు మార్గ నిర్దేశం చేసేవాడు ఆచార్యుడు. అంతేకాదు భగవద్గీత 16వ అధ్యాయంలో దైవీసంపదవల్ల అవతరించిన వారిలో 26 సుగుణాలుంటాయని వర్ణించింది. అభయం, జ్ఞానయోగ్యత, దానదయాదులు, క్షమాధృతి లాంటివి. అంతేగాకుండా వేదాంతదేశికులు వారు న్యాసవింశతిలో చెప్పినట్లు (సిద్ధం సత్సంప్రదాయ స్థిరధియ మనఘం) పూర్వాచార్యుల సంప్ర దాయ పరంపర పట్ల నిష్ఠ కలవాడు, పాపరహితుడైనవాడు, ధ్యాన సమాధిలో బ్రహ్మ సాక్షాత్కారం పొందినవాడు, భూత హితమయిన సత్యవాక్కు కలవాడు, దయాళువు, సదాచార నిష్ఠాపరుడు, తనకూ ఇతరులకూ మేలు కలిగే విధంలా జాగరూకుడై ఉండడం అనే లక్షణాలు కల అన్నమయ్య ఆచార్యుడు. ఆలాంటి తండ్రిని పెదతిరుమలయ్య 'విచ్చేయ మనడం' సంప్రార్థన.



పెదతిరుమలయ్య పల్లవితో పాటు మూడుచరణాలు కూర్చాడు. మొదటి చరణంలో తండ్రీ! అన్నమాచార్య నీవు అనంత గరుడాదులతో, నారదాది భాగవతులతో, రాక్షసుల అణచిన దైవశిఖామణితో మా ఇంట జరిగే శ్రాద్ధ కర్మకు వేంచేయవయ్యా' అని ప్రార్థించాడు.

వైకుంఠంలో స్వామివారికి చేరువుగా సదావుండే వారు నిత్యసూరులు. 'సదా పశ్యంతి సూరయః' కర్మాయత్త జనన మరణదుఃఖాదులు లేనివారయి, శాశ్వతంగా భగ వదనుభవభాగ్యం కలవారునిత్యులు. నిత్యలీలా విభూతులనే ఉభయ విభూతులలో భగవత్సన్నిహితులయి కైంకర్యం చేసేవారు నిత్యులు. ఆ నిత్యసూరులలో మొదటివాడు అనం తుడు. అనంతుడంటే శేషుడు. ఈ అనంతుడు 'మహామహీ భరం' మోచేవాడు. వేయిపడగలవాడు. జలధిశాయికి పాన్ప యినవాడు. పాములకు రాజు. పాపహారి. అంతేకాదు స్వామికి గొడుగు, ఆసనం కూడా, ఆలాంటి అనంతుని వెంటబెట్టుకొనిరమ్మని ఆహ్వానం.

రెండవవాడు గరుడుడు. స్వామి ఆనకోసం ముకుళిత హస్తాలతో దరిదాపుల్లో కాచుకొనేవాడు. వినతాతనయుడు. మహాబలశాలి. వైకుంఠనాథుని వాహనం. అంతేకాదు ధ్వజం కూడా. శ్రీవైష్ణవంలో 'పెరియత్తిరువడిగా' కీర్తింపబడేవాడు.

తిరుమలలోని ఒక కొండ గరుడాద్రి. వైకుంఠవిరక్తుడైన స్వామి ఆనతిమేరకు గరుడుడు తెచ్చిన అద్రిగా విఖ్యాతం. గరుడ ముఖ్యులు అనడంలో 'విష్వక్సేనుడు' కూడా. అతడు సేనాపతి. వేత్రహస్తుడు. విఘ్ననివారకుడు. 'సేనామొదలారి'గా ప్రసిద్ధుడు. సేనకు ముందు నిలబడిన సైన్యాధ్యక్షుడని విశేషార్థం. నిత్యసూరులతో బహుళద్వాదశి నాడు రమ్మని ఆహ్వానం.

నిత్యసూరులతో మాత్రం కాదు. 'ఘన నారదాది భాగవతులతో' రమ్మని కమ్మని పిలుపు. దేవర్షులలో నారదుని స్థానం పదిలం. నిరంతర నారాయణజపం చేసేవాడు. త్రిలోకసంచారి. పరమ భక్తుడు. సంగీతంతో, భక్తితో స్వామిని మెప్పించేవాడు. భగవంతునికి సేవాకైంకర్యాదులు చేసేవారంతా భాగవతులే. వారు ఘనులు. భగవదపచారం కంటె భాగవదపచారం మహాపాపం. అందుకే భాగవతస్మరణ కలికల్మషనివారకం. ప్రహ్లాద నారద పరాశర పుండరీక వ్యాస అంబరీషాదులు భాగవతులు. అన్నమయ్యది సంగీతరూపసాధన. నారదాదులు అన్నమయ్యకు ఆరాధ్యులు. తండ్రిగారికి ఇష్టులయిన వారిని ఆహ్వానించడంలో అభ్యర్థించడంలో తండ్రికి, తనకు ఆనందం.

పరివారాన్ని పిలిచి అసలు వ్యక్తిని మరచిపోవడం దోషం. అందుకే పెదతిరుమలయ్య 'దైవశిఖామణి'తో రమ్మని ఆహ్వానించాడు. శిఖామణి అంటే తలమీద ధరించే మణి. అందరికి కనబడేది. శోభాయమానమయినది. ఆలాగే దేవతలలో సర్వశ్రేష్ఠుడని అభిప్రాయం. 'కలౌ వేంకటనాయకః' అని ప్రసిద్ధి. ఆ స్వామి దనుజమర్దనుడు. అవతార ప్రయోజనమే సాధురక్షణ, దనుజశిక్షలే కదా. ఆ కారణం వల్ల దైవశిఖామణి వెంటరాగా శ్రాద్ధకాలంలో ఆరగించడానికి రమ్మని పెదతిరుమలయ్య ప్రార్థించాడు.

పెదతిరుమలయ్య రెండవ చరణంలో ఆళువార్లను, నిత్యముక్తులను, శ్రీసహిత వేంకటేశ్వరుని వెన్నంటుకొని రమ్మని తండ్రిని ప్రార్థించాడు. వీరిలో 'ఆళ్వారులు' ప్రసిద్ధులు. భగవంతుని రూపలీలాదులకు పరవశించినవారే.



**తిరుమలయాత్రకు**
**బస్సుప్రయాణమే సురక్షితం**

ఆళువారులే కాదు 'నిత్యముక్తులు' కూడా ప్రస్తావింపబడ్డారు. ఈ ప్రయోగంలో ఒక విశేషముంది. సచ్ఛీలత, సత్కర్మల వల్ల స్వర్గప్రాప్తి సహజం. కాని స్వర్గవాసం తాత్కాలికం. పుణ్యం క్షీణం కాగా మరల జన్మలు తప్పవు. అందుకే పరిణతులయిన జ్ఞానులు 'జననమరణాదులు లేని' స్థితిని కోరుకొంటారు. వేయించిన విత్తనాలు మొలకెత్తవు. ఆలాంటి స్థితినే భాగవతులు కోరుకొంటారు.

ముక్తి అయిదు రకాలు. దేవదేవునితో ఐక్యం కావడం. పరమపదంలో దేవదేవునితో సాయుజ్యం అనుభవించడం. దేవదేవుని లక్షణాలను పొందడం. దేవదేవుని షడ్గుణైశ్వర్యాలను అనుభవించడం. దేవదేవునికి ప్రియతముడుగా జీవించడం. పరమభక్తుడైన వాడు దేవునికి ప్రేమతో కైంకర్యం చేయడంలోనే తృప్తిపడుతూ అపరిమిత ఆనందాన్ని అనుభవిస్తాడు. నిత్యముక్తులలో ఉన్న, ఉరమున శ్రీకాంత గల శ్రీవేంకటేశుడు వెన్నంటి రాగా తాను శ్రద్ధాసక్తులతో చేసే శ్రాద్ధక్రియలో ఆరగించడానికి రమ్మని తన గృహానికి పెదతిరుమలయ్య ఆహ్వానించడం రెండవ చరణంలోని అంశం.

మూడవచరణంలో సనకాదులు పాడగా, వేంకటాద్రి అనే భూప్రాంతం తాత్కాలికంగా వీడి స్వామీ, నీవు మా ఇంటి విందులు ఆరగించడానికి విచ్చేయుమని ప్రార్థించడం విశేషం.

'మూడు' సంఖ్యకు ప్రాధాన్యమెంతో ఉంది. 'ముమ్మార్లు పిలవడం' ఒక సంప్రదాయం. మూడుసార్లు ప్రదక్షిణం చేయడం ఒక నియతవిధి. ఈలాంటివి ఎన్నో. పెద తిరుమలయ్య మూడుచరణాలు గల కీర్తనతో 'ముగురు వేలుపుల మూరితిని' తోడుకొని తండ్రి అన్నమయ్యను శ్రాద్ధవేళ ఆహ్వానించడం పెదతిరుమలయ్య భక్తికి సంప్రదాయానురక్తికి ప్రత్యక్షసాక్ష్యాలు.

# కైంకర్యమే.. తనువు దాల్చితే....

46

– డా॥ కంపల్లె రవిచంద్రన్, 98487 20478



( కంబర్ మహాశయుడు నమ్మాళ్వార్ల దివ్యప్రభావాన్ని స్తుతించారు. ఇందుకు ఎంతో సంతోషపడ్డ మధురకవులు శ్రీనమ్మాళ్వార్లవారి దివ్య వైభవాన్ని, వారు అనుగ్రహించిన దివ్యప్రబంధాలను తలచుకొని మైమరచి 'కణ్ణినుణ్ శిఱుత్తామ్బినాల్' గానం చేయడం ఈ సంచికలో చదువవచ్చు.)

**(కురుకూర్‌నమ్బి)– "కుఱుఙ్గుడినమ్బి"** యొక్క గుణ పూర్తికంటే కురుకూర్ నమ్బియొక్క గుణపూర్తి విలక్షణ మైందిగా ఉన్నందున, ఆళ్వార్లను ఆశ్రయించిన తరువాత, భగవానుణ్ణి ఆశ్రయించాల్సిన ఆవశ్యకత లేదు– అని భావం. **'తిరువాయ్‌మొళి'** అని శబ్దతః నిర్దేశించకుండా, **"కురుకూర్ నమ్బిపా"** అని అన్నందున, "ఆళ్వార్లు తమ నోటితో పల్కినది"– అనే వైలక్షణ్యంతోనే తిరువాయ్‌మొళిని కూడా వీరు ఆదరిస్తున్నారు– అని తెలుస్తోంది. తిరువాయ్‌మొళిలో కూడా **"కురుకూర్చ్చడ కోపన్ శొల్"** (కురుకూర్‌లో ఉండే శ్రీశఠకోపుల సూక్తి) (తిరువాయ్–1–1–11) అని ఆళ్వార్లు పలికారు.

ఈ క్రమంలోనే వీరు కూడా తిరువాయ్‌మొళిని ఆదరిస్తున్నారు. **"ఎన్ మున్ శొల్లుమ్"** (తిరువాయ్–7–9–2) (నా సమక్షంలో పల్కుతున్నాడు) అని, **"తన్నై త్తానే తుదిత్తు"** (తిరువాయ్–10–7–2) (భగవానుడు తనను తానే స్తుతించి) అని తిరువాయ్‌మొళి భగవానుడే స్వయంగా పల్కినట్లుగా భాసించేటపుడు, **"కురుకూర్‌నమ్బిపా"** అని అంటూ "అది ఆళ్వార్లు పల్కిన పాశురాల" అని దానిని గ్రహించడం కొంచెం అస్వారస్యంగా ఉన్నందున, వేరు రీతిలో కూడా అర్థాన్ని గ్రహించవచ్చు. అది ఏమంటే– కురుకూర్ నంబి యైన ఆళ్వార్లను గూర్చి పలికే కణ్ణినుణ్‌శిఱుత్తామ్బునే **"కురుకూర్‌నమ్బిపా"** అని పల్కుతున్నారని కూడా ఇక్కడ అర్థాన్ని గ్రహించవచ్చు.

**(పావిన్ ఇన్నిశై)–** పాశురాలతో కలిసి ఉండే మధురమైన రాగాన్ని.

**(పాడి త్తిరివనే)–** మీ జీవనక్రమం ఏవిధంగా నడుస్తోంది? అనే ప్రశ్న రాగా, **"కురుకూర్‌నమ్బి పావిన్ ఇన్నిశై"** (కురుకూర్‌లోని గుణపూర్ణులైన శ్రీశఠకోపుల తిరువాయ్‌మొళి ప్రబంధంలో గల పాశురాలలోని తీయని రాగాలను) ఆనందంగా పాడుతూ, దానిద్వారా ప్రాణధారణ చేసి, సంచరిస్తున్నాను– అని మధురకవులు అంటున్నారు. **"ఉణ్డు త్తిరివన్"** (తిని, తిరుగుతాను) అనే రీతిలో **"పాడి త్తిరివన్"** (పాడి తిరుగుతాను) అని అంటున్నారు. **"తిరివనే"** అనే పదంలోని **"ఏ"**కారం ద్వారా **"నమన్ తమర్ తలైకళ్ మీదే నావలిట్టు ఉనితరుకిన్త్రోమ్"** (తిరుమాలై–1) (యమ దూతల తలలపై కాలుపెట్టి **"నావలో నావల్"** అని జయ ధ్వానాన్ని చేస్తాము) అనే రీతిలో ఇదే నా జీవనయాత్రగా ఉన్నది. నా సంచారాన్ని అడ్డుకోగల్గిన వారున్నారా?– అని అంటున్నారని కూడా చెప్పవచ్చు. పూర్వకృతకర్మల ఫలాన్ని అనుభవింపజేసే యముడు కూడా నా ఈ జీవనయాత్రా క్రమాన్ని అడ్డుకోగలడా? ఆ ప్రాక్తనకర్మలకు కూడా కారణ మైన అన్య(లౌకిక)విషయాలు సైతం దీనిని అడ్డుకోగలవా?– అని భావం.

*(ఇంకా ఉంది)*



పన్నగశయనుడు భవహరుడు

# శ్రీరామరాజ్యం

- డా॥ వి.కృష్ణవేణి, 94419 48530

మనకున్న అనేక ప్రామాణిక రామాయణాల్లో తులసీదాస కవి హిందీ భాషలో రచించిన 'రామ చరిత్ మానస్' ఒకటి.

శ్రీరాముడి జన్మస్థలమైన అయోధ్యానగరంలో తులసీదాస్ ఈ గ్రంథాన్ని రచించారు. సరయూనది ప్రాముఖ్యతను, అక్కడి స్నానఘట్టాలను, అయోధ్యా నగర శోభను తులసీదాసు వర్ణించిన తీరు శ్లాఘనీయం. కళ్లకు కట్టినట్లు శ్రీరాముని వినయశీలతను, అన్నదమ్ముల మధ్య గల ప్రేమానురాగాలను వర్ణించారు. శ్రీరామునిలోని దైవత్వాన్ని భక్తి పారవశ్యంతో తులసీదాస్ విపులీకరించిన విధానం చదివే వారి మనస్సుకు శాంతినిస్తుంది. ముఖ్యంగా ఈయన తన 'రామచరిత మానస్'లో రామరాజ్యం గురించి గొప్పగా వర్ణించారు.

## రామరాజ్యం విశిష్టత

శ్రీరాముడు రాజ్యసింహాసనాన్ని అధిష్ఠించగానే ముల్లోకాలూ శోకరహితమై, పరమానందం చెందాయట. శ్రీరామమహిమ వల్ల విషమసమస్యలన్నీ తొలగిపోయాయి. ప్రజలెవరికీ రోగ, శోక, పీడ భయాలు లేవు. మానవులంతా ఒక్కటేనన్న పరస్పర ప్రేమాభిమానాలతో, ప్రతి ఒక్కరూ ధర్మాత్ములై జీవించేవారు.

ధర్మం నాలుగు పాదాలతో నడిచింది. కలలోనైనా ఎక్కడా పాపప్రవృత్తి లేదు. స్త్రీపురుషులందరూ రామభక్తి పరాయణులై మోక్షార్హత కలిగి ఉండేవారు.

సాక్షాత్ భగవంతుడే రాజయితే వారికి కష్టాలకు తావెక్కడ?


## ప్రకృతి ప్రణమిల్లుట

శ్రీరాముని ప్రజలకై పర్వతాలు తమలోని అసంఖ్యాక రత్నగనులను బయటకు పంపివేశాయి. అంటే ప్రజలకు రత్నరాసులు అందుబాటులో ఉన్నాయని అర్థం. నదులన్నీ సుమధుర, నిర్మల, శీతల జలాలతో నిండి ప్రవహించేవి. సముద్రాలన్నీ అతిక్రమించకుండా కెరటాల ద్వారా ఒడ్డుకు అమూల్యరత్నాలను చేరవేసేవి. చంద్రుడు తన అమృత కిరణాలతో ఔషధాలనిచ్చేవాడు. సూర్యుడు ప్రజలకు అవసరమైనంత మేరకే ఉష్ణాన్నిచ్చేవాడు. అడిగిన వెంటనే మేఘాలు వర్షించేవి. సహజవైరాలు మాని జంతువులన్నీ కలిసి మెలిసి ఉండేవి.

## గృహశోభ

సనకసనందన, నారదాది మునులు ప్రతిరోజూ శ్రీరాముని దర్శనార్థం అయోధ్యకు వచ్చేవారు. వారు ఆ నగర దివ్యశోభను చూసి ఆశ్చర్యచకితులయ్యేవారు.

మణిమయాలైన రాజగృహం, అంతఃపుర గృహాలు. వాటిలోపల రత్న, వజ్ర, వైడూర్యాల అలంకారాలకు



కొదువలేదు. పురప్రజల ఎత్తైన భవ్యభవనాలు ఆకాశాన్ని తాకుతుండేవి. ప్రతిఇంట్లో రత్నదీపాలు ప్రకాశించేవి. పగడాలతో నిర్మితమైన గడపలు, రత్న నిర్మిత స్తంభాలు, మణులతో అలంకరింపబడ్డ బంగారు తెరలు ఉండేవి. బాలికలు సుందరమైన పక్షులను పెంచేవారు. వ్యాపారులు సాక్షాత్ కుబేరులను తలపించేవారు.

## నీటి సౌకర్యం

అయోధ్యానగరానికి ఉత్తరదిక్కున పావన సరయూ నది నిర్మల అగాధజలములతో ప్రవహిస్తూ ఉంది. ఆ నదీ తీరంలో దిట్టమైన రేవులు నిర్మింపబడి ఉన్నాయి. ఎక్కడా కాలికి బురద అంటుకోదు. స్త్రీలు నీళ్లు తెచ్చుకోవడానికి ప్రత్యేక రేవులుండేవి. అక్కడికి పురుషులు రారు. ఏనుగు, గుఱ్ఱాల వంటివి నీరు తాగటానికి దూరంగా ప్రత్యేక రేవు లుండేవి.

ఈ సౌకర్యం వల్ల నీటి కాలుష్యనివారణకు ఆ కాలంలోనే వారు చూపే శ్రద్ధ మనకు తెలుస్తుంది. సరయూ నదీతీరంలో ఎన్నో దేవాలయాలు నిర్మించారు. వాటి చుట్టూ ఉద్యానవనాలుండేవి. సాధువులు, మునులు అక్కడ ధ్యానంలో ఉండేవారు.

## పౌరులకు శ్రీరాముని హితబోధ

రామచంద్రప్రభువు విరివిగా పౌరులను సమావేశ పరచి పెద్దలతో, గురువులతో హితబోధలు చేయిస్తూ, తాను కూడా హితవాక్కులు పలికేవారు. చాలా వినమ్రతతో బోధించేవారు. తాను చెప్పే వాటిలో అభ్యంతరాలు ఉంటే నిర్భయంగా అడ్డు చెప్పమనేవారు. శ్రీరాముని బోధన ఇలా సాగేది–

“ఎంతో అదృష్టంతో మనకు లభించిన మానవజన్మ లక్ష్యం విషయభోగాలు కాదు. విషయలోలురైన వారెటు వంటి వారంటే, అమృతమిచ్చి విషాన్ని తాగేవారు. ముత్యాలు పారవేసి, గురువిందలు ఏరుకునేవారు. తెలివితక్కువ మూర్ఖులు.

మానవజన్మ అనే భవజలధి దాటించు నావకు నావికుడు సద్గురువు. భగవంతుణ్ణి చేరడానికి అన్ని మార్గాల్లో భక్తిమార్గం అతిసులభమైంది. జ్ఞానమార్గానికి అనేకవిఘ్నాలు ఎదురౌతాయి. ఎవరితోనూ విరోధంవద్దు. పోట్లాడటం వద్దు. ఎవరి నుండీ ఏమీ ఆశించవద్దు. ఎవరికీ భయపడవద్దు. అలాంటి వారికి అంతటా సుఖమే. వీరికి సదా నేను వశుడై ఉంటాను.”

శ్రీరాముని మధురవాక్కులు విని ప్రజలంతా తన్మ యులయ్యేవారు. ప్రజలు శ్రీరామునితో ఇలా పలికేవారు.

“శ్రీరామా! మాకు తల్లిదండ్రీ గురువూ దైవం మీరే! మీరుకాక ఇంకెవరు ఇలాంటి హితోపదేశం చేయగలరు. లోకంలో నిస్వార్థపరోపకారులు ఇద్దరు మాత్రమే. ఒకరు మీరు, రెండవవారు మీ భక్తులు.” ఇలా వారు శ్రీరాముని హితబోధనలు తలచుకుంటూ, ఇతరులతో చర్చిస్తూ కాలం గడిపేవారు.

తులసీదాసు వర్ణించిన శ్రీరామరాజ్యాన్ని చదువు తుంటే ఆ రాజ్యంలో మనం కూడా ప్రజలమై, పౌరులమై ఆ బోధనలను వింటున్న అనుభూతికి లోనౌతాము.

### వైకుంఠపాళి

### :: 51- సమాధానాలు ::

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 చి | | 2 ఉ | ప | 3 దా | న | 4 వి | | |
| త్ర | | మ | | న | | త్తు | | 5 ఊ |
| 6 రే | గు | | 7 ఆ | వు | లు | | 8 పే | ర్మి |
| ఖ | | 9 కొ | | లు | | 10 కై | | ళ |
| | 11 కృ | పు | డు | | 12 సా | కే | తం | |
| 13 కై | | రు | | 14 త్రి | | యి | | 15 క |
| 16 కే | శి | | 17 ప్ర | శం | స | | 18 కృ | పి |
| యి | | 19 ప | | కు | | 20 అ | | శ |
| | | 21 చ | దు | వు | ల | మ్మ | | |

# శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయం, తరిగొండ

- శ్రీ ఐ.ఎల్.ఎన్. చంద్రశేఖరరావు, 94919 46070

చిత్తూరుజిల్లా, వాల్మీకిపురం పట్టణానికి ఆరు కిలోమీటర్ల దూరంలోని 'తరిగొండ' ప్రాంతంలో పూర్వం ఒక ఇల్లాలు పెరుగును చిలుకుతూ ఉన్న సమయంలో కుండలో సాలగ్రామ శిలారూపంలో శ్రీనృసింహస్వామి ఆవిర్భవించాడు. అందువల్ల ఈ ప్రాంతానికి తరికుండ అనే పేరు ఏర్పడినట్లు స్థలపురాణం. తరికుండ ప్రజలవాడుకలో తరిగొండ అయింది.

## స్థలపురాణం

పూర్వం ఈ ప్రాంతం అంతా అడవిగా ఉండేది. ఈ అడవిలో కొందరు నివాసాలు ఏర్పాటు చేసుకొని పశువులు పెంచుతూ పాలు, పెరుగు, మజ్జిగ వంటివి సమీప గ్రామాల ప్రజలకు సరఫరా చేస్తూ జీవనం సాగించే వారు. ఒక రోజు ఉదయాన్నే ఒక స్త్రీ రాత్రి తోడుపెట్టిన పాలు పెరుగు కాగా కవ్వంతో చిలకడం ప్రారంభించింది. కొంతసేపటికి కుండలో కవ్వానికి అడ్డంగా ఎదో ఒక శిల కనిపించింది. అంతకముందు రోజు రాత్రే 'రామనాయనిం గారు' అనే పాలేగారుకు స్వప్నంలో దర్శన మిచ్చి శ్రీనృసింహ స్వామి గ్రామంలో స్వయంభువుగా దర్శనమిస్తానని.. ఆలయం నిర్మించమని ఆదేశించాడు. మజ్జిగ కుండలో స్వామివారు స్వయంభువుగా సాలగ్రామ శిలారూపంలో కనిపించిన విషయాన్ని ఆ మహిళ గ్రామస్థులకు తెలపడంతో ఈ విషయం పాలెగారుకు తెలిసి ఆయన ఆలయాన్ని నిర్మించి స్వామివారిని ప్రతిష్ఠించి నట్లు స్థలపురాణం.

## మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ పూజలందుకున్న స్వామి


పరమభాగవతోత్తమురాలు భక్తకవయిత్రి వెంగమాంబ తన జన్మస్థలం కూడా ఈ గ్రామమే. ఈ తరిగొండ గ్రామంలోని నృసింహస్వామి ఆలయంలో వెంగమాంబ పూజలు చేయడంతో పాటు ఆలయంలోని ఆంజనేయ స్వామి వెనుకవైపున ఉన్న స్థలంలో కూర్చుని తపస్సు చేస్తూ ఉండేది. వెంగమాంబ పూజలను అందుకున్న దేవుడు శ్రీతరిగొండ లక్ష్మీనృసింహస్వామి. తర్వాత ఆమె తిరుమలకు చేరుకున్నారు.

## ఆలయ విశేషాలు

తరిగొండ గ్రామంలో ప్రధాన రహదారి ప్రక్కనే ఆలయం తూర్పు అభిముఖంగా ఉంది. ఆలయ ప్రధాన ప్రవేశద్వారంపై మూడు అంతస్తుల గోపురం ఉంది. విశాలమైన ప్రాంగణంలో ప్రధాన ఆలయం, ఉపాలయాలు కనులవిందు చేస్తూ దర్శనం ఇస్తాయి. ప్రధాన ఆలయానికి ఎదురుగా గరుడమండపం, ధ్వజ స్తంభం, సత్యప్రమాణాల పీఠం ఉన్నాయి. సత్యప్రమాణాల పీఠం వద్ద ప్రమాణం చేసి ప్రజలు నిజమే చెబుతారని అబద్ధం చెప్పరని



శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయం



శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలోని ఉత్సవమూర్తులు

## ఉత్సవాలు

తరిగొండ శ్రీలక్ష్మీనృసింహస్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రతి సంవత్సరం ఫాల్గుణమాసంలో శుక్లపక్షనవమి మొదలుకుని బహుళ పక్ష విదియ వరకు జరుగుతాయి. వివిధవాహనసేవలు, రథోత్సవం, కల్యాణోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. నృసింహజయంతి, ధనుర్మాసాలతో పాటు వివిధ పండుగలసమయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

కోరికలు తీర్చే కొండంతదేవుడిగా, సంతానం ప్రసాదించే సంతానప్రదాయకుడుగా, వివాహం ఆలస్యమౌతున్న వారికి వివాహాలను కుదిర్చే దేవుడిగా పేరుపొంది ఆరాధనలు అందుకుంటూ ఉన్న తరిగొండ శ్రీలక్ష్మీనృసింహస్వామిని దర్శించి భక్తులు తరించవచ్చు.

విశ్వాసం. అందువల్ల ఈ క్షేత్రాన్ని "సత్య ప్రమాణాల క్షేత్రం" అని పేర్కొంటారు.



శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలోని వేంగమాంబ విగ్రహం

ప్రధాన ఆలయం మహామండపం, ముఖమండపం, అంతరాలయం, గర్భాలయాలను కలిగి ఉంది, ముఖమండపంలో ఉత్తరాభిముఖంగా ఉన్న గర్భాలయంలో శ్రీఆంజనేయస్వామి వారు కొలువు దీరి పూజలందుకుంటూ ఉన్నాడు. ఈ స్వామి వెనుకవైపే మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ ఆసీనురాలై తపస్సు చేసినట్లు చెప్పబడుతోంది. ప్రధాన గర్భాలయంలో శ్రీలక్ష్మీనృసింహస్వామి చతుర్భుజాలతో ఆసీనమూర్తిగా కొలువుదీరి ఉన్నాడు. వామాంకమున లక్ష్మీదేవిని ఆసీనురాలిని చేసుకుని రెండుచేతులలో శంఖచక్రాలను మరోచేతిలో అభయముద్రను ధరించి ఇంకొక చేతితో వామాంకమున గల లక్ష్మీదేవిని పట్టుకుని దివ్యమనోహరరూపంతో భక్తులపై కరుణాకటాక్షాలను ప్రసరింప చేస్తూ దర్శనం ఇస్తాడు. ఆలయప్రాంగణంలో ప్రధాన ఆలయానికి ఎడమ వైపున ప్రత్యేక ఆలయంలో స్వామివారి దేవేరులు కొలువుదీరి ఉన్నారు. శ్రీ చెంచులక్ష్మి, శ్రీలక్ష్మిదేవి అమ్మవారలు ఒకే గర్భాలయంలో ఒకరి వెనుక ఒకరు కొలువుదీరి ఉండడం విశేషం. ఆలయ ప్రధాన గోపురం సమీపంలో ఆలయప్రాంగణంలో శ్రీతరిగొండ వెంగమాంబ విగ్రహమూర్తిగా కొలువుదీరి దర్శనం ఇస్తారు.

తిరుమల తిరుపతి దేవస్థానములు

# తరిగొండ

# శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి బ్రహ్మోత్సవం

**02-03-2020 నుండి 10-03-2020 వరకు**











**02-03-2020 సోమవారం**
పగలు: ధ్వజారోహణం
రాత్రి: హంసవాహనం

**03-03-2020 మంగళవారం**
పగలు: ముత్యపుపందిరివాహనం
రాత్రి: హనుమద్వాహనం

**04-03-2020 బుధవారం**
పగలు: కల్పవృక్షవాహనం
రాత్రి: సింహవాహనం

**05-03-2020 గురువారం**
పగలు: తిరుచ్చి ఉత్సవం
రాత్రి: పెద్దశేషవాహనం

**06-03-2020 శుక్రవారం**
పగలు: తిరుచ్చి ఉత్సవం
రాత్రి: గజవాహనం

**07-03-2020 శనివారం**
పగలు: తిరుచ్చి ఉత్సవం
సాయంత్రం: సర్వభూపాలవాహనం
రాత్రి: కల్యాణోత్సవం
గరుడవాహనం

**08-03-2020 ఆదివారం**
పగలు: రథోత్సవం
సాయంత్రం: ధూళి ఉత్సవం


**09-03-2020 సోమవారం**
పగలు: సూర్యప్రభవాహనం
రాత్రి: చంద్రప్రభవాహనం,
అశ్వవాహనం

**10-03-2020 మంగళవారం**
పగలు: వసంతోత్సవం, చక్రస్నానం
రాత్రి: ధ్వజావరోహణం

తిరుమల తిరుపతి దేవస్థానములు

# తిరుమలలో రథసప్తమి రోజున శ్రీవారికి జరిగిన సప్తవాహన సేవలు

(01 - 02 - 2020)



తిరుమల తిరుపతి దేవస్థానములు

# తిరుచానూరులో రథసప్తమి రోజున శ్రీపద్మావతీ అమ్మవారికి జరిగిన సప్తవాహన సేవలు

(01 - 02 - 2020)





2020 ఫిబ్రవరి 04న
శ్రీ వేంకటేశ్వర వెటర్నరీవర్సిటీ
స్నాతకోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొనేందుకు విచ్చేసిన
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నరు గౌ॥ శ్రీ బిశ్వభూషణ్ హరిచందన్ గారికి
తి.తి.దే. శ్రీ పద్మావతి అతిథిగృహంలో స్వాగతం పలుకుతున్న
తి.తి.దే. సంయుక్త కార్యనిర్వహణాధికారి శ్రీ పి. బసంత్ కుమార్, ఐ.ఏ.ఎస్.,
ముఖ్యనిఘా & భద్రతాధికారి శ్రీగోపీనాథ్‌జెట్టి, ఐ.పి.ఎస్.,
తుడా అధ్యక్షులు, తి.తి.దే. ఎక్స్- అఫిషియో సభ్యులు
శ్రీ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి గారు



తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారి వార్షిక తెప్పోత్సవాలు ఫిబ్రవరి 02 నుండి 08 వరకు జరిగాయి
ఈ ఉత్సవాలలో భాగంగా శ్రీకోదండరామస్వామివారు, శ్రీపార్థసారథిస్వామివారు, శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారు,
శ్రీకృష్ణస్వామి శ్రీఆండాళ్‌అమ్మవారు మరియు శ్రీగోవిందరాజస్వామివారు తెప్పలపై విహరించారు.





జనవరి 26న 71వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా తి.తి.దే. పరిపాలనాభవనం క్రీడామైదానంలో జాతీయజెండాను ఆవిష్కరించి,
కవాతు వందనాన్ని స్వీకరిస్తున్న తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ అనిల్‌కుమార్ సింఘాల్, ఐ.ఏ.ఎస్.,
ఈ కార్యక్రమంలో తి.తి.దే. అదనపు కార్యనిర్వహణాధికారి శ్రీ ఎ.వి. ధర్మారెడ్డి, తి.తి.దే. సంయుక్త కార్యనిర్వహణాధికారి శ్రీ పి. బసంత్ కుమార్, ఐ.ఏ.ఎస్.,
ముఖ్యనిఘా & భద్రతాధికారి శ్రీగోపీనాథ్‌జెట్టి, ఐ.పి.ఎస్., మరియు ఉన్నతాధికారులు, తి.తి.దే. ఉద్యోగులు పాల్గొన్నారు.

# దివ్యక్షేత్రం... తిరుమల

07

– శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం, 9985670152

*గత సంచిక తరువాయి భాగం...*

## తిరుమలేశుని ఉత్సవాలు

ఏడుకొండలస్వామికి ఏడాది పొడవునా ప్రతిరోజు ఏదో ఒక ఉత్సవం జరుగుతూనే ఉంటుంది. ఏదో ఒక ఊరేగింపు నిర్వహింపబడుతూనే ఉంటుంది. అందువల్లే తిరుమలలో ప్రతిరోజూ పండుగే! ప్రతిపూటా పరమాణ్ణాలే! పిండివంటలే! భక్తజనుల సంబరాల మధ్య సంవత్సరం పొడవునా సాగే ఉత్సవాలను 1)నిత్యోత్సవాలు, 2)వారోత్సవాలు, 3)మాసోత్సవాలు, 4)వార్షికోత్సవాలు (సంవత్సరోత్సవాలు) అని నాలుగువిధాలుగా వింగడించి వాటిని గూర్చి సంక్షిప్తంగా తెలుసుకుందాం.

### 1) నిత్యోత్సవాలు

ప్రతి రోజు ఉదయం నుంచి వరుసగా రాత్రి వరకు జరిగే సేవలే నిత్యోత్సవాలు.

**సుప్రభాతం–** ప్రతి రోజు తెల్లవారు జామున జరిగే మేలుకొలుపు సేవ సుప్రభాతం. "కౌసల్యా సుప్రజా రామ......." అని సుప్రభాత శ్లోకాలను అర్చకులు పఠిస్తుండగా బంగారు వాకిళ్లను తెరచి శ్రీవేంకటేశ్వరస్వామిని మేల్కొల్పుతారు.

**తోమాలసేవ–** సుప్రభాతసేవ అయిన తర్వాత శ్రీవేంకటేశ్వర స్వామివారి మూలమూర్తికి, ఉత్సవమూర్తులకు జరిగే పుష్పాలంకరణను 'తోమాలసేవ' అంటారు. సువాసనతో కూడిన రంగురంగుల పుష్పాలను, తులసిమాలలను అలంకరిస్తారు.

**కొలువు–** ప్రతిరోజు బంగారు సింహాసనంలో జరిగే "కొలువు"లో స్వామివారికి ఆ రోజుటి పంచాంగశ్రవణంతో పాటు ముందురోజు ఆలయానికి వచ్చిన ఆదాయవ్యయాలు వినిపిస్తారు.

**సహస్రనామార్చన–** పిదప శ్రీనివాస భగవానునికి తులసి దళాలతో సహస్ర నామార్చన జరుగుతుంది. తర్వాత నైవేద్యం చేస్తారు.

**నిత్యకల్యాణోత్సవం–** శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీమలయప్పస్వామి వారలకు మధ్యాహ్నం 12గంటలకు నిత్య కల్యాణోత్సవం నిర్వహింపబడుతుంది. ప్రతిరోజూ జరిగే కల్యాణోత్సవం వల్లనే తిరుమల క్షేత్రానికి "నిత్యకల్యాణం పచ్చతోరణం" అని ప్రసిద్ధి ఏర్పడింది.

**డోలోత్సవం–** శ్రీవారిఆలయంలో ఉన్న అద్దాలమండపంలో మధ్యాహ్నం 2గం॥కు శ్రీస్వామివారికి డోలోత్సవం జరుగుతుంది. నిర్ణీత రుసుమును చెల్లించిన భక్తుల కోరిక మీద మాత్రమే ఈ సేవను నిర్వహిస్తారు.

**ఆర్జిత బ్రహ్మోత్సవం, వసంతోత్సవం–** ఆలయం వెలుపల ఉన్న వైభవమండపంలో నిర్ణీత రుసుమును చెల్లించిన భక్తుల ప్రార్థన మేరకు మధ్యాహ్నం 3గం॥కు శ్రీస్వామివారికి బ్రహ్మోత్సవం, వసంతోత్సవం వంటి సేవలు నిర్వహిస్తారు.

**సహస్రదీపాలంకరణసేవ–** ప్రతిరోజు సాయంత్రం 5 గంటలకు ఆలయం బయట ఉన్న కొలువుమండపంలో శ్రీస్వామి వారలకు సహస్ర దీపాలంకరణసేవ జరుగుతుంది. ఈ సేవ అనంతరం పురవీథుల్లో ఊరేగింపు చేస్తారు.

**ఏకాంత సేవ–** తిరుమల ఆలయంలో ప్రతిరోజు రాత్రి చివరగా జరిగే 'పవళింపుసేవ'ను "ఏకాంత సేవ" అంటారు. ఈ సేవ జరిగిన తర్వాత శ్రీవారి ఆలయం మూసివేస్తారు.

ఇవీ ప్రతిరోజు జరిగే నిత్యోత్సవాలు.



## 2) వారోత్సవాలు

శ్రీస్వామివారికి వారానికి ఒక్కసారి మాత్రమే జరిగే ఉత్సవాలు.

**విశేషపూజ–** ప్రతి సోమవారం ఉదయం 6 గం॥కు శ్రీదేవి భూదేవులతో శ్రీమలయప్పస్వామికి విశేషపూజ జరుగుతుంది.

**అష్టదళపాదపద్మారాధన–** ప్రతి మంగళవారం ఉదయం 6గం॥కు శ్రీస్వామివారి మూలమూర్తికి బంగారు పద్మాలతో జరిగే అర్చన సేవ ఇది.

**సహస్రకలశాభిషేకం–** ప్రతి బుధవారం– బంగారువాకిలి ముందు భోగశ్రీనివాసమూర్తికి, శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీమలయప్పస్వామికి, సేనాధిపతి విష్వక్సేనులవారికి– జరిగే సేవ సహస్రకలశాభిషేకం.

**తిరుప్పావడసేవ–** ప్రతి గురువారం ఉదయం 6 గంటలకు శ్రీస్వామివారిమూలమూర్తికి జరిగే నైవేద్య సేవ ఇది. బంగారువాకిలి బయట శ్రీస్వామివారి ఎదురుగా పులిహోర రాశిని నివేదనంగా సమర్పిస్తారు. అదే తిరుప్పావడ సేవ.

**పూలంగిసేవ–** ప్రతి గురువారం రాత్రి 8గం॥కు శ్రీస్వామి వారిమూలమూర్తికి నిలువెల్ల పుష్పాలంకరణ జరుగుతుంది. ఇదే పూలంగి సేవ.

**శుక్రవారాభిషేకం–** శ్రీవేంకటేశ్వరస్వామివారి మూలమూర్తికి ప్రతి శుక్రవారం తెల్లవారు జామున 5గం॥కు ఆవుపాలు, ఆకాశగంగా తీర్థం, పునుగు, జవ్వాది, పరిమళం మున్నగు ద్రవ్యాలతో అభిషేకం జరుగుతుంది.

**నిజపాదదర్శనం–** ప్రతి శుక్రవారం అభిషేకానంతరం శ్రీస్వామివారి మూలమూర్తి నిజపాదాల దర్శనం చేసుకొనే సేవ ఇది.

ఇవీ వారానికి ఒక్కసారి తిరుమలలో జరిగే వారోత్సవాలు.

## 3) మాసోత్సవాలు

తిరుమల శ్రీవారికి నెలకు ఒక్క మారు మాత్రమే జరిగే ఉత్సవాలు ఇవి. ప్రతి నెలా ఆ యా నక్షత్ర దినాల్లో వస్తాయి కనుక వీటిని **నక్షత్రోత్సవాలు** అని కూడా అంటారు.

**రోహిణి నక్షత్రోత్సవం–** శ్రీకృష్ణుడి అవతార నక్షత్రం రోహిణి. ప్రతినెలా రోహిణి నాటి సాయంత్రం శ్రీవారిఆలయంలో ఉన్న రుక్మిణీ శ్రీకృష్ణుల ఉత్సవమూర్తులకు, సహస్రదీపాలంకరణసేవ, ఊరేగింపు నిర్వహింపబడుతుంది.

**ఆర్ద్ర నక్షత్రోత్సవం –** భగవద్రామానుజులవారి జన్మనక్షత్రం ఆరుద్ర. ప్రతినెలా ఆరుద్రనక్షత్రంనాటి సాయంత్రం శ్రీస్వామి వారి సహస్రదీపాలంకరణసేవ తర్వాత శ్రీస్వామివారికి అభిముఖంగా శ్రీరామానుజులవారి ఉత్సవమూర్తి ఊరేగింపబడుతుంది.

**పునర్వసు నక్షత్రోత్సవం–** శ్రీరాముని అవతార నక్షత్రం పునర్వసు. ప్రతినెలా పునర్వసు నక్షత్రంనాటి సాయంత్రం, శ్రీవారిఆలయంలోని శ్రీసీతారామ లక్ష్మణులతోపాటు, ఆంజనేయస్వామివారికి సహస్రదీపాలంకరణసేవ జరిగిన తర్వాత ఊరేగింపును నిర్వహిస్తారు.

**శ్రవణ నక్షత్రోత్సవం–** శ్రీవేంకటేశ్వరస్వామివారు అవతరించిన నక్షత్రమే శ్రవణం. ప్రతినెలా శ్రవణ నక్షత్రం నాటి సాయంకాలం శ్రీదేవిభూదేవి సమేతంగా శ్రీమలయప్పస్వామివారికి సహస్రదీపాలంకరణసేవ అనంతరం ఊరేగింపు చేస్తారు.

కాని కన్యామాసం (సెప్టెంబరు – అక్టోబరు)లో వచ్చే శ్రవణ నక్షత్రం నాటికి ముందు పదిరోజుల నుండే శ్రీవారికి బ్రహ్మోత్సవాలు జరుగుతాయి.

**పున్నమి గరుడసేవ–** ప్రతినెలా పున్నమినాటి రాత్రి 7గంటలకు శ్రీస్వామివారికి ఒక్కరికే బంగారు గరుడోత్సవం జరుగుతుంది.



ఇవీ ప్రతి నెలా తిరుమలలో జరిగే మాసోత్సవాలు.

(ఇంకా ఉంది)



# కాలమే దైవమైన ఉగాది

- డా।। కప్పగంతు రామకృష్ణ,
90320 44115

వసుధపై వసంతం వికసించిన తొలిరోజు ఉగాది. మిగిలిన పండుగల కన్నా ఉగాది ఎంతో ప్రత్యేకమైంది. సాధారణంగా పండుగలన్నీ ఏదో ఒక దేవతకు సంబంధించి ఉంటాయి. ఉగాది ఇందుకు పూర్తిగా భిన్నంగా ఉంటుంది. ఏ దేవుడి పేరూ ఈ రోజు వినిపించదు. ఇది సర్వ దేవతాత్మకం!

ఉగాది కాలానికి సంకేతం. మానవ జీవనానికి, కాలానికి ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకునే ఆనందవేళ ఉగాది. కాలాన్ని గుణిస్తూ మారుతున్న కాలానికి అనుగుణంగా జీవితాన్ని తీర్చిదిద్దుకోవాలనే సందేశాన్ని ఉగాది అందిస్తుంది. సహనానికి, వ్యక్తిత్వవికాసానికి, మనోవికాసానికి ఆలవాలంగా నిలుస్తుంది.

కాలం అనంతమైంది. ఎప్పుడు పుట్టిందో, ఎలా మారుతుందో ఎవ్వరూ ఊహించలేరు. అదొక స్వయంభూమూర్తి. గ్రహగతుల ఆధారంగా ఖగోళంలో ఏర్పడుతున్న, మారుతున్న మార్పులను గమనించి మనం కాలాన్ని విభజన చేస్తున్నాం. అంతేకానీ, కాలానికి 'ఇదీ నిర్దుష్టమైన విభజన' అంటూ ఏదీ లేదు.

## కాలవిభజన

మనం ఉపయోగించే కాలవిభజనలో సూక్ష్మమైన విభాగం 'నిమేషం'. దీన్నే వాడుకలో... 'నిమిషం' అంటున్నాం. నిమేషము అంటే రెప్పపాటు కాలం. ఋగ్వేదంలో నిమేషం అనే పదాన్ని కాలానికి సంకేతంగా కాకుండా 'రెప్పపాటు లేనివారు' (దేవతలు) అనే అర్థంలో ఉపయోగించారు. ఉపనిషత్తుల కాలానికి వచ్చేసరికి కాలాన్ని స్పష్టంగా విభజించిన ఉదాహరణలు కనిపిస్తాయి.

కలా ముహూర్తాః కాష్ఠాశ్చ అహోరాత్రాశ్చ సర్వశః।
అర్ధమాసా మాసా రుతవస్సవంత్సరశ్చ కల్పంతాం।।

అంటూ మాండ్యూక్యోపనిషత్తు కాలవిభజన గురించి వివరిస్తుంది.

## ఋతువులు, కార్తెలు, మాసాల విభజన

వసంత, గ్రీష్మ, వర్ష, శరత్, హేమంత, శిశిర ఋతువులు ప్రస్తుతం వాడుకలో ఉన్నాయి. ఒక్కో ఋతువు రెండు నెలలు ఉంటుంది. దీనిప్రకారం సంవత్సరానికి ఉండే 12 నెలల్లో ఆరుఋతువులు వస్తాయి. వాస్తవానికి అత్యంత ప్రాచీనమైన ఋగ్వేదంలో వసంతం, గ్రీష్మం, శరత్తు అనే మూడు ఋతువుల ప్రస్తావన మాత్రమే ఉంది. వర్షాన్ని ప్రత్యేక ఋతువుగా కాకుండా



ప్రత్యేకకాలంగా పరిగణిస్తున్నట్లు (ఋగ్వేదం ఏడో మండలం) ఉంది. కృష్ణయజుర్వేదంలో ఐదు ఋతువుల ప్రస్తావన ఉంది. ఆ తర్వాత తైత్తిరీయ సంహితలో మొదటిసారిగా ఆరు ఋతువుల ప్రస్తావన కనిపిస్తుంది. అయితే, ప్రస్తుతం మనం ఉపయోగిస్తున్న చైత్రం, వైశాఖం, జ్యేష్ఠం... అనే 12 పేర్లు కాకుండా మధు, మాధవ, శుక్ర, శుచి, నభ, నభస్య, ఇష, ఊర్జ, సహ, సహస్య, తప, తపస్య అనే పేర్లను ఇందులో ఉపయోగించారు.

ప్రస్తుతం మనం ఉపయోగిస్తున్న చైత్ర, వైశాఖాలనే మాసాల పేర్లు చంద్రగ్రహ సంచారం ఆధారంగా ఏర్పడ్డాయి. నక్షత్రాల ఆధారంగా చంద్రుడి గమనాన్ని పరిశీలిస్తే చంద్రుడు ఒక నక్షత్ర కూటమి నుంచి బయల్దేరి మళ్ళీ అదే నక్షత్రకూటమికి చేరుకోవటానికి దాదాపు 27 రోజులు పడుతుంది. దీన్నే నక్షత్రమాసం అంటాం. ఈ 27 రోజుల్లో చంద్రుడు దాటే ఒక్కో నక్షత్రం ఆధారంగా అశ్వని, భరణి, కృత్తిక మొదలైన 27 నక్షత్రాల పేర్లు ఏర్పడ్డాయి. ఆ తర్వాత ప్రతి నెలలో నిండు పౌర్ణమి రోజున చంద్రుడు ఏ నక్షత్రంలో ఉంటాడో ఆ నక్షత్రం పేరు మీద ఆ నెలకు పేరు ఏర్పాటు చేశారు. దీనిప్రకారం చంద్రుడు పౌర్ణమి రోజున చిత్త నక్షత్రంలో ఉంటే చైత్రమాసం అవుతుంది. ఇదేతీరులో విశాఖనక్షత్రంలో పౌర్ణమి వచ్చే నెల వైశాఖమాసం... ఇలా అన్ని నెలల పేర్లు ఏర్పడ్డాయి.

చంద్రగమనం మాదిరిగానే సూర్యుడికి సంబంధించిన సంవత్సర కాలాన్ని 27 భాగాలుగా చేసి వాటికి 'కార్తె' అనే పేరు నిర్ణయించారు. ఒక్కో నక్షత్ర కూటమిలో సూర్యుడు దాదాపు రెండు వారాల పాటు ఉంటాడు. దీని ప్రకారం ఒక్కో కార్తె సుమారుగా 13 లేదా 14 రోజులు ఉంటుంది. అశ్వని నుంచి రేవతి వరకు ఇలా నక్షత్రాల పేర్ల మీద కార్తెలు ఏర్పడ్డాయి. ఆదివారం నుంచి శనివారం వరకు మనం ఉపయోగించే వార విభజన గ్రహకక్ష్యలను ఆధారంగా చేసుకుని నిర్ణయించారు. ఈ వివరాలు సూర్య సిద్ధాంత గ్రంథంలో ఉన్నాయి. దీనిప్రకారం గ్రహకక్ష్యల్లో నాల్గవది సూర్యకక్ష్య. దీనిప్రకారం మొదటివారం ఆది వారంగా ఏర్పడింది. సూర్యుడి నుంచి నాలుగో కక్ష్యలో చంద్రుడు ఉంటాడు కాబట్టి ఆదివారం తర్వాత 'సోమవారం' (సోముడంటే చంద్రుడు) ఏర్పడింది. చంద్రుడి నుంచి నాలుగో కక్ష్యలో బుధుడు ఉంటాడు కాబట్టి బుధవారం... ఇలా మిగిలిన వారాలన్నీ ఏర్పడ్డాయి.

## పంచాంగాలు, సిద్ధాంతాలు

ఉగాది అనగానే గుర్తుకువచ్చే అంశాల్లో ఉగాది పచ్చడి తర్వాతిస్థానం పంచాంగానిదే. రాబోయే సంవత్సర కాలంలో తమ భవిష్యత్తు ఎలా ఉంటుందో తెలుసుకోవాలన్న ఆసక్తి ప్రతి ఒక్కరిలో ఉంటుంది. ఇందుకోసం ప్రతి ఒక్కరూ ఉగాది రోజున పంచాంగ శ్రవణం చేస్తారు. పంచాంగ రచనకు సూర్య, దృక్ అనే రెండు సిద్ధాంతాలు మనదేశంలో అత్యంత ప్రాచుర్యంలో ఉన్నాయి. వీటిల్లో సూర్యసిద్ధాంతం అత్యంత ప్రాచీనమైనమైంది. సుమారుగా 1800 సంవత్సరాలుగా ఇది ప్రాచుర్యంలో ఉంది. భట్టోత్పల, దివాకర, కేశవ, విజయనంది, చిత్రభాను, శ్రీరంగనాథ, మకరంద, నరసింహ, భాస్కరాచార్య, ఆర్యభట్ట, వరాహమిహిర తదితర ఖగోళగణిత (ఆస్ట్రోమ్యాథమెటిక్స్) శాస్త్రవేత్తలు ఖగోళ పరిజ్ఞానం ఆధారంగా కాలవిభజన చేసి, స్పష్టమైన వివరణ ఇచ్చారు. వీరిలో క్రీ.శ.1178 కాలానికి చెందిన మల్లికార్జున సూరి రాసిన 'సూర్యసిద్ధాంతభాష్యం' తెలుగు, సంస్కృత భాషల్లో ముద్రితమై ఇప్పటికీ వాడుకలో ఉంది. పంచాంగ రచనలకు ఇదే అత్యంత ప్రామాణికమైన గ్రంథం. సూర్య సిద్ధాంతం, ఆర్యభట్టీయం, బ్రహ్మస్ఫుట సిద్ధాంతం- ఈ మూడు గ్రంథాల ఆధారంగా ప్రపంచంలోని అనేక దేశాలు ఇప్పటికీ తమ కాలమానిని (క్యాలెండర్) తయారుచేసుకుంటున్నాయి. దృక్‌సిద్ధాంతాన్ని కేరళ రాష్ట్రానికి చెందిన ఖగోళ శాస్త్రజ్ఞుడు 'పరమేశ్వర' (క్రీ.శ.1431) వ్యాప్తిలోకి తీసుకువచ్చారు. సూర్య, దృక్ సిద్ధాంతాల ఆధారంగానే ఇప్పటికీ పంచాంగాలు తయారవుతున్నాయి.

# వృత్రాసురుడు

- డా॥ వైష్ణవాంఘ్రి సేవకదాస్,
98219 14642

వృత్రాసురుని చరిత్ర శ్రీమద్భాగవతం, షష్ఠ స్కంధంలో వస్తుంది. దేవగురువు బృహస్పతి దేవతల్ని విడిచి వెళ్లిపోయినప్పుడు గురుకరుణ లోపించి దేవతలు దానవులచే పరాజితులయ్యారు. అప్పుడు బ్రహ్మ ఆదేశం మేరకు దేవతలు విశ్వరూపుని పురోహితునిగా స్వీకరించి తమ పూర్వవైభవాన్ని పొందగలిగారు. అయితే విశ్వరూపుడు తదనంతరం దేవతల పేరునే కాకుండ రహస్యంగా అసురుల పేరు మీద ఆహుతులను అర్పించడం చూసి ఇంద్రుడు అతణ్ణి వధించాడు.

దీంతో విశ్వరూపుని తండ్రి త్వష్ట. పుత్రమరణానికి ప్రతీకార ఉద్దేశ్యంతో అతడు ఇంద్రుణ్ణి సంహరింపగలిగే వ్యక్తిని ఉద్భవింపజేయడానికి యజ్ఞం చేయగా వృత్రాసురుడు బయటకు వచ్చాడు. అతని భయంకరమైన ఆకారాన్ని చూడగానే అందరూ భయంతో నలుదిక్కులా పరిగెత్తారు. వాడు తన తేజస్సుతో, శరీరంతో సకలలోకాలను



కప్పివేసినట్లుగా కనిపించడం వల్ల వృత్రాసురుడని పేరు వచ్చింది. ఇంద్రాది దేవతలు తమ ఆయుధాలతో వృత్రాసురునిపై పై దాడి చేశారు. కాని అతడు వారి ఆయుధాలన్నింటిని క్షణంలో మ్రింగేశాడు. దీంతో తేజోహీనులైన దేవతలు దేవదేవుణ్ణి ఆశ్రయించారు.

దేవతల స్తుతులకు ప్రసన్నుడైన నారాయణుడు దేవతలకు మార్గోపదేశం చేస్తూ ఇలా అన్నాడు :

"ఇంద్రా! ఇప్పుడు మీరు దధీచి దగ్గరకు వెళ్లండి. తపస్సుచే ఆయన దేహం దృఢమైంది. మీరు ఆయన దేహాన్ని యాచించండి. దధీచి ముని ఎంత శక్తిమంతుడంటే ఆయన ద్వారా ఆధ్యాత్మికజ్ఞానాన్ని పొందిన అశ్వినీ కుమారులు జీవన్ముక్తులయ్యారు. ఆ దధీచియే నారాయణ కవచాన్ని త్వష్టకు ఇచ్చాడు. త్వష్ట ద్వారా దానిని విశ్వరూపుడు పొందాడు. విశ్వరూపుని నుండి ఆ నారాయణ కవచాన్ని మీరు పొంది అసురులను జయించారు. నారాయణకవచ ప్రభావం వల్లనే దధీచి శరీరం దృఢంగా ఉంది. మీ తరపున అశ్వినీకుమారులు యాచిస్తే ఆయన తప్పకుండా తన దేహాన్ని ఇస్తాడు. ఆయన శరీరంలోని ఎముకలతో వజ్రాయుధాన్ని విశ్వకర్మ తయారుచేయగలడు. దాని ద్వారానే వృత్రాసుర వధ సాధ్యమౌతుంది. అతడు మరణించిన తరువాత మీ ఆయుధాలు మీకు లభిస్తాయి." అని చెప్పాడు. శ్రీమన్నారాయణుని ఆదేశంతో దేవతలు దధీచి ముని దగ్గరకు వెళ్ళి, ఆయన దేహాన్ని అర్థించారు. దేవతల కోరిక మేరకు ఆయన ఆత్మను భగవచ్చరణారవిందముల చెంత నిలిపి పాంచ భౌతికదేహాన్ని త్యజించాడు. దధీచి అస్థికలతో విశ్వకర్మ వజ్రాయుధాన్ని తయారు చేశాడు. దానిని ధరించిన ఇంద్రుడు తేజోవంతుడయ్యాడు.

అప్పుడు ఇంద్రుడు ఐరావతాన్ని ఎక్కి వృత్రాసురునిపై దాడి చేశాడు. ఇంద్రుడి వజ్రాయుధ ప్రభావం వల్ల అసురుల యుద్ధదర్పం నశించింది. వారు తమ నాయకుణ్ణి విడిచి పారిపోవడానికి సిద్ధపడ్డారు. అది చూసిన వృత్రాసురుడు వారితో–

"అసురవీరులారా! నా మాట వినండి. రణభూమిని విడిచిపోకండి. మరణం అనేది ఈ జగత్తులో నిశ్చయమైనట్టిది. కాబట్టి యశోవంతమైన మరణానికై ప్రయత్నించండి. యోగసాధనలో ప్రాణాన్ని నిగ్రహించి భగవచ్చింతనలో ఉన్న వాడై మరణించడం, శత్రువుకు వెన్ను చూపకుండా యుద్ధరంగంలో వీరమరణం పొందడం అనేవి మహత్తరమైన మరణాలని" చెప్పాడు.

వృత్రాసురుని మాటలను అసురులు వినక, రణరంగంనుండి పారిపోయారు. దీంతో వృత్రాసురుడు. ఒక్కడే దేవతల నెదుర్కొన్నాడు. వృత్రాసురుడు, ఇంద్రుని మధ్య భీకరయుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో ఇంద్రుడు వజ్రాయుధంతో వృత్రాసురుని రెండుభుజాల్ని ఖండించాడు.

దీంతో వృత్రాసురుడు రెక్కలు తెగి పడ్డ పర్వతం లాగా కనిపించాడు. అయినా అతడు పెద్దగా నోరు తెరిచి ఐరావతంతో పాటు ఇంద్రుణ్ణి మింగేశాడు. అది చూసిన బ్రహ్మాదిదేవతలు హాహాకారాలు చేశారు. నారాయణ కవచ రక్షితుడైన ఇంద్రుడు మరణించలేదు. అప్పుడు అతడు వజ్రాయుధంతో వృత్రాసురుని పొట్టను చీల్చి బయటకు వచ్చాడు. బయటకు రాగానే అతడు వృత్రాసురుని శిరస్సును ఖండించాడు. కాని వృత్రాసురుని శిరస్సును ఖండించడానికి ఇంద్రునికి ఒక సంవత్సర కాలం పట్టింది. వృత్రాసురుని తల నేలమీద పడగానే పుష్పవృష్టి ఆకాశంనుండి కురిసింది. ఆ సమయంలో వృత్రాసురుని దేహం నుండి ఆత్మజ్యోతి బయటకు వచ్చి అందరూ చూస్తుండగానే భగవద్ధామం వైపుకు ప్రయాణించింది.

ఋషుల మాట మీద ఇంద్రుడు వృత్రాసురవధ కావించాడు. వెంటనే అతనికి బ్రహ్మహత్యాపాతకం పట్టుకుంది. ఇంద్రుడు దాదాపుగా భోగశూన్యుడే అయ్యాడు. మానస సరోవరంలోని కమలంలో వసించే లక్ష్మీదేవిచే రక్షింపబడ్డ కారణంగా ఇంద్రునిపై పాపప్రభావం కనబడలేదు. విష్ణువునే ధ్యానిస్తూ ఇంద్రుడు చివరకు సర్వపాపవిముక్తుడయ్యాడు.

వృత్రాసుర సంహారకథను, వినడం వల్ల మనిషి సకలపాపవిముక్తుడౌతాడు. ఇంద్రియ పటుత్వం, యశోవృద్ధి, ఐశ్వర్యవృద్ధి కలుగుతాయి.

తి.తి.దే.
కాల్‌సెంటర్
24 గంటలూ.. మీ కోసం!
0877-2233333,
0877-2277777
ఏ సమయంలో అయినా
మీరు ఫోన్ చేయవచ్చు

తిరుమల తిరుపతి దేవస్థానం భక్తుల సౌకర్యార్థం
తిరుపతిలో ఏర్పాటు చేసిన ఈ సమాచార కేంద్రంలో
భక్తులకు కావలసిన అన్ని వివరాలను
ఫోన్ చేసి తెలుసుకోవచ్చు.

శ్రీవారి ఆర్జిత సేవాటిక్కెట్లు,
వసతి, విరాళపథకాలు
తదితర వివరాలకోసం...

ఈ కాల్‌సెంటర్‌కు ఫోన్ చేసి దేవస్థానానికి
సంబంధించిన సమస్త సమాచారం మీరు తెలుసుకోవచ్చు.

బాలవాక్కు

# అతిగా ఆశపడద్దు...

పూర్వం గురువులు కథల్ని బోధించడంద్వారానే శిష్యుల్లో ఎంతో ప్రపంచజ్ఞానాన్ని వృద్ధిచేసేవాళ్లు. మంచి వ్యక్తులుగా వాళ్లను తీర్చిదిద్దేవాళ్లు. పాటలీపుత్రనగరాన్ని సుదర్శనుడనే రాజు పరిపాలిస్తుండేవాడు. ఆయనకు ముగ్గురు కొడుకులు. వాళ్లను రాజు చాలా గారాబంగా పెంచాడు. కాని వాళ్లు చాలా మందమతులు. అంటే వాళ్లకు ఏవిషయమైనా వెంటనే అర్థమయ్యేదికాదు. ఇలాంటి వాళ్లను భవిష్యత్తులో యువరాజుల్ని చేస్తే రాజ్యం గతి ఏమవుతుంది? అని ఆలోచించి, రాజుగారు ఎంతోమందిపండితుల్ని పిలిపించి, 'ఎలాగైనా నా కొడుకుల్ని ప్రయోజకులుగా చేయండి'– అని కోరాడు.

వచ్చినపండితుల్లో ఎవరూ అందుకు సిద్ధపడలేదు. చివరకు విష్ణుశర్మ అనే పండితుడు 'ఆరునెలల్లో మీ కుమారుల్ని అఖండలోకజ్ఞానసంపన్నులుగా చేస్తాను' – అని ముందుకు వచ్చాడు. ఈ మాటలు విని పండితులందరూ ఆశ్చర్యపడ్డారు. రాజుగారు ఆ పండితుణ్ణి సత్కరించి, ఆయనవెంట తనకుమారుల్ని అతని ఆశ్రమానికి పంపాడు.

ఆ గురువు – విష్ణుశర్మ చెప్పినకథలనే 'పంచతంత్ర కథలు' అంటారు. ఈ కథల్లో అనేకయుక్తుల్నీ, నీతుల్నీ ఎన్నో ఆయన బోధించారు.

ఆయన బోధించిన అనేక కథల్లో ఒక కథ...

## పులి-కంకణం-బ్రాహ్మణుడు

ఒక చెరువుగట్టుమీద ఉండేపొదలో ఒకపులి నివసిస్తూ ఉండేది. ప్రతిదినమూ అవతలిగట్టుకు పోయి, ఏ జంతువునో వేటాడి, తన కడుపు నింపుకొనేది. కొన్నాళ్లకు అది ముసలిదైపోయింది. అవతలిగట్టుకు పోలేనిస్థితి వచ్చింది. అందువల్ల ఆహారం లేక మరింత బలహీన పడింది. 'ఆహారం ఎలా సంపాదించాలా?' అని ఆలోచిస్తుండగా అటువైపు వెళ్తున్న ఒక బ్రాహ్మణుడు కనిపించాడు.



మాస్టర్ జి.సోహన్‌సాయి,
8వ తరగతి,
ఎస్.వి.విద్యాలయ ఆఫ్ భారతీయ
విద్యాభవన్, తిరుపతి.

వెంటనే పులికి ఒక ఆలోచన మెదిలింది. ముందు తాను వేటాడి చంపిన మనుష్యులతాలూకు నగలు తనవద్దనే ఉన్నాయి. వాటిలో నుండి ఒకరత్నకంకణాన్ని తీసుకొని, ఆ బ్రాహ్మడికి చూపెడుతూ, "స్వామీ! ఈ బంగారుకంకణాన్ని దయతో తీసుకోండి. రండి"– అని పిలిచింది. బ్రాహ్మణుడికి పులిని చూడగానే భయంకల్గినా– రత్నాలు పొదిగిన బంగారు కడియం చాలా విలువైంది. కాబట్టి తనసంతానానికి ఎప్పటికైనా పనికివస్తుందని కాస్సేపు ఆలోచించాడు. కానీ, మళ్లీ పులి క్రూరజంతువు కాబట్టి వెళ్లకూడదనుకొన్నాడు.



చివరికి, పులి "అయ్యా! నేను క్రూరజంతువునే! కానీ, ఇప్పుడు ముసలితనం వచ్చింది. అంచేత వేటాడటం మానేశాను. ముందు చేసినపాపాలు పోగొట్టుకోడానికే ఈ రత్నకంకణం మీవంటి పుణ్యాత్మునికి దానం ఇవ్వాలనుకొన్నాను. నన్ను నమ్మండి. ఈ చెరువులో స్నానంచేసి రండి! ఈ దానం తీసుకొని నన్ను అనుగ్రహించండి" అని ప్రాధేయపడింది.

చివరికి పులి ప్రార్థనతో బ్రాహ్మణుడు మెత్తబడ్డాడు. మరోవైపు బంగారుమీది వ్యామోహం! ఇక ముందువెనుకలు ఆలోచించకుండా కడియం తీసుకోడానికే సిద్ధపడ్డాడు. అందుకై ఆ చెరువులో స్నానంచేసి, నాల్గడుగులు వేయగానే పులి ఆయనపై దూకి, గొంతుకొరికి చంపి, తన ఆకలి తీర్చుకొంది.

అతిసంపదలు దేహిని అజ్ఞాని చేయు

# వేదాలు తెచ్చిన నారాయణ

- ఆచార్య గార్లపాటి దామోదరనాయుడు,
78939 82500




అవతరించడమంటే ఆవిర్భవించడం. పరమపద వాసి పరమాత్మ నిత్యవిభూతి నుంచి అంటే తన లోకం నుంచి ఈ లోకానికి దిగడం అని అర్థం. ఇచ్ఛా జ్ఞాన క్రియా శక్తులు ఎక్కడ పరాకాష్ఠస్థితిలో ఉంటాయో అదే అవతారం.

## మత్స్యావతార మూలకథ

దశావతారాల్లో మొదటిది మత్స్యావతారం. శ్రీమహావిష్ణువు మత్స్యరూపాన్ని ధరించి సోమకాసురుడు అపహరించిన వేదాల్ని తిరిగి బ్రహ్మకు చేర్చడం ఈ అవతార మూలకథ. వైవస్వత మనువు అర్ఘ్యం వదిలే సమయంలో అతడి దోసిలిలో ఒక మత్స్యం చేరి తనను రక్షించమని అంటుంది. అతడు దాన్ని ఒక చిన్న నీటికుండలో నిలుపుతాడు. మరునాటికది భాండం పట్టనంతగా పెరిగి కాపాడమని అంటుంది. ఎంత పాత్రా దాని పరిమితికి చాలకపోగా మనువు దానిని నూతిలో దింపుతాడు. అది అందులో కూడ పట్టలేదు. తర్వాత దానిని చెరువులో వదలుతాడు. చెరువూ చాలలేదు. చివరకు సముద్రంలో దాన్ని విడిచి అలా పెరగడానికి హేతువును అడుగుతాడు. అప్పుడు ఆ మత్స్యం తాను శ్రీహరిని అని చెప్పి, నూరేండ్లకు ప్రళయం వస్తుందనీ ఆ సమయంలో మహాసత్వాల్నీ, వేదాల్నీ ఒక నావలో ఉంచి దానిని తన శృంగానికి కట్టమని చెప్పి నావను ఇచ్చి అదృశ్యం అవుతుంది. ఆ ప్రకారంగానే ప్రళయ కాలంలో మనువు మత్స్యం చెప్పినట్లే, సర్వపదార్థసత్వాల్నీ, వేదాల్నీ నావలో ఉంచుతాడు. ప్రళయానంతరం నావలో ఉన్న సత్వాల నుంచి తిరిగి ప్రపంచంలోని సర్వపదార్థాలు ఏర్పడ్డాయని మత్స్యావతార కథ.

కావ్యప్రక్రియలో మత్స్యావతార వర్ణన సందర్భాన్ని బట్టి సూచన మాత్రంగా చేయబడింది. గీతగోవిందంవంటి కావ్యాల్లో మత్స్యావతార వర్ణన ప్రత్యేకంగా కనిపిస్తుంది.

ప్రళయ పయోధి జలే ధృతవానసి వేదం
విహిత వహిత్ర చరిత్ర మఖేదం
కేశవ ధృత మీన శరీర జయజగదీశ హరే ధ్రువం

"కేశవా! ప్రళయకాలంలో ఏడు సముద్రాలు కలిసిన జలప్రళయంలో మత్స్యావతారంలో నావ వలె ఉద్ధరించావు."

- - - - - - - -

1)మహాశృంగాయనమః (549); 2)కృతాగమాయ నమః(673); 3)నైకశృంగాయ నమః(778); 4)శృంగిణే నమః(812) అని సంస్కృత స్తోత్రాల్లో మత్స్యమూర్తి చేసిన వేదోద్ధరణక్రియతో పాటు ఆ మూర్తివర్ణన కూడ కనిపిస్తుంది.

## స్తోత్రాలు-మత్స్యావతారం

స్తోత్ర వాఙ్మయంలో దశావతార వర్ణనలు అనేకాలు కనిపిస్తాయి. ప్రతి వర్ణనలోను తప్పకుండా మత్స్యావతార ప్రస్తావన కనిపిస్తుంది.

**వేదోద్ధార విచారమతే సోమక దానవ సంహరణే**
**మీనాకార శరీర! నమో భక్తంతే పరిపాలయమామ్॥**

అని మత్స్యావతారవర్ణన కనిపిస్తుంది.

- - - - - - - -

ఎఱ్ఱన నృసింహపురాణంలో మత్స్యావతారవర్ణన కనిపిస్తుంది. ఇది దేవతలు నారాయణమూర్తిని స్తుతించే సందర్భంలో ఉంది. వేదచోరుడైన దానవుడు ప్రళయ పయోధిలో వేదాల్ని పడవేయగా, ముదుసలి వేల్పు అయిన బ్రహ్మ చదువుల్ని కోల్పోయి ఒక జాడయుగానక దిమ్మరించాడు. అప్పుడు నీవు బ్రహ్మను ఓదార్చి, ఆ దొంగ వెంట 'దాడి వెట్టిన యఖర్వభవత్తిమి రూపమిప్పుడున్ మదరుచి గ్రోలుచుండు' (నృసింహపురాణము-ఎఱ్ఱన 3-34) అని వర్ణింపబడింది.

దశావతారాలు, ఏకవింశత్యవతారాలు, మన్వంతరావతారాలు పరస్పరం కలిపి పోతన భాగవతంలో వర్ణించాడు.

శృంగారనైషధంలో దశావతారవర్ణన మనోహరంగా సాగింది. '.....మత్స్యావతారమెత్తి నీవు తోకను విదిలించగ పైకి రేగిన నీరు ఆకసంలో తెల్లగా పారింది. దాన్ని చూచి అఖిలజగం గంగానదియని వర్ణించింది. (శృంగార నైషధము-8-120) మల్లన తన 'రుక్మాంగదచరిత్ర'లో ఐదవ ఆశ్వాసంలో- "భక్తపోషణా శ్రుతులు హరించి అంబుధిలో జొచ్చిన అసురాధిపు గర్భాన్ని మీనరూపమై వ్రక్కలించి దేవతలు నుతింపగా వేదాల్ని వాక్పతికిచ్చిన నీ మహోగ్ర శూరత పొగడ నేర్తుమే" అని వర్ణించాడు. నంది మల్లయ, ఘంటసింగనల వరాహపురాణాం ప్రథమాశ్వాసం 121 పద్యంలోను, నవమాశ్వాసం దండకం(110)లోను మత్స్యావతారప్రస్తావన ఉంది.

ప్రబంధయుగానికి నాయకమణి శ్రీకృష్ణదేవరాయలు. ఆతని కృతి ఆముక్తమాల్యద. ఇందులో ప్రథమాశ్వాసం చివరిలోని ఆశ్వాసాంత పద్యంలో రాయలు శ్రీవేంకటేశ్వరుడికి దశావతారాల్ని అన్వయించి ఒకే కందంలో అందంగా స్మరించాడు. ఈ పద్యంలో దశావతారాల నామాలు మాత్రమే కనిపిస్తాయి. ఆముక్తమాల్యద చతుర్థాశ్వాసంలో విష్ణుచిత్తుడు శ్రీమహావిష్ణువును స్తుతించే సందర్భంలో రాయలు మత్స్యావతారాన్ని మూడు పద్యాల్లో వర్ణించాడు. ఆ పద్యాలు ఆముక్తమాల్యద చతుర్థాశ్వాసం-17, 18, 19 పద్యాలు.

'మనుచరిత్ర'లో పెద్దన- శాంతి దాంతి దయాసత్య శౌచ నిరతుడైన స్వారోచిషుడు విష్ణువును గూర్చి తపస్సు చేయగా ఆ దేవదేవుడు ప్రత్యక్షమౌతాడు. ఆ సందర్భంలో పెద్దన మత్స్యావతార వర్ణన స్వారోచిషునితో చేయించాడు. (మనుచరిత్ర-6-104) నందితిమ్మన పారిజాతాపహరణంలో 'ప్రామినుకుల దొంగ పాతాళ కుహరంబు జొరబాటి చీటిన చోఅవీవ' అని మత్స్యావతార ప్రస్తావన చేశాడు. అయ్యలరాజు రామభద్రుడు రామాభ్యుదయకావ్యంలో మత్స్యావతారాన్ని శ్రీరాముని బాల్యంతో అన్వయిస్తూ-శిశువు అనిమిష దృష్టితో చూడడాన్ని 'మీనంబు నయినాడ నేనని సూచించు తెఅగున ననిమిష దృష్టిచూచు' (3-137) అని వర్ణించాడు. తెనాలిరామకృష్ణుడు 'పాండురంగమాహాత్మ్యంలో 'జగన్నిధీ సోమకాసురుడు మ్రుచ్చిలించిన ప్రాజదువులను తెచ్చియిచ్చి విధాతృనకు తిరిగి అతడి వదన సరోజాల్ని గంధలలితంబులు చేసినావు గదా' (2-56) అని పేర్కొన్నాడు. తెనాలి రామకృష్ణకవి ఘటికాచల మాహాత్మ్యంలో యగణదండకంలో మత్స్యావతారవర్ణన చేశాడు. ముద్దుపళని 'రాధికాసాంత్వనంలో 'రహి ముద్దుటడుగులు రాజీవములగీర' అని మత్స్యావతార సూచన చేసింది. (రాజీవము అంటే చేప).

తెలుగుసాహిత్యంలో శ్రీమహావిష్ణువు దశావతారాల్ని ఒక ప్రబంధంగా తీర్చిదిద్దినవాడు ధరణిదేవుల రామయ్య మంత్రి. ఇతడు 1790 ప్రాంతంవాడు. పది ఆశ్వాసాల ఈ ప్రబంధంలో ప్రథమాశ్వాసం పూర్తిగా మత్స్యావతార కథే.

పదకవులైన అన్నమయ్యాదుల కీర్తనలలోను, కొన్ని శతకాలలోను, కొన్ని చాటువులలోను మత్స్యావతార ప్రసక్తి కనిపిస్తుంది.

# అన్నమయ్య స్తుతించిన స్త్రీ దేవతామూర్తులు

గృహలక్ష్మి

- డా॥ పి.సి.వేంకటేశ్వర్లు, 94901 64963

పదకవితా పితామహుడైన అన్నమయ్య పురుషదేవతా మూర్తుల్నే కాకుండా జగన్మాతలైన స్త్రీ దేవతామూర్తుల్ని కూడా అనేక కీర్తనల్లో స్తుతించాడు. వాక్కు, అర్థం వలె కలసిన పార్వతీ పరమేశ్వ రుల్ని కాళిదాసు స్తుతించినట్లే పురుష దేవతామూర్తులకు సహధర్మ చారిణులైన స్త్రీ దేవతామూర్తులైన అలమేల్‌మంగ, గోదాదేవి, లక్ష్మీ దేవి, సీతాదేవి మొదలైన స్త్రీ దేవతామూర్తుల్ని అన్నమయ్య కీర్తించాడు.

## అలమేలుమంగ

అన్నమయ్య స్తుతించిన స్త్రీదేవతామూర్తుల్లో మొదట చెప్పుకోవలసింది అలమేలుమంగనే. అన్నమయ్య పదాన్నే ప్రధానంగా "అలమేల్‌మంగ" పేరునే ఎక్కువగా ప్రస్తావించాడు. 'అలమేల్‌మంగ' అంటే "పద్మం మీద అందమైన స్త్రీ" అని అర్థం. తిరుమలలో అమ్మ వారికి ప్రత్యేక ఆలయం లేకున్నా తిరుచానూరు, శ్రీనివాసమంగా పురాల్లో ప్రత్యేక ఆలయాలున్నాయి. వేంకటేశ్వరుడు మెచ్చుకొనే విధంగా ఎలా ఆటపాటలతో నాట్యంచేసిందో అన్నమయ్య వర్ణించాడు.

అలరులు గురియుగ నాడెనదే
అలకలు గులుకుల నలమేల్మంగ

అర విరి సొబగుల నతివలు మెచ్చఁగ
అరతెర మరుఁగున నాడెనదే
వరుస పూర్వదువాళపు తిరుపుల
హరిఁ గరు గింపుచు నలమేల్ మంగ
.............................. (5-24)

అంతేకాదు పెండ్లికూతురైన అలమేల్మంగ సిగ్గు మొగ్గల్ని "పిడికిట తలంబ్రాల పెండ్లికూతురు" అనే కీర్తనలో అన్నమయ్య ముగ్ధమనోహరంగా వర్ణించాడు. వేంకటేశ్వర సమేత అలమేల్మంగను

కంటి శుక్రవారము గడియలేడింట
అంటి అలమేల్మంగ అండనుండే స్వామిని

- అంటూ తరంగ డోలికల్లాంటి కీర్తనల్లో కీర్తించాడు.




## గోదాదేవి

ఈ అమ్మవారినే 'ఆండాళమ్మ' అనే తమిళంలో "చూడి కొడుత్తనాచ్చియార్" అనీ పిలుస్తారు. ఆళ్వారుల్లో ప్రసిద్ధుడైన పెరియాళ్వార్ పెంపుడు కూతురైన గోదాదేవి శ్రీరంగనాథుని వరించి వివాహం చేసుకొన్న కథ మనకు తెలిసిందే. గోదాదేవి తాను ధరించిన దండను దేవునికి సమర్పించిన తీరును అన్నమయ్య శ్రీకృష్ణదేవ రాయల కంటే ముందు తన కీర్తనలో ఇలా చెప్పాడు.

పెరియాళువారు పిసికి పై వేసిన
విరులదండలు మెడవేసినవాడు

శ్రీరంగంలో గోదాదేవి గొప్పగా పూజలందు కొంటుంది. మహాలక్ష్మే గోదాదేవి, వేంకటేశ్వరుడే శ్రీరంగ నాథుడని భావించిన అన్నమయ్య వారి గోదాదేవిని చక్కగా వర్ణించాడు.

చూడరమ్మ సతులార సోబాన బాడరమ్మ
కూడున్నది పతిఁ జూడికుడుతనాచారి

శ్రీమహాలక్ష్మియట సింగారాల కేమరుదు
కాముని తల్లియట చక్కఁదనాల కేమరుదు
సోముని తోఁబుట్టువట సొంపుఁగళ కేమరుదు
కోమలాంగి యీ చూడికుడుత నాచారి

**(26-246)**

ఇలా ఆమెకు ఏదీ కొదవలేదని విపులంగా కీర్తించాడు అన్నమయ్య.

## లక్ష్మీదేవి

శ్రీమహావిష్ణువు ఎదపై కొలువుండే లక్ష్మీదేవి జగన్మాత. అమ్మలగన్న అమ్మ. పాలసముద్రం నుండి ఉద్భవించిన సౌందర్యరాశి. అన్నమయ్య శ్రీమహావిష్ణువును పెండ్లాడిన లక్ష్మీదేవిని ఒక విశిష్ట దేవతామూర్తిగా కీర్తించాడు. ఆమె విలాసాన్ని, విభవాన్ని, ప్రపంచాన్ని 'ధనం మూల మిదం జగత్' అని ఆడించే తీరును అన్నమయ్య ఇలా వర్ణించాడు.

రూకలై మాడలై రువ్వలై తిరిగీని
దాకొని వున్నచోటు దానుండదదివో

వొకరి రాజు జేసు నొకరి బంటుగ జేసు
వొకరి కన్నెకల వేరొకరికి నమ్మించు
వొకచోట నున్న ధాన్య మొకచోట వేయించు
ప్రకటించి కనకమే భ్రమయించీ జగము

.........................................

నిగనిగమనుచుండు నిక్షేపమై యుండు
తగిలి శ్రీవేంకటేశు తరుణియై తా నుండు
తెగనిమాయై యుండు దిక్కుదెసయై యుండు
నగు తా మాపాల నుండి నటియించు బసిడీ

**(1-458)**

లక్ష్మీదేవి అసలు తత్త్వాన్ని అన్నమయ్య సహజ సిద్ధంగా స్తుతించాడు.

## సీతాదేవి

సుగుణానికి, సహనానికి నిలువెత్తు సాక్షి సీతాదేవి. భూదేవి బిడ్డగా అంతటి ఓర్పును కల్గిన ఆదర్శ శిరోమణి. లక్ష్మీదేవి త్రేతాయుగంలో సీతాదేవిగా అవతరించింది. రాముడు శివధనుస్సు సంధించడంతో ఆయన సహధర్మ చారిణి అయింది. అన్నమయ్య రాముని కీర్తిస్తూ వందల సంకీర్తనలు చెప్పే క్రమంలో సీతాదేవిని కూడా ఎన్నోచోట్ల స్తుతించాడు. సీతారామకల్యాణ సమయంలో పెండ్లికూతురైన సీతాదేవిని ఎంత ముగ్ధమనోహరంగా వర్ణించాడో చూడండి.

సిగ్గరి పెండ్లికూతుర సీతమ్మ

.......................................

అల్ల నాఁడే రాఘవుఁడు హరువిల్లు విరిచెను
యెల్లి నేఁడే పెండ్లాడీ నిదివో నిన్ను
యెల్లగా జనకుఁడు నిన్నిచ్చీనట మీఁదె
వెల్లివిరి నీ మాట వినవమ్మా **(26-40)**

పెండ్లి ముచ్చటనంతా ఒకే కీర్తనలో ఇమిడ్చిన అన్నమయ్య సీతాదేవి పడిన కష్టాన్ని కూడా విడవలేదు. రామాయణ కథను చెప్పే చాలా కీర్తనల్లో సీతను ప్రస్తుతించాడు.

అన్నమయ్య దశావతార దేవతామూర్తుల్ని, స్త్రీదేవతా మూర్తుల్ని కీర్తించినా ఆయన మనసులో కొలువైంది ఒకే ఒక దేవతామూర్తి. ఆయన వేంకటాద్రిపై వెలసిన శ్రీనివాసుడు. ఆయనే భక్తుల హృదయాంతరాళాల్లో అంతరాత్మ అయిన శ్రీహరి. ఆ మహిమాన్వితుని 32 వేల సంకీర్తనల్లో కీర్తించిన అన్నమయ్య దివ్యస్వరూపుడు. ఎందుకంటే ఏ వాగ్గేయకారుడు చెప్పనన్ని కీర్తనలు చెప్పాడు. ఏ పదకర్తా దర్శించనన్ని దివ్యక్షేత్రాల్ని దర్శించాడు. దేవతామూర్తుల్ని స్తుతించాడు. వైష్ణవ క్షేత్రాలంటే 108 దివ్యతిరుపతులు మాత్రమే కాదు హరినామ స్మరణ చేసిన ప్రతి క్షేత్రం పవిత్రమైనదని తన కీర్తనల ద్వారా చాటిన ఆచరణవాది అన్నమయ్య.

# లోకాలన్నీ గౌరవించే ఇల్లాలు

– డా॥ అద్దంకి శ్రీనివాస్,
98488 81838



మ. హరికిం బట్టపుదేవి పున్నెముల ప్రో వర్థంపుఁ బెన్నిక్క చం
దురుతోఁబుట్టువు భారతీగిరిసుతల్ దోనాడు పూఁబోఁడి దా
మర లందుండెడు ముద్దరాలు జగముల్ మన్నించు నిల్లాలు భా
సురతన్ లేములు వాపు తల్లి–సిరి యిచ్చున్ నిత్యకళ్యాణముల్

భాగవతం, స్కం.1 – 11.

శ్రీ=సిరి. ఆమె శ్రీ మహావిష్ణువుకు పట్టపురాణి. పుణ్యాల ప్రోవు. సంపదల గని. చంద్రుని సోదరి, సరస్వతీ పార్వతులతో

**మార్చి 10, శ్రీలక్ష్మీజయంతి సందర్భంగా మన ప్రాచీన తెలుగుకవుల లక్ష్మీస్తుతులు సవాఖ్యానంతో కొన్ని మీకోసం...**

ఆడుకునే అందగత్తె. తామరపువ్వులో నివసించే సౌందర్యవతి. లోకాలన్నీ గౌరవించే ఇల్లాలు. దారిద్ర్యాన్ని పోగొట్టే తల్లి. ఆ మహాలక్ష్మి(సిరి) శాశ్వతశుభాలను ఇచ్చు గాక! లక్ష్మీదేవిని ఉల్లేఖాలంకారతో భూషించి వర్ణిస్తున్న పద్యమిది.

- - - - - - - -

సీ. సిరి దరిద్రునిఁ బట్టి శ్రీమంతుగాఁ జేయు
సిరి రోగి నారోగ్యసిద్ధుఁ జేయు
సిరి లోభి నతిదానశీలునిగాఁ జేయు
సిరి దుష్టచిత్తు విశిష్టుఁ జేయు
సిరి కురూపుని మనోహరమూర్తిగాఁ జేయు
సిరి దుర్బలుని బలస్థితునిఁ జేయు
సిరి మూఢు నతిశేముషీసమన్వితుఁ జేయు
సిరి పాతకుని పుణ్యపరునిఁ జేయు

గీ. సిరి నిరాయుష్యుఁ జిరకాల జీవిఁ జేయు
సిరి మహాక్రోధిఁ గారుణ్యసిద్ధుఁ జేయు
సిరి గలుగువారి కిష్టార్థసిద్ధి గాన
సిరి పొలఁతుక నాపాలఁ జెలఁగ వలయు

(లక్ష్మీనారాయణ పరిణయం)

శ్రీమహాలక్ష్మి (సిరి) దరిద్రుణ్ని ధనవంతుడిగా చేస్తుంది. దానితో వాడి జాతకం తిరుగుతుంది. రోగిని ఆరోగ్యవంతునిగా చేస్తుంది. పిసినారిని గొప్ప దాతగా చేస్తుంది. చెడు ప్రవర్తన కలవాణ్ని సన్మార్గుణ్ణిగా చేస్తుంది. వికారంగా ఉండేవాణ్ణి అందగాణ్ణి చేస్తుంది. బలహీనుణ్ణి బలవంతుడిగా చేస్తుంది. తెలివితక్కువవాణ్ణి మహాపాండిత్య సంపన్నుణ్ణి చేస్తుంది. పాపాత్ముణ్ణి పుణ్యాత్ముడిగా చేస్తుంది. ఆయుర్దాయం

లేనివాణ్ణి ఎంతోకాలం జీవించేవాడిగా చేస్తుంది. మహా కోపిని పరమశాంతుడిగా చేస్తుంది. సిరి సంపదలున్నవాడికే అన్ని కోరికలూ తీరతాయి. కనక శ్రీమహాలక్ష్మి అనే స్త్రీ (పొలఁతుక) నాపాలనే- నాచెంతనే- స్థిరంగా ఎప్పటికీ ఉండిపోవుగాక!

- - - - - - - -

సీ. మకరందచరదళీనికరఝుంకారమై
యలరారు నా కమలాకరమున
నాజవంజవ సాగరాంతర్నిమగ్న చిం
తాన్వితజనముల నరసి కరుణ
నుద్ధరింపఁ దలంచి శుద్ధ జాంబూనద
పద్మరాజమ్మున ఫాల్గుణమున
నుత్తరర్క్షమ్మున నొప్పైన పౌర్ణమీ
శుక్రవారమ్మున శక్రముఖులు

గీ. వినుతి సేయంగ లోకైకవినుతయైన
సుందరాంగి మహాలక్ష్మి శుభము లొసఁగఁ
గలిత తనుకల్పవల్లి లోకముల తల్లి
యవతరించెను నాల్గు బాహువులతోడ

(భార్గవపురాణము, 4-105)

ఇది పురాణశైలిలో సాగిన సీసపద్యం. దీన్ని కింది నుంచి పైకి అన్వయించుకుంటూ రావడంలో ఒక సుఖం ఉంది. సుందరాంగి- లోకైక వినుత (లోకాలన్నింటితోనూ అద్వితీయంగా పొగడ్తలందుకొన్నది) అయిన మహాలక్ష్మి నిస్సందేహంగా లోకాలన్నింటికీ తల్లి. అంటే లోకమాత. ఆ తల్లి నాలుగు బాహువులతో రూపుధరించి అవతరించింది. ఎందుకంటే- శుభాలు అందించడం కోసం (ఒసగన్). అందుకోసమే- కలిత తను కల్పవల్లి అయ్యింది. ఆమె ధరించిన శరీరం కల్పలతలాగా (వల్లి) ఉంది. ఇది బహువ్రీహి సమాసం. ధరింపబడిన (కలిత) తనువు అనే కల్పవల్లి కలదై నాల్గుబాహువులతో అవతరించింది.

ఈవిడ ఇలా అవతరిస్తున్నప్పుడు- లేదా- అవతరిస్తున్నందుకు సంబరపడి ఇంద్రాదిదేవతలందరూ (శక్రముఖులు) ఈమెను స్తుతించారు. వాళ్ళు వినుతులు చేస్తూండగా (చేయంగన్) అవి అందుకుంటూ ఈమె అవతరించింది. ఎప్పుడు? అంటే- ఫాల్గుణమాసంలో ఉత్తరా నక్షత్రంతో (ఋక్ష) ఒప్పారిన పున్నమి- శుక్రవారంనాడు (పౌర్ణమీ శుక్రవారమ్మునన్). శుక్రవారం- లక్ష్మీదేవికి ప్రీతిపాత్రమంటారు. ఆ రోజున పూర్ణిమకూడా అయ్యింది. అది ఫాల్గుణ పూర్ణిమ. అంటే ఉత్తరఫల్గునీ నక్షత్రయుక్తమైన ఫాల్గుణ పౌర్ణమీ శుక్రవారంనాడు అవతరించింది.

ఎక్కడ అవతరించింది? శుద్ధ జాంబూనద పద్మరాజమ్మునన్. మహారాజులాంటి పద్మంలో. మమూలు పద్మం కాదు. మేలిమి బంగారు (శుద్ధ- జాంబూనద) పద్మంలో. అందుకే అది పద్మరాజం. అందులో లక్ష్మి అవతరించింది. పద్మమన్నాక అది సరోవరంలోనే కదా ఉంటుంది. పద్మాలకు నిలయమైన (కమల- ఆకరమునన్) ఒక సరోవరంలో ఉంది ఈ పద్మరాజం. ఆ కమలాకరం- మకరందచరదళీనికరఝుంకారమై అలరారుతోంది.

చరధాతువుకి కదలడం- తిరగడం అనేవి ప్రసిద్ధార్థాలు. కానీ తినడం - ఆస్వాదించడం అనే అర్థాలూ- ఉన్నాయి (చరభక్షణే). ఇదే సందర్భోచితం. పద్మాలలోని మకరందాన్ని (పూలతేనె) ఆస్వాదిస్తున్న తుమ్మెదలగుంపుల (అళీ నికర) ఝుంకారాలతో (ఝుంకారాలు కలదై అని బహువ్రీహి) అలరారుతున్న కమలాకరంలోని పద్మరాజంలోకి లక్ష్మీదేవి అవతరించింది.

అవతరించడానికి లక్ష్యం ఏమిటి? సంసారం (ఆజవంజవ) అనే మహాసాగరంలో మునిగిపోయి (నిమగ్న) చింతిస్తున్న జనాలను (చింతాన్విత - జనములన్) లక్ష్మీదేవి కళ్ళారా చూసింది. చూసి (అరసి) జాలిపడింది. జాలిపడి ఊరుకోలేదు. ఆ కరుణతో వీళ్ళను ఉద్ధరించాలి- భవసాగరంనుంచి గట్టెక్కించాలని సంకల్పించుకుంది (ఉద్ధరింప దలంచి). అందుకని జగన్మాత- మహాలక్ష్మి శుద్ధజాంబూనదపద్మరాజంలో నాలుగు బాహువులతో (చతుర్విధపురుషార్థాలనూ అందించడానికి) అవతరించింది.




# ఆయన అనుకుంటేనే...

– శ్రీమతి కె.విజయలక్ష్మి

భక్తులు ఆర్తితో పిలిస్తే పలికే భగవానుడు, ఆదుకునే ఆపద్బాంధవుడు, తెలుగువారి ఇలువేల్పు అయిన తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారు నాకు ఇష్టదైవం. శ్రీవేంకటేశ్వరస్వామివారిని నేను చిన్నతనం నుంచే తండ్రిలాగా భావించేదానిని. ఎప్పుడు వీలైతే అప్పుడు తిరుమలకు వెళ్లి స్వామివారిని దర్శించుకుని రావడం నాకు అత్యంత ఇష్టమైన కార్యక్రమం. తిరుమల వెళ్లి ఆలయ గోపురం ఎదురుగా కూర్చుంటే చాలు నాకు అపరిమితమైన ఆనందం కలుగుతుంది. ఆ స్వామి దర్శనం ఇవ్వాలని ఆయన అనుకుంటేనే మనకు దర్శనభాగ్యం కలుగుతుంది. కానీ, మనం చేసుకోవాలనుకుంటే సాధ్యమయ్యేపనికాదు.

మా అన్నయ్య శ్రీసూర్యనారాయణ తిరుమల ఆంధ్రా బ్యాంకులో పనిచేస్తున్న సమయంలో అంటే 2010 ప్రాంతంలో స్వామివారు ఎన్నిసార్లు ఆయన దర్శనభాగ్యాన్ని కలిగించాడో, ఎన్ని రోజులు తిరుమలలో ఉండే భాగ్యాన్ని కలిగించాడో.. గుర్తుకు వస్తే మనస్సు పులకరిస్తుంది. ఆ సమయంలో బ్రహ్మోత్సవాలు, రథసప్తమి, స్వామివారి పరిణయోత్సవాలు, తెప్పోత్సవాలు, వైకుంఠ ఏకాదశినాడు వైకుంఠద్వారదర్శనం ఇలా ఎన్నో ఉత్సవాలు దర్శించుకునే భాగ్యాన్ని ఆ స్వామి ప్రసాదించాడు.

అంతేకాదు– ఆ సమయంలోనే కేవలం 5 అర్చన టిక్కెట్లు మాత్రమే ఉన్న రోజున కరెంట్ బుకింగ్ ర్యాండమ్ అలాట్‌మెంట్ సిస్టమ్‌లో నాకు, మా శ్రీవారికి అర్చన టిక్కెట్లు లభించేలా చేసి అరగంటకు పైగా కులశేఖరపడి సమీపంలో కూర్చుని స్వామి వారిని దర్శించుకునే భాగ్యాన్ని ప్రసాదించాడు. 'నన్ను ఆశీర్వదించి, నాకు స్ఫూర్తినిచ్చి నాలో ప్రవేశించి 'శ్రీవేంకటేశ్వరస్వామి చరిత్ర' అనే పేరుతో నిత్య పారాయణ గ్రంథాన్ని నాచేత రాయించింది నా తండ్రి శ్రీవేంకటేశ్వరుడు కాక.. మరెవ్వరు?

ఇటీవల కాలంలో స్వామివారిని దగ్గరగా చూడాలనే కోరిక అధికమైంది. "ఏం తండ్రీ! ఈ కూతురికి దర్శన భాగ్యాన్ని ప్రసాదించవా?" అని మనస్సులో అనుకున్నాను. అంతే.. 2019 నవంబర్ 13న మిత్రులందరం కుటుంబ సభ్యులతో కలసి తిరుమల వెళ్లాం. ముందే వసతి, సహస్ర దీపాలంకరణ సేవ టిక్కెట్లు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్నాం. సి.ఆర్.ఓ. ఆఫీస్‌లో అందరం వెళ్లి ర్యాండమ్ బుకింగ్ నమోదు చేసుకున్నాం. సాధారణంగా నేను, మావారు ఒకే సేవలకు ర్యాండమ్ సిస్టంకోసం నమోదు చేసుకుంటాము. క్యూలో నిల్చుని "ఏ సేవకు–" అని మా వారిని అడిగితే– 'అష్టదళపాదపద్మారాధన' అన్నారు. ఎందుకో తెలీదు నేను 'తోమాలసేవ' అని అన్నాను. "వద్దులే! ఇవి 25 కదా తగిలే అవకాశం అధికంగా ఉంటుంది. 'అష్టదళపాదపద్మారాధన' వేద్దాం" అన్నారాయన. నేను సరే అన్నట్లు ఉండిపోయాను. నమోదు దగ్గరకు వెళ్తూనే– "నేను తోమాలసేవకు వేస్తాను.. మీరు అష్టదళపాదపద్మారాధన సేవకు వేయండి. ఈసారి విడివిడిగా వేసి చూద్దాం...!" అని అన్నాను.

"అలాగే కానీ...." అన్నారు మావారు. అలాగే వేశాం. సాయంత్రం సహస్రదీపాలంకరణ సేవ, దర్శనం ముగిసి గదికి వెళ్లిచూస్తే 'తోమాలసేవ' టిక్కెట్లు అలాట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. నా ఆనందానికి అవధుల్లేవు.. 'నా తండ్రీ! నన్ను అనుగ్రహించావా?' అని స్వామికి మనస్సులోనే నమస్కరించుకున్నాను. మరునాడు తోమాల సేవలో 40 నిమిషాలకు పైగా సమీపంలో కూర్చుని దర్శించుకునే భాగ్యాన్ని ప్రసాదించాడు శ్రీనివాసుడు! ఇది ఆ శ్రీనివాసప్రభువులీల కాక ఇంకేమిటి?!

"ఓం నమో వేంకటేశాయ!"

# పరమయోగీశ్వరుల పద్ధతి

– శ్రీమతి శ్రీదేవీమురళీధర్

ఆంధ్రవాఙ్మయంలో అన్నమాచార్యుని స్థానం అద్వితీయం. భావప్రధానమైన ఆయన సంకీర్తనలు భక్తి, శృంగార, వైరాగ్యభావాలలో ఓలలాడుతూ తెలుగు పలుకు బడులు, లోకోక్తులు, సామెతలతో రసానందాన్ని కలిగిస్తాయి. అన్నమయ్య తన వారసులను కూడా కవులుగా, వాగ్గేయ కారులుగా తీర్చిదిద్దాడు. నిరంతర నారాయణోపాసన వల్ల వాక్శుద్ధిని పొంది నిగ్రహానుగ్రహసమర్థుడయ్యాడు.

ఈ మహాపురుషుడు తన ఎనిమిదవ ఏట తిరుమల శ్రీవేంకటేశ్వరుడి సాక్షాత్కారం, రామానుజదర్శనాన్ని ప్రతి పాదించే సంకీర్తనలు రచించడమనే దివ్యాదేశాన్ని పొంది, తన జీవితకాలంలో 32 వేలకు పైగా సంస్కృతాంధ్రాలలో సంకీర్తనలు, ఇతర సాహిత్యాలను వెలయించిన విద్వద్వ ర్యుడు. అన్నమాచార్యుని మనుమడు చిన్నన్న 'అన్నమా చార్యుని జీవితచరిత్రము' అనే ద్విపదకావ్యాన్ని రచించాడు.

రామానుజ నిర్ధారితసంప్రదాయాన్నే తరువాతి కాలంలో దేశిక సత్సంప్రదాయంగా సంభావించారు. అది ఆదివణ్ శఠకోపయతి ద్వారా అన్నమాచార్యునికి దక్కింది. అన్నమయ్య అహోబిల నరసింహోపాసకులు. శఠకోప యతీంద్రుల వద్ద దేశిక సత్సంప్రదాయంలో నిష్ణాతులై, సమాశ్రయణ, భరన్యాసములను పొందినట్లు 'అన్నమాచార్య జీవితచరిత్రం'లో సూచితం.

రామానుజదర్శనాన్ని, దేశిక సత్సంప్రదాయాన్ని తాను రచించిన వేనవేలకీర్తనలలో తెలుగువారికి విశదపర చిన దివ్యవాగ్గేయకారుడు తాళ్ళపాక అన్నమాచార్యుడు.

**పరమ యోగీశ్వరుల పద్ధతి ఇది**
**ధరణిలో వివేకులు దలపోసుకొనుట**

ఇది పరమయోగీశ్వరులు దర్శింపజేసే మార్గం. భూమండలంలోని విజ్ఞులు ఆమోదించి, అనుసరించేటటు వంటిది.

**మొదలనాత్మజ్ఞానము తెలిసి పిమ్మట**
**హృదయములోని హరినెఱుంగుట**
**వుదుటైన యింద్రియాల నొడిసి వంచుకొనుట**
**గుదిగొన్నతనలో కోరికె లుడుగుట**

మొట్టమొదట తనను తాను తెలుసుకోవటం ఆపై క్షేత్రజ్ఞుడైన శ్రీమహావిష్ణువును గుర్తించటం. ప్రబల మైన ఇంద్రియాలను వశపరచుకుని (జయించి), మనసు లోలోపలి పొరల్లో దూరి దాక్కున్న కోరికలను తరిమి వేయటం.

**తన పుణ్యఫలములు దైవము కొసగుట**
**పనివడి యతనిపై భక్తి చేసుట**
**తనివితో నిరంతర ధ్యానయోగపరుం డౌట**
**మనసులో బ్రకృతిసంబంధము మరచుట**

తాను ఆచరించే సత్కర్మల ఫలాలను భగవదర్పితం చెయ్యటం, అంటే కర్తృత్వపు అహంకారం బారిన పడకుండా జాగ్రత్తపడటం, ఉద్దేశపూర్వకంగా భగవత్స్మరణలో గడ పటం, మానవస్వభావసిద్ధమైన విషయాలను విస్మరిస్తూ సంతోషమనస్కులై, కేవలం భగవద్ధ్యాన పరాయణులై చరిం చటం.

**నడుమ నడుమ విజ్ఞానపుకథలు వినుట**
**చిడిముడి నాచార్యసేవసేయుట**
**యెడయక శ్రీవేంకటేశుపై భారమువేసి**
**కదు వైష్ణవులకృప గలిగి సుఖియించుట**

అత్యంత భక్తిశ్రద్ధలతో సదాచార్యుని సేవిస్తూ, జ్ఞాన సంపదను కూర్చిపెట్టే ప్రవచనాలను వింటూ ఉండటం, దేవదేవుడు శ్రీవేంకటేశ్వరునికి శరణాగతులై (భారము భగవానునిపై వేసి; భరన్యాసం) భాగవతసేవ చేస్తూ, వారి దయతో "వైష్ణవశ్రీ" అంటే ఆధ్యాత్మిక సంపత్తిని పొందుట. ఇదియే పరమయోగీశ్వరుల పద్ధతి! శరణాగతి మాత్రమే 'ప్రాప్యోపాయం' లేదా మోక్షసాధనమని అన్నమయ్య సంకీర్తన సారాంశం. ఇదే రామానుజులు తమ యావత్ దర్శనంలోను, వేదాంతదేశికులు తమ అసంఖ్యాకగ్రంథాల్లోను, శ్రీవైష్ణవ సంప్రదాయ గ్రంథచతుష్టయంలో ముఖ్యమైనదైన రహస్యా త్రయసారంలో బోధించిన ముఖ్యవిషయం.

ఆయుర్వేదం

# మామిడితో ఎన్నో లాభాలు!

- డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ, 9000761390

ఆధ్యాత్మికభావనతో పాటు ఆరోగ్యాన్ని పరిరక్షించే అత్యంత శక్తివంతమైన అపార ఔషధగుణాలు గల పవిత్ర వృక్షం మామిడి.

సంస్కృతంలో ఆమ్ర అని పిలువబడే అనకార్డియేసి అనే వృక్ష కుటుంబానికి చెందిన ఈ మామిడి శాస్త్రీయ నామం మాంగిఫెర ఇండిక.

మామిడికాయలు, మామిడి పళ్లుతో పాటు మామిడి చెట్టు ఆకులు, పువ్వులు, పిందెలు, బంక, బెరడు ఇలా అన్ని భాగాలు మన ఆరోగ్య పరిరక్షణకు ఎలా ఉపయోగ పడతాయో తెలుసుకుందాం.

**దగ్గు, ఉబ్బసానికి –** మామిడి టెంకలోని జీడిని ముక్కలుగా చేసి బాగా ఎండించి మెత్తగా చూర్ణం చేసి రోజు రెండు పూటలా పూటకి అర టీ స్పూను పొడిని తగినంత తేనెతో సేవిస్తుంటే చక్కటి ప్రయోజనం కలుగుతుంది.

**పొట్ట ప్రేగులలోని క్రిములకు–** మామిడి జీడిని ఎండించి చేసిన పొడి, బెల్లం ఒక్కొక్కటి 25 గ్రాముల చొప్పున తీసుకుని రెండింటిని కలిపి మెత్తగా దంచి ఉంచుకుని



ఉదయం, సాయంత్రం కుంకుడు గింజ ప్రమాణంలో తీసుకుంటే ఈ సమస్య తగ్గుతుంది.

**రక్త, బంక విరేచనాలకు–** రోజు మూడు పూటల పూటకి 2-3 గ్రాముల మామిడి జీడి పొడిని 100 మి.లీ. తాజా మజ్జిగలో కలిపి సేవిస్తు వుంటే రక్త, బంక విరేచనాలు తగ్గుతాయి.

**చుండ్రుకి –** వారానికి రెండుసార్లు తగినంత మామిడి జీడి పొడిలో తగినన్ని నీరు చేర్చి తలకి పట్టించి గంట తరువాత తలస్నానం చేయాలి.

**పేను కొరుకుడు సమస్యకు–** మామిడి జీడిని ఎండించి చేసిన పొడి, ఉసిరిక పొడి ఒక్కొక్కటి 50 గ్రాముల చొప్పున కలిపి ఉంచుకొని రోజు రెండు సార్లు తగినంత పొడిలో తగినన్ని ఆవు పాలు చేర్చి పేస్టులా చేసి సమస్య ఉన్న చోట పట్టిస్తు ఉండాలి.

**మామిడి జీడితో హెయిర్ ఆయిల్–** ఒక ఇనుప బాండలిలో ఒక కిలో నువ్వుల నూనె తీసుకుని అందులో పావు కిలో మామిడి జీడిని ఎండించి చేసిన పొడి, పావు కిలో త్రిఫల చూర్ణం కలిపి వారం పాటు అలాగే ఉంచాలి. రోజు ఉదయం, సాయంత్రం కలుపుతూ ఉండాలి. పిదప ఈ తైలాన్ని ఒక సీసాలో నిల్వ ఉంచుకొని వారానికి 1,2 సార్లు తలకి పట్టించి రెండు మూడు గంటలాగి తలస్నానం చేస్తూ వుంటే చిన్న వయస్సులో వెంట్రుకలు నెరవడం, వెంట్రుకలు వూడటం తగ్గుతాయి. కేశాలు నల్లగా నిగనిగలాడుతూ మృదుత్వాన్ని సంతరించుకుంటాయి.

**నీళ్ళ విరేచనాలకు–** రోజులో 3 లేదా 4 సార్లు పూటకి 10-15 లేత మామిడి చిగుర్లను మెత్తగా నూరి ముద్దగా చేసి మింగి పిదప 50 మి.లీ. తాజా పెరుగును సేవిస్తే తక్షణమే గుణం కనిపిస్తుంది.

# సంస్కృతం నేర్చుకుందాం..!!

పాఠం-02

నిర్వహణ - మహామహోపాధ్యాయ సముద్రాల లక్ష్మణయ్య & కిరణ్ భట్

## गुणिताक्षराणि (గుణితాక్షరాణి)

| | | |
|---|---|---|
| क् + अ = क | क् + ऊ = कू | क् + ऐ = कै |
| క్ + అ = క | క్ + ఊ = కూ | క్ + ఐ = కై |
| क् + आ = का | क् + ऋ = कृ | क् + ओ = को |
| క్ + ఆ = కా | క్ + ఋ = కృ | క్ + ఓ = కో |
| क् + इ = कि | क् + ॠ = कॄ | क् + औ = कौ |
| క్ + ఇ = కి | క్ + ౠ = కౄ | క్ + ఔ = కౌ |
| क् + ई = की | क् + ऌ = क्ऌ | क् + अं = कं |
| క్ + ఈ = కీ | క్ + ఌ = క్ఌ | క్ + అం = కం |
| क् + उ = कु | क् + ए = के | क् + अः = कः |
| క్ + ఉ = కు | క్ + ఏ = కే | క్ + అః = కః |

| | | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| ङ | ङा | ङि | ङी | ङु | ङू | ङृ | ङॄ | ङे | ङै | ङो | ङौ | ङं | ङः |
| ఙ | ఙా | ఙి | ఙీ | ఙు | ఙూ | ఙృ | ఙౄ | ఙే | ఙై | ఙో | ఙౌ | ఙం | ఙః |
| झ | झा | झि | झी | झु | झू | झृ | झॄ | झे | झै | झो | झौ | झं | झः |
| ఝ | ఝా | ఝి | ఝీ | ఝు | ఝూ | ఝృ | ఝౄ | ఝే | ఝై | ఝో | ఝౌ | ఝం | ఝః |
| र | रा | रि | री | रु | रू | रृ | रॄ | रे | रै | रो | रौ | रं | रः |
| ర | రా | రి | రీ | రు | రూ | రృ | రౄ | రే | రై | రో | రౌ | రం | రః |
| श | शा | शि | शी | शु | शू | शृ | शॄ | शे | शै | शो | शौ | शं | शः |
| శ | శా | శి | శీ | శు | శూ | శృ | శౄ | శే | శై | శో | శౌ | శం | శః |

# యజ్ఞోపవీత ధారణ ప్రాశస్త్యమ్

- "శిరోమణి", "విద్వాన్"
డా॥ పణతుల సుబ్బరాఘవయ్య,
94405 58647

"యజ్ఞో వై శ్రేష్ఠతమం కర్మ" తనకు, ఇతరులకు, లోకానికి, మేలు చేసే మంచి కార్యమే, యజ్ఞం. అలాంటి యజ్ఞమయజీవితాన్ని గడపడానికి సంకల్పించిన దాన్ని, వ్రతంగా పాటించే వ్యక్తులు, వ్రతసూత్రంగా ఈ ఉప వీతాన్ని ధరించాలని ఋషుల అభిప్రాయం.(యజ్ఞ+ఉప+ వీతమ్.) యజ్ఞమంటే దేవతల్ని పూజించడం. ఉప= శుభకార్యాల దగ్గరగా, వీతమ్= చేర్చేది. అని అర్థం.

అలాంటి సూత్రం మానవునకు తన వ్రతాన్ని సదా గుర్తుచేస్తూ ఎడమభుజం పైనుండి కుడివైపుకు అడ్డంగా వ్రేలాడవలెనని దీన్ని నిర్మాణం చేశారు. అప్పుడది, గుండె మీదుగ హృదయకుహరంలోని అణు స్వరూపజీవునిపై నుండి, జీవుడు ధరించేటట్లు వ్రేలాడుతూ ప్రాణశక్తికేంద్రమైన నాభిని తాకుతూ కుడివైపు కటి ప్రదేశంవరకు అంతమౌ తుంది.

పైన చెప్పిన వ్రతాన్ని దీక్షతో నెరవేర్చడానికి, కటి బద్ధుడై పూర్ణశక్తి సామర్థ్యాలతో, యజ్ఞమయ జీవితాన్ని గడపాలని ప్రబోధిస్తుంది.

మన శరీరంలోపల, వీపునుండి ఎడమభుజం మీదుగ, అడ్డంగా నడుం వరకు విల్లు వంటి ఒక ప్రాకృత రేఖయున్నట్లును, అది మానవుల్లో, విద్యుత్తును ఉత్పన్నం చేసి, ఇంద్రియాలలో, ఉష్ణాన్ని, ఉద్రేకాన్ని, కలిగిస్తుందనీ, దానివల్ల కామ, క్రోధాలు ఎక్కువవుతాయని వైజ్ఞానికుల నిర్ణయం.

ఈ రేఖ, స్పర్శమాత్రంతో ముకుళించుకొంటుందట. (టచ్ మీ నాట్ ఆకు వలె) అందువల్ల యజ్ఞోపవీతం, ఈ రేఖను తాకుతుండడం వల్ల, కామక్రోధాదుల్ని అదుపులో ఉంచి, కాముకునిగ, క్రోధితునిగ, హింసకునిగా, కాకుండా కాపాడుతుందని మన పెద్దల నమ్మకం. వేదోపదేశం గూడా.

## యజ్ఞోపవీత సూత్ర విధానం

మూడు పోగుల దారాన్ని ఒకటిగ చేసి ఆధారాల చివరలను కలిపి ముడివేస్తే, ఒక ముడి అవుతుంది. దీన్నే బ్రహ్మముడి అంటారు. 9 పోగుల యజ్ఞోపవీతాన్ని ధరిం చడం, ఆచారం. బ్రహ్మచారి ఒక ముడిని, గృహస్థు రెండు ముడులను, లేదా అదనంగా మూడవముడిని (ఉత్తరీ యార్థము) ధరించాలి.

ప్రతి మానవుడు పితృ, దేవ, ఋషి అను మూడు ఋణాలతో పుడుతున్నాడు. మానవుడు తప్పక ఈ ఋణాలు తీర్చుకోవడానికి చేయాల్సిన కర్మలు చేయడానికి యజ్ఞోపవీత ధారణతో సిద్ధమౌతున్నాడు.

మానవుడు ఇట్టి గొప్ప వ్రతకార్యాన్ని ఆచరించ డానికి దీక్షపూనాలి. దీక్షా విషయాన్ని (అ-19-30). యజుర్వేదం ఇలా చెప్పింది.

శ్లో॥ వ్రతేన దీక్షా మాప్నోతి, దీక్షయాప్నోతి దక్షిణామ్।
దక్షిణా, శ్రద్ధామాప్నోతి, శ్రద్ధయాసత్యమాప్నుతే॥

మానవుడు ద్రుఢసంకల్పంవల్ల సంకల్పించిన కార్యాచరణయందు దీక్షను పొందును. దీక్షవల్ల దక్షిణను= లాభము=సత్కారమును పొందుతాడు. లాభం పొందిన తర్వాత శ్రద్ధ ఏర్పడుతుంది. శ్రద్ధవల్ల సత్యం, పూర్ణసఫలత పొందవచ్చు.

మనఋషులు ఆ వ్రతాన్ని (ధృఢసంకల్పాన్ని) మాటిమాటికి గుర్తు చేసుకోవడానికి దీక్షాకంకణంగా ఈ యజ్ఞోపవీత సూత్రాన్ని ధరిస్తారు. శుభాశుభకర్మల సమగ్ర స్వరూపసూచికే యజ్ఞోపవీతం.

ఋషులు యజ్ఞోపవీతాన్ని ధరించేటపుడు, దాని ప్రయోజనాన్ని గుర్తింపజేసే విజ్ఞానాన్ని, మంత్రబద్ధం చేసి, వినియోగమంత్రంగా, చెప్పుకోవాలని నిర్దేశించారు.

మంత్రం॥ "యజ్ఞోపవీతం, పరమం పవిత్రమ్,
ప్రజాపతే ర్య త్సహజం, పురస్తాత్।
ఆయుష్యమగ్ర్యం, ప్రతిముంచ, శుభ్రం
యజ్ఞోపవీతం, బలమస్తు, తేజః"

యజ్ఞోపవీతాన్ని ధరించేటపుడు ఈ మంత్రాన్ని చెబుతూ వేసికోవడం ఆచారం.



శ్రీకాంతు పై భక్తి చిన్మూలము

## మంత్రార్థంలోని ఔచిత్యం

జీవరాసులలో మానవజన్మ అమూల్యమైంది. పది ఇంద్రియాలతో బుద్ధివికసించి ఉండే ఈ జన్మ పూర్వజన్మల సుకృతఫలం. యజ్ఞం కోసం ఉప వీతం= సూత్రధారణ. పరమం=శేష్ఠమైంది. పవిత్రం= ఏది మానవుడికి సదా తనను పవిత్రుణ్ణి చేసే సాధనాల్ని గుర్తుజేస్తుందో, దాన్ని పవిత్రమంటారు. తపస్సు, యమనియమాది అష్టాంగ సాధనాలతో ఇతరులకు మేలు చేసే పనులు చేయడం మొదలైన కార్యాలు చేయడానికి ప్రేరణనిచ్చే వాటిలో యజ్ఞోపవీతం, మిక్కిలి శ్రేష్ఠమైంది.

## ప్రజాపతేః యత్

ప్రజాపతిని= పరమేశ్వరుని చరాచర ప్రపంచాన్ని కల్పించి పాలించే ఆనందస్వరూపుని, మనం అన్నీ మరచి రాగద్వేషాదులతో తపిస్తున్నప్పుడు వెన్నుతట్టి మేల్కొలిపి పూర్ణానందస్వరూపప్రజాపతిని గుర్తుజేసి, అటువైపు నడిపిస్తుంది. అందుకే ఇది ప్రజాపతిని చేర్చే సూత్రం.

## సహజం పురస్తాత్

మానవుడు. జన్మించకముందు తల్లి గర్భంలో ఈ ఉపవీతం సహజంగా ప్రాకృతంగా ఉండేదే. పోషకాహారం, రక్తం ఆ బిడ్డకు బొడ్డునాళం ద్వారా అందుతుంది. అపుడా బిడ్డకు బొడ్డు త్రాడు యజ్ఞోపవీతంగా ఉంటుంది. యజ్ఞోప వీతం మానవుడికి వేదోపదేశ రసప్రాణాల్నిచ్చి, జీవితాంతం కాపాడుతుంది. అందుచేతనే సహజమైందని అర్థం.

## ఆయుష్యమ్

తల్లి గర్భంలో ప్రవేశించింది మొదలు మరణం వరకు ఉన్నదే ఆయువు. అనగా దీర్ఘాయుష్యమునకు కారణమైంది. మనం సాయంసంధ్యల్లో- పశ్యేమ శరద శృతమ్- భూయశ్చ శరదశృతాత్ అని సంకల్పం చేస్తుంటాం. ప్రాణాయామపూర్వకసంధ్యోపాసనలు చేసి, ఋషులు దీర్ఘాయువును పొందారు.

## అగ్ర్యమ్

ముందునిల్చునది-ప్రతి శుభకార్యానికి ముందు యజ్ఞోపవీతాన్ని ధరిస్తారు. కర్మశీలురకు ఇది మార్గదర్శి. యజ్ఞోపవీతం తాను ముందుండి, ధరించేవారిని, అగ్రగాములుగా చేస్తుంది.

## ప్రతిముంచ, శుభ్రమ్

ముంచ= అనగా విడచుట అని అర్థం. ప్రతి అనే ఉపసర్గ చేరడంవల్ల ధరించుము అని అర్థం వస్తుంది. శుభ్రమైన యజ్ఞోపవీతమును గ్రహించుచున్నాను అని తాత్పర్యము. మైలబడ్డ వెంటనే నూతన యజ్ఞోపవీతమును ధరింపవలెను.

## యజ్ఞోపవీతమ్

అట్టి దివ్యగుణాలు గల యజ్ఞోపవీతం.

## బలమస్తు తేజః

తేజస్వంతమైనకీర్తిని, బలాన్ని శారీరక, మానసిక, ఆధ్యాత్మికశక్తుల నొసంగి యజ్ఞోపవీతం మనల్ని కాపాడు గాక. ధర్మో రక్షతి రక్షితః.


రండి.. త్వరపడండి... స్టాకు ఉన్నంత వరకే...!

ప్రచురణల విక్రయవిభాగం, తి.తి.దేవస్థానములు, తిరుపతి

# తిరుమల శ్రీవేంకటేశుని హుండీలో బంగారునాణేలు

వెల: ~~రూ.2000/-~~

డిస్కౌంట్‌తో రూ.1600/-

కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీవేంకటేశ్వరస్వామివారు వెలసిన పవిత్ర పుణ్యక్షేత్రం తిరుమల. తిరుమల శ్రీవారిని ఎందరో చక్రవర్తులు, మహారాజులు, సామంతరాజులు, మండలాధీశులు, దండనాయకులు దర్శించి స్వామివారికి కానుకలు సమర్పించి శ్రీవారి అనుగ్రహానికి పాత్రులయ్యారు. క్రీ.శ.4వశతాబ్దం మొదలు 20వ శతాబ్దందాకా శ్రీవారిహుండీలో భక్తులు సమర్పించుకున్న బంగారునాణేల గురించి తెలుగు, ఆంగ్లభాషల్లోను, వెండి, రాగి మరియు ఇతర లోహనాణేల గురించి ఆంగ్లభాషలోను చక్కటి వివరణతో సచిత్రంగా శ్రీవేంకటేశ్వర పురావస్తు ప్రదర్శనశాల, తిరుమలవారు పుస్తకరూపంలో ముద్రించి భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చారు.

మరిన్ని వివరములకు సంప్రదించండి

ఉపకార్యనిర్వహణాధికారి, ప్రచురణల విక్రయవిభాగం, తి.తి.దేవస్థానముల ప్రెస్ కాంపౌండ్, కె.టి.రోడ్డు, తిరుపతి- 517 507. వివరాలకు - 0877-2264209 ఫోన్ నంబరును సంప్రదించగలరు. పోస్టుద్వారా పొందగోరువారికి పోస్టల్ ఛార్జీలు అదనం

# అనంతపద్యం

## (అనంతపురంజిల్లాపద్యసాహిత్యవికాసం)

**రచన - డా॥అమళ్లదిన్నె వేంకటరమణప్రసాద్**
**పుటలు- 817, వెల-రూ.900/-,**
**ప్రతులకు - రచయిత, ఇ.నెం.3/696, రామాలయం వద్ద, సోమనాథనగర్, అనంతపురం-515 004.**
**సెల్ - 94405 96127.**

ఒకప్పుడు సాహిత్యచరిత్రను విహంగావలోకన దృష్టితో పరిశీలించే పరిస్థితి. కాలాంతరంలో ఇంగ్లీషు సాహిత్యప్రభావంతో సాహిత్యచరిత్రను సమగ్రంగా పరిశీలించే ఆలోచన చాలామందికి కలిగింది. కాల క్రమంలో ప్రాంతీయ సాహిత్యావలోకనం పట్ల చరిత్ర కారులకు మక్కువ పెరిగింది. ఒక ప్రవాహం మిట్టపల్లాలకు అనుగుణంగా దిశను మార్చుకుంటూ ప్రవహించినట్లు సహృదయులలో "జిల్లాసాహిత్యంపై" ఆసక్తి పెరిగింది. ఇందుకు ప్రధానకారణాలు మూడు. కొందరు పనిగట్టుకుని "మీ జిల్లాలో చెప్పుకోదగ్గ సాహిత్యమేదని వెటకారంగా అనడం", రెండవది "జననీ జన్మభూమిశ్చ" అన్నట్లు సొంతగడ్డపై వెలసిన సాహిత్యం తెలుసుకోవాలనే ప్రగాఢకాంక్ష. మూడవది ఇతర ప్రాంతాల సాహిత్యానికి తమ జిల్లా సాహిత్యం ఏమాత్రం తీసిపోదని అభిమానంతో, సగర్వంగా నిరూపించాలనే ప్రయత్నం. ఈ కోవలో ఉభయ తెలుగురాష్ట్రాలలోనూ సాహిత్య చరిత్రలు వచ్చాయి.




ఈ అస్తిత్వవాద నేపథ్యంలో, స్థానికస్పృహతో డా॥ అమళ్లదిన్నె వేంకటరమణప్రసాద్ రచించి పాఠకుల ముందుకు తెచ్చిన బృహద్గ్రంథం "అనంతపద్యం" (అనంతపురంజిల్లా పద్యసాహిత్యవికాసం). ఈ పుస్తకం రావడానికి ప్రధానకారణం... రచయిత స్వయంగా అవధాని కావడం. పద్యవిద్యాభిమాని కావడం.

పద్యసాహిత్యప్రక్రియల్లో అనంతపురం పద్య సాహిత్యం విశిష్టమని చెప్పడానికి ప్రయత్నించడం. ఎన్ని కవిత్వ ప్రక్రియలు వచ్చినా నాటికీ, నేటికీ, పద్యానికున్న గౌరవం, దర్జా, శాశ్వతత్వం పద్యానికే ఉన్నాయనడంలో సందేహం లేదు.

ఒక జిల్లా పద్యసాహిత్యవికాసం రాయడం అంత తేలిక పనికాదు. విషయసేకరణలో ఎన్నో ఎగుడు దిగుడులు. పుస్తకాలసేకరణ గనులలో తవ్వకంలాంటిది. ప్రసిద్ధకవిపండితులతోడి సంభాషణలలో, చర్చలలో అసలు కన్నా అధరవులు ఎక్కువ. ఇదొక గరిడీ సాము. ఈ గరిడీలో విజయం సాధించారు అమళ్లదిన్నె ప్రసాద్‌గారు. ఈ సాహిత్యామృతమథనం 2016 మార్చిలో మొదలై 2017 ఆగష్టు దాకా సాగింది. ఈ సుదీర్ఘ కాలాన్ని పరిశీలిస్తే భర్తృహరి చెప్పిన "విఘ్న నిహన్య మానులగుచున్ ప్రారబ్ధార్థము లుజ్జ గింపర" నే వాక్యం గుర్తుకు వచ్చితీరుతుంది.

ఈ పుస్తకంలో 350 మంది పద్యరచయితలున్నారు. రచయిత పద్యసాహిత్య వికాసం చెప్పడమే ప్రధానమనుకున్నారు కనుక, కవుల జీవితవిశేషాల జోలికి పోలేదు.

అమళ్లదిన్నె వేంకటరమణప్రసాద్ గారు జగమెరిగిన "రసజ్ఞత" తెలిసిన అవధాని. ఆ కారణం వల్ల ఆయారచయితల రచనలలో చమత్కారయుతమైనవి, భావనాత్మకమైనవి, పదసంయోజనంలో విశిష్టత గలవి అయిన పద్యాలు ఉదహరిస్తూ "పద్యసాహిత్యవికాసం" కళ్లకు కట్టించారు.

ఈ సంకలనంలో భక్తి నీత్యాది సామాజిక స్పృహ కల్గించే శతకపద్యాలున్నాయి. లఘు కావ్య దీధితులున్నాయి. ఆయా సందర్భాల్లో అలవోకగా చెప్పిన "ఆశుపద్యాల" విసుర్లున్నాయి. కరవు కాటకాల కన్నీళ్లతో ఆర్ద్రమైన పద్యాలున్నాయి.

ఈ గ్రంథపఠనంలోనికి పాఠకుల్ని ఆహ్వానిస్తూ 'క్షామములెన్ని వచ్చిన రసజ్ఞత మాత్రము చావలేదు. జ్ఞానామృతవృష్టికిన్ కొఱతనంద దనంతపురంబు చూడుడీ'– అన్న రచయిత మాట అక్షరసత్యమని ఋజువు చేస్తుందీ గ్రంథం.

– డా॥ కంపల్లె రవిచంద్రన్.

# ఊర్మిళ

- డా॥ గాలి రాజేశ్వరి, 94400 17253

"రాముడు అరణ్యవాసానికి బయలుదేరుతున్నాడట!?... సీతాలక్ష్మణ సమేతంగా"... అయోధ్య అంతా అట్టుడుకుతోంది... విషయం ఊర్మిళను తాకింది... నిజమా!? ఇది నిజమా!? ఒక్క క్షణం మాన్పడిపోయింది... అందరికీ ఇది చేదువార్త... ఊర్మిళకు విషమ సమస్య... ఇది నిజమైతే ఆకాశం ఒరిగి పోలేదేం? ఇది నిజమైతే అవని కుంగిపోలేదేం? సూర్య చంద్రులు, నక్షత్రాలు రాలి పడలేదేం?...

క్షణకాలం మాత్రమే ఈ వార్త ఊర్మిళకు అశని పాతం. మరుక్షణం అది మాయమైంది. తనువునూ, మనసునూ కర్తవ్యం మేల్కొల్పింది. విజ్ఞత, విచక్షణ కార్యోన్ముఖిని చేసింది. "ఔను. ఇది విధి విధానం. జరగకూడనిదేదో జరగలేదు. జరగాల్సిందే జరిగింది. జరగవలసినదే జరుగు తుందెపుడూ... జరగబోయేదానికి సిద్ధపడాలి. జరుగుతున్నదాన్ని గమనించాలి. సంగతేదైనా అనుభవించాలి. ఆస్వాదించాలి. ప్రకృతి ప్రసాదించినదేన్నైనా సానుకూలంగా స్వీకరించాలి. ఇదే కదా జీవన్ముక్తి అంటే! జీవితం ఒంటరి పయనం. సమస్యను స్వయంగా పరిష్కరించుకోవాలి"-ఇది, జనకరాజ తనయ, సీతా సోదరి, నగర పాలక సుమిత్ర కోడలు, లక్ష్మణ సతి... మించి రామభక్త పరాయణ, ఊర్మిళ స్థిర నిర్ణయం! ఊర్మిళ విద్యావతి. జన్మతః యోగిని. రాజరికపు ధర్మాధర్మ సూక్ష్మాలను, జన్మ జీవితపు విశేష మర్మాలను తెలిసినది. కోపతాపాలకు అతీతమైంది. స్వాభిమాన. పుట్టినింటికీ మెట్టినింటికీ తేడా తెలియని మగువ.

సీత, ఊర్మిళ ఒకేచోట ఒకరి పెంపకంలోనే పెరిగారు. ఊర్మిళ అన్నింటా సీతతో సమానం. కానీ వారి వ్యక్తిత్వాలు భిన్నమైనవి. ఊర్మిళ స్థిత ప్రజ్ఞ. కార్యకారణ సంబంధాలు భూత భవిష్యద్వర్తమానాలను దర్శించగల జ్ఞానసంపన్న! ఇదొక దివ్యవిభూది! ఏ స్థితినైనా ఆనందంగా స్వీకరించి ప్రశాంతంగా జీవించే ఆధ్యాత్మిక శక్తిస్వరూప ఊర్మిళ!

ఊర్మిళ వివాహం సీత వివాహంతోబాటే, ఒకే వేదికమీద వేదోక్తంగా, శాస్త్రబద్ధంగా వశిష్ట, శతానందాది ముని శ్రేష్ఠుల చేతుల మీదుగా, అంగరంగ వైభవంగా జరిగింది. నాటికి, నేటికీ ఆ కల్యాణాలే చరిత్రలో ఆదర్శనీయాలు. 'ఊర్మిళ అసామాన్య'.


ఇక లక్ష్మణుడు రూపసి. రోషగాడు. రంగు తప్ప అంతా సాక్షాత్తూ రాముడే! దుడుకుతనమెక్కువ. రాముని అరణ్యవాస వార్త వినగానే కైకేయి మీదకు కత్తి దూశాడు. అతనిని రాముడు తప్ప ఎవ్వరూ నిలువరించలేరు. రాముడు లేని లక్ష్మణుడు మృత సమానుడే! జీవచ్ఛవమే! రాముడు ఆకృతి అయితే లక్ష్మణుడు ఛాయ! అలాంటి లక్ష్మణుడు రాముని విడిచి రాజ్యంలో ఉండలేడు. లక్ష్మణుని ఆపాలనుకోవడం వెఱ్ఱితనం, మూర్ఖత్వం. ఊర్మిళకు తమ పెళ్ళిలో మంత్రాలు గుర్తుకొచ్చాయి. వివాహం, దాంపత్యం ఈశ్వరార్పణబుద్ధితో చేసే విహితకర్మానుష్ఠానం. దంపతులు ఏకాత్మలు. ఆత్మాబంధాలకు దగ్గరలూ, దూరాలు లేవు, వుండవు.

లక్ష్మణునితో తాను కూడ వెళ్ళి, అతనికి అదనపు బరువు కాకూడదు. మేము ఒకరికి ఒకరు బలాలమే కానీ బలహీనతలం కాదు. మేము రామ సేవకులం. రామ సేవ కంటే మాకు దాంపత్య సుఖం గొప్పది (ఎక్కువ) కాదు... ఇలా అనుకుంటున్న ఊర్మిళ దగ్గరకు లక్ష్మణుడు రానే వచ్చాడు. అవిశ్రాంతంగా వస్తున్న భర్తకు ఎదురు వెళ్ళింది ఊర్మిళ. లక్ష్మణునికి ఇది ఉపశమనం. తన అరణ్యవాస నిర్ణయాన్ని, అమ్మ సుమిత్ర అంగీకారాన్ని తెలిపాడు. అతనిని ఆపే శక్తి ఊర్మిళకు లేదు. లక్ష్మణుని లక్ష్యానికి తను ఏవిధంగానూ ఆటంకం కాకూడదు. లక్ష్మణునితో ఊర్మిళ ఇలా అంది. ప్రభూ! మీ నిర్ణయం హర్షణీయం. ధర్మబద్ధం. పెళ్ళి మంత్రాలకు, అర్థాలు, ఆకారాలు మనమే! రామకార్యం మనకు గర్వకారణం. మీరు నగర పాలిక, తల్లి

అయిన సుమిత్ర మాటను మన్నించి తీరాలి. అడవినే అయోధ్యగా, సీతారాములనే తల్లిదండ్రు లుగా సేవించండి అంటూ ఉత్సాహంగా తన సమ్మతిని తెలిపింది. మరి నీ పరిస్థితి ఏమిటని అడిగాడు లక్ష్మణుడు. జవాబుగ ఒక చిన్న నవ్వు నవ్వింది. బాల్యం నుండి నిద్ర తక్కువ. ఇప్పుడు తనివితీరా నిద్రపోతాను. అరణ్య వాసానంతరం నీవు స్పర్శించగానే మేల్కొంటాను. సుషుప్తి దాటి తురీయావస్థలో నన్ను నేను మరిచిపోగలను అంది.

రాముని వెంట వెళ్ళేందుకు, లక్ష్మణుడు భార్య సహకారంతో సన్నాహాలు ప్రారంభించాడు. ఆభరణాలను, అలంకారాలను విసర్జించాడు. పీతాంబరాలను పక్కన పెట్టాడు. నారచీరను ధరించాడు. ఊర్మిళ సహకారానికి, ప్రోత్సాహానికి లక్ష్మణుడు పొంగిపోయాడు. పతి మాట వినే సతి ఉంటే, సతి మాటను మన్నించే పతి ఉంటే– అది సీతారాముల, ఊర్మిళాలక్ష్మణుల దాంపత్యమే! మనసున మనసై బతుకున బతుకై అంటే ఇదే! సర్వకాల సర్వావస్థలలోనూ వీరి దాంపత్యం లోకానికి మార్గదర్శనం!

సీతారామలక్ష్మణులు అరణ్యవాసానికి బయలు దేరారు. రాజవీధిలో ముందుగా రాముడు, అతనిననుసరించి



సీత, వారిని వెన్నంటి లక్ష్మణుడు నడుస్తున్నారు. ప్రజలందరూ వీధికిరువైపులా కన్నీటితో తనివితీరా వారిని చూసుకుంటున్నారు. లక్ష్మణుడొక్కసారి తలఎత్తి అంతఃపుర సౌధాల కేసి చూపు సారించాడు. అంతఃపుర గవాక్షం నుండీ రెండు అక్షులు ఆప్యాయతానురాగాలను కురిపిస్తున్నాయి. చూపులు కలిశాయి. మౌనంగా మాట్లాడుకున్నాయి. రామ కార్యార్థివైన నీ వెనుక నేనున్నానంటూ శుభతోరణాలై రామానుజుని వెన్నంటి సాగనంపాయి ఊర్మిళ చూపులు.

ఊర్మిళ అంతఃపురంలో తన అభ్యంతర మందిరాన్ని చేరింది. ఎటు చూసినా, సీతారామలక్ష్మణులే కనిపిస్తున్నారు. దాంపత్య జీవనస్మృతులు, లక్ష్మణుని అనురాగం మరి మరీ పలకరిస్తున్నాయి. రాముని తర్వాత సర్వమూ లక్ష్మణునికి తానే అని ఊర్మిళకు తెలుసు. లక్ష్మణుడు విడిచిన పీతాంబరాలు, ఆభరణాలను అపురూపంగా చూసింది. ఆప్యాయంగా, అభిమానంగా వాటిని స్పృశించి, హృదయానికి హత్తుకుంది. తమ ప్రణయ పరిష్వంగాన్ని తలచుకుంటూ పానుపు మీద పవళించింది. కొన్ని సంవత్సరాల తర్వాత పొందబోయే భర్త సాన్నిధ్యాన్ని తలచుకుంటూ, ప్రభూ! నువ్వెక్కడికీ వెళ్ళలేదు. మనకు ఎడబాటు ఎక్కడుంది!? తనువులెక్కడున్నా మనం ఏకాత్మలమే. నారచీరను అసలు కట్టలేదు. సున్నితమైన నా మనసు అనే చీరను చుట్టుకుని, నా అంతరంగంలోనే వున్నావు. నీ చుట్టూ నేను, నా లోపల నువ్వు! నీ లోపల పురుషోత్తమ తత్త్వం. ఈ మూడూ ఏకమైన ఈ క్షణం అవలోకనంలో ఆనంద విహారం. ఇలా తనలో తాను అనుకుంటూ తనలోకి తాను వెళ్ళిపోయింది. తనువూ, మనసూ ఏకమయ్యే యోగమే నిద్ర. ఇది ఆధ్యాత్మిక నిద్ర. తన్మయ స్థితి. నిర్వికల్ప సమాధి.

సామాన్యుల ఊహలకు అంతు చిక్కని జ్ఞానయోగి ఊర్మిళ. వాల్మీకి రామాయణంలో ఊర్మిళను నిశ్శబ్దంగానే శబ్దించాడు. ఆ అవకాశాన్ని ఇచ్చి పాఠకులకు వెసులుబాటు కల్గించాడు. ఈ కాలానికి ఊర్మిళ అధ్యయనం ఎంతో అవసరం, ఆరోగ్యం.

మార్చి, 2020

# రాశిఫలాలు

బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి,
తి.తి.దే. ఆస్థానసిద్ధాంతి, రేలంగి



**మేషం–** ప్రథమార్ధంలో ధనలాభం, ఉత్త రార్ధంలో ధనవ్యయం, ఆరోగ్యం, అర్ధలాభం, తేజస్సు, కీర్తి, విద్య అన్నిపనులు అనుకూల మగుట, గృహమందు సంతోషసౌఖ్యాలు, తలచిన కార్యాలు నెరవేరి, ధనలాభం కల్గుట, వృత్తి, ఉద్యోగాల్లో ఉన్నతి.



**వృషభం–**ప్రమాదం జరిగే అవకాశముంది. జాగ్రత్తగా ఉండడం మంచిది. ధనలాభం కల్గుతుంది. ఈ మాసం రెండవభాగంలో హుషారుగా ఉంటారు. వీసా మొదలగు విషయాల్లో జయించుకొస్తారు. సుబ్రహ్మణ్య ఆరాధన శ్రేయస్కరం.



**మిథునం–**మాసారంభంలో శ్వాసకోశసంబంధ ఇబ్బంది ఉన్నా, దాన్ని అధిగమిస్తారు. అధి కారయోగం కలుగుతుంది. వృత్తిఉద్యోగాల్లో రాణిస్తారు. పిల్లల పట్ల శ్రద్ధ కనబరుస్తారు.



**కర్కాటకం–** ఒత్తిడి పెరుగుతుంది. అయినా లెక్కచేయక ముందుకు సాగగలరు. కుటుంబ పరంగా ముందంజ వేస్తారు. రాహు గ్రహ ఆరాధన మేలు చేస్తుంది.



**సింహం–** విద్యార్థులు విద్యావ్యాసంగాలలో రాణించుట, ఇతరుల సలహాలు పాటించి వ్యవహారజయాలు పొందుతారు. నెల మధ్యలో పుణ్యక్షేత్ర సందర్శనం, నెలాఖరులో ఆకస్మిక ధనలాభాలు.



**కన్య–**పెట్టుబడులు అనుకూలించి, అధిక ఆదాయం చేకూరుతుంది.. ద్వితీయార్ధంలో నిరాశ, స్పృహలు కల్గును. మృత్యుంజయ పారాయణ, రుద్రాభిషేకం చేయుట మంచివి. నూతన వస్తుసామగ్రిని కొనుగోలు చేస్తారు.



**తుల–**తలచిన కార్యాలు నెరవేరుతాయి. ధనధాన్య లాభాలు, శత్రుజయం, విద్యార్థు లకు గురుబలం తక్కువ కావడం వల్ల శ్రమిం చిన గాని ఉత్తీర్ణులగుట కష్టం. మోకాళ్లు, పిక్కలు ఎముకల సంబంధ అనారోగ్యం.



**వృశ్చికం–**భోగభాగ్యాలు అనుభవిస్తారు. ఇంటాబయటా ఆనందం కలుగుతుంది. విద్యా ఉద్యోగవిషయాల్లో మీ పిల్లలు పురోగ మిస్తారు. అనవసర ప్రసంగాలు తగ్గించడం మంచిది.



**ధనుస్సు–** ధైర్యంతో వ్యవహరిస్తే కార్యజయం, అపరిష్కృత సమస్యలకు పరిష్కారం లభిం చును. ఆయురారోగ్యవృద్ధి, కళత్ర, పుత్ర మిత్రాదులతో ఆనందమయజీవనం. విద్యార్థులకు కలసి వచ్చుకాలం.



**మకరం–** సంతతికి ఉన్నతస్థితి కల్గును. విద్యా ర్థులు శ్రమించి ప్రగతిపథంలోకి వస్తారు. వస్తుభూషణాదులు సముపార్జన చేస్తారు. వాగ్ధాటి ప్రదర్శించి ఇతరుల్ని మెప్పిస్తారు. గృహనిర్మాణం ప్రారంభిస్తారు.



**కుంభం–** పూర్వీకులు నుంచి సంక్రమించిన ఆస్తులకు మార్పులు చేర్పులు చేస్తారు. భూగృహస్థిరాస్తుల కొనుగోలు విషయంలో సరైన నిర్ణయం తీసుకుంటారు. అధికం ధన వ్యయం.



**మీనం–** ఉద్యోగులకు పై అధికారుల అండ దండలు కలుగుతాయి. ఉన్నత అధికారం సిద్ధి స్తుంది. భూ, గృహలాభాలు కలుగుతాయి. వాక్చాతుర్యంతో కార్యజయం పొందుతారు.

**సవరణ:** ఫిబ్రవరి సంచిక (పుట–51)లో రాశిఫలాలు శీర్షికలో తులరాశి చిహ్నం స్థానంలో ధనుస్సురాశి చిహ్నం పొరబాటున అచ్చు అయ్యింది. పొరబాటుకు చింతిస్తున్నాం. **– ప్రధాన సంపాదకుడు**

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

# సప్తగిరి

(ఆధ్యాత్మిక మాసపత్రిక)



## చందా నమోదు పత్రం

**1. పేరు మరియు చిరునామా :**
(విడి విడి అక్షరాలలో అర్థమయ్యేలా వ్రాయండి & పిన్‌కోడ్ తప్పక వ్రాయండి)

(పిన్‌కోడ్ తప్పని సరి)

సెల్ నెం.

**2. కావలసిన భాష :**

తెలుగు ☐ తమిళం ☐ కన్నడం ☐
హిందీ ☐ ఆంగ్లం ☐ సంస్కృతం (సంవత్సరచందా మాత్రమే) ☐

**3. సంవత్సర/జీవిత చందా :**

రూ.60/- ☐ రూ.500/- ☐

**4. చందా పునరుద్ధరణ :**

(అ) చందా నెంబరు :

(ఆ) భాష :

**5. చెల్లించిన మొత్తం :**

డి.డి.నెం. :

తేది :

(చెక్కులు స్వీకరించబడవు)

ప్రదేశం :

తేది : చందాదారుని సంతకం

1) సప్తగిరి సంవత్సర చందా రూ.60/-, జీవితచందా రూ.500/-లు; డి.డి. / ఎం.ఓ.ను 'చీఫ్ ఎడిటర్, 'సప్తగిరి', తి.తి.దే., తిరుపతి' వారిపేరున తీయాలి.

2) సప్తగిరిచందాదారులుగా చేరదలచుకొన్నవారు/ తమచందాను పునరుద్ధరించుకోదలచినవారు ఈ కూపనులో గానీ లేక తెల్లకాగితంలోగానీ పైన పేర్కొన్నవిధంగా వివరాలు వ్రాసి, పంపవచ్చు. క్రింద ప్రచురించిన చిరునామాను మాత్రమే సంప్రదించండి. ప్రధానసంపాదకకార్యాలయం, తి.తి.దే., తిరుపతికి తప్ప-మీరు ఎవరిదగ్గర డబ్బులు కట్టి, మోసపోకండి.

3) మనిఆర్డరు పంపేవారు - అందులోనే మీచందావివరాలు వ్రాసి, ఈ క్రింది చిరునామాకు పంపాలి.

4) మా చిరునామా "ప్రధాన సంపాదకుడు, సప్తగిరి కార్యాలయం, టి.టి.డి. ప్రెస్ కాంపౌండ్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507".

5) ఇతర వివరాలకు ఫోన్ నెం.0877-2233333, 2277777.

51

# వైకుంఠపాళి

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | ■ | 2 | | 3 | | 4 | ■ | ■ |
| | ■ | | ■ | | ■ | | ■ | 5 |
| 6 | | ■ | 7 | | | ■ | 8 | |
| | ■ | 9 | ■ | | ■ | 10 | ■ | |
| ■ | 11 | | | ■ | 12 | | | ■ |
| 13 | ■ | | ■ | 14 | ■ | | ■ | 15 |
| 16 | | ■ | 17 | | | ■ | 18 | |
| | ■ | 19 | ■ | | ■ | 20 | ■ | |
| ■ | ■ | 21 | | | | | ■ | ■ |

**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు

## అడ్డం

2)హిరణ్యాక్షుని భార్య(5); 6)ఒక పండు(2); 7)విరాటరాజుని సంపద(3); 8)ప్రేమ(2); 11)ద్రోణాచార్యుని బావమరిది(3); 12)అయోధ్యకు మరోపేరు(3); 16)ఈ రాక్షసుని చంపుట వల్ల కృష్ణునికి కేశవుడును పేరు కల్గింది(2); 17)స్తుతి(3); 18)ద్రోణాచార్యుని భార్య(2); 21)సరస్వతి(5)

## నిలువు

1)కుబేరుని భార్య(4); 2)పార్వతి(2); 3)రాక్షసులు(4); 4)విత్తనమునకు పర్యాయపదం(2); 5)యముని భార్య(3); 9)శిఖరము(3); 10)కేకయదేశపురాజు కూతురు(3); 13)భరతుని తల్లి(3); 14)గరుత్మంతునికి మరోపేరు(4); 15)'చీమ'కు పర్యాయపదం(3); 19)వంట(2); 20)కన్నతల్లిని మనసారా ఇలా పిలుస్తారు(2).

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.

- ప్రధాన సంపాదకుడు



Edited and published on behalf of T.T.Devasthanams by Dr. K.Radha Ramana, M.A., M.Phil., Ph.D., Chief Editor, T.T.D. and printed at T.T.D. Press by Sri R.V.Vijaya Kumar, B.A., B.Ed., Dy. E.O., (Publications & Press), T.T.D. Press, Tirupati - 517507.

తిరుమల తిరుపతి దేవస్థానములు

# ఒంటిమిట్ట
# శ్రీకోదండరామస్వామివారి బ్రహ్మోత్సవం

## 02-04-2020 నుండి 10-04-2020 వరకు









**02-04-2020 గురువారం**
పగలు: ధ్వజారోహణం
రాత్రి: శేషవాహనం

**03-04-2020 శుక్రవారం**
పగలు: వేణుగానాలంకారం
రాత్రి: హంసవాహనం

**04-04-2020 శనివారం**
పగలు: వటపత్రశాయి అలంకారం
రాత్రి: సింహవాహనం

**05-04-2020 ఆదివారం**
పగలు: నవనీతకృష్ణాలంకారం
రాత్రి: హనుమత్సేవ

**06-04-2020 సోమవారం**
పగలు: మోహినీసేవ
రాత్రి: గరుడసేవ

**07-04-2020 మంగళవారం**
పగలు: శివధనుర్బాణాలంకారం
రాత్రి: ఎదుర్కోలు, కల్యాణోత్సవం, గజవాహనం

**08-04-2020 బుధవారం**
పగలు: రథోత్సవం

**09-04-2020 గురువారం**
పగలు: కాళీయమర్దనాలంకారం
రాత్రి: అశ్వవాహనం

**10-04-2020 శుక్రవారం**
పగలు: చక్రతీర్థం
రాత్రి: ధ్వజావరోహణం

SAPTHAGIRI (TELUGU) ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthanams
printing on 25-02-2020. Regd. with the Registrar of Newspapers under "RNI" No.10742, Postal Regd.No.TRP/10 - 2018-2020
Licensed to post without prepayment No.PMGK/RNP/WPP-04/2018-2020

